మే
2024

217

సంపుటి : 19 సంచిక : 12 వెల రు. 15 /-

ఈ సంచికలో........

ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి ఎక్కడ?

ఎన్నికల బాండ్లు ఒక భారీ కుంభకోణం

దక్షిణాదిన కొత్త రాజ్యాల స్థాపన-విస్తరణ

భారత ఆర్థికాభివృద్ధి: అన్నీ అనుమానాలే

ప్రజాస్వామ్య పరిరక్షణా సంవత్సరం

ఇజ్రాయిల్ దాష్టీకంపై అమెరికాలో విద్యార్థుల నిరసన వెల్లువ

విశ్వగురు కాదు మరుగుజ్జు

విప్లవ మహిళ రోజా లక్సెంబర్గ్

ఆశయాల శిఖరం కామ్రేడ్ పర్స

చరిత్ర

# ఆశయాల శిఖరం కామ్రేడ్ పర్సా

## మే 22న కామ్రేడ్ పర్సా సత్యనారాయణ వర్ధంతి

**వై రాము**



"కమ్యూనిస్టు ఒక ప్రత్యేక తరహా వ్యక్తి. అతనికి అతని కర్తవ్యమే సర్వస్వం" ఈ వాఖ్యలు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ జీవితానికి సరిగ్గా సరిపోతాయి. ఆయన ఉద్యమ ప్రస్థానంలో చాలా ప్రత్యేకతలున్నాయి. అనేక మలుపులున్నాయి. కామ్రేడ్ పర్సా బోధించినట్లుగా రాజకీయ భూగోళ శాస్త్రం పాఠాన్ని ఆస్థాయిలో ఎవ్వరూ చెప్పలేరు. ప్రపంచ రాజకీయ పరిణామాలను వర్గ దృష్టితో మ్యాప్‌ను చూపిస్తూ సరళంగా పాఠం చెప్పడంలో దిట్ట. చలోక్తులు విసరడంలో, వయస్సుతో సంబంధం లేకుండా అందరిలో కలసిపోవడం కామ్రేడ్ పర్సా ప్రత్యేకత. జీవిత చరమాంకం వరకు కామ్రేడ్ పర్సా పార్టీ క్రమశిక్షణతో రాజీ పడకుండా నిబద్ధతతోనే బ్రతికారు. సైద్ధాంతిక విషయాల్లో ఎక్కడా రాజీపడలేదు. ఎంత చనువుగా ఉన్నా నిర్మాణ విషయాలు బయట పెట్టేవారు కాదు. ముఖ్యంగా యువ కామ్రేడ్స్‌లో ఉత్తేజాన్ని నింపేవారు. అధ్యయనం ప్రాముఖ్యతను నొక్కి చెప్పేవారు. ప్రపంచ పరిణామాలను నేటి, తరం తప్పకుండా తెలుసుకోవాలనేవారు. విశ్వాసం ఉన్న కార్యకర్తలకి సిద్ధాంత పరిజ్ఞానం కూడా కలిస్తే కమిట్మెంట్ పెరుగుతుంది. అది శాశ్వతంగా ఉంచడానికి దోహదపడుతుందని తరుచూ చేప్తుండేవారు.

కామ్రేడ్ పర్సా సత్యనారాయణ గుంటూరు జిల్లా పూర్వపు సత్తెనపల్లి తాలుకాలోని కంభంపాడులో వెంకట సుబ్బమ్మ, వెంకమరాజులకు జన్మించారు. ఊర్లోనే గ్రాంట్ స్కూల్‌లో 4వ తరగతి వరకు చదివారు. అనంతరం తెనాలి తాలూకా నందివెలుగుకు వెళ్ళి 1937 వరకు అక్కడే చదువుకున్నారు. తరువాత దుగ్గిరాలలోని హైస్కూల్‌లో థర్డ్ ఫామ్‌లో చేరారు. ఇక్కడే కొంగర జగ్గయ్య (సిని నటుడు)తో కలిసి చదువుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన సత్యాగ్రహి బొడ్డువల్లి సోమయాజుల సహాయంతో గుంటూరులో ఎస్.ఎస్.ఎల్సి చదివారు. బ్రాడిపేటలో పొద్దునే లేచి ఇంటింటికి పేపరు వేసివారు. తద్వారా వచ్చిన డబ్బులతో గడిపేవారు.

**అమరవీరుడు శేషగిరి రావు తో పరిచయం**

నంది వెలుగులో చదువుతున్న సమయంలోనే సింగరేణి ఉద్యోగులు పరిచమయ్యారు. వారి సహాయంతో కొత్తగూడెం చేరుకుని అక్కడ మిన్నికంటి పర్వతాల .ను కలుసుకున్నారు. పర్వతాలు సింగరేణిలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. అక్కడే డి. శేషగిరిరావుతో పరిచయమేర్పడింది. అప్పటికే శేషగిరిరావు యూనియన్ నాయకుడు. ఆయన ప్రోద్భలంతోనే పర్సకు సింగరేణి కంపెనీలో ఉద్యోగం దొరికింది. 1943 సం॥లో కంపెనీలో చేరిననాటి నుండి 1946 సం॥ వరకు ఆయిల్ ఇస్యూయర్ నుండి రేషన్ ఇస్యూవర్‌గా పని చేశారు. కార్మికులతో దగ్గర సంబందాలేర్పడ్డాయి. ఈ క్రమంలోనే కామ్రేడ్ శేషగిరిరావు దృష్టి కామ్రేడ్ పర్సపై పడింది. శేషగిరిరావు సుందరయ్య శిష్యుడు. నెల్లూరు జిల్లా వాసి . సింగరేణిలో జాబ్ చేయమని సుందరయ్యే పంపించారు. రహస్యంగా యూనియన్ నిర్మాణం చేస్తున్నారు. అత్యంత పకడ్బందీగా, తమకు అనుకూలంగా ఉన్నవారితోనే నిర్మాణం జరిగేది. అలా యూనియన్‌లోకి కామ్రేడ్ పర్సను తీసుకోచ్చారు. సంవత్సరం తరువాత పార్టీలోకి తీసుకొచ్చారు. నిర్భందాల నడుమ రహస్యంగా పార్టీ నిర్మాణం జరిగేది. కార్యక్రమాలు పెరుగుతున్న సందర్భంలో యాజమాన్యానికి పర్స పై అనుమానం పెరిగింది. నువ్వు కంపెని అవర్స్‌లో యూనియన్ పని చేస్తున్నావు. ఇది నేరం అంటూ తొలగించారు. పర్సను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ 4 వేల మందితో కార్మికులు హెడ్ ఆఫీస్ ముందు బైఠాయించారు. యాజమాన్యానికి దిక్కు తెలియక మరలా ఉద్యోగమిచ్చారు అయితే పని చేసే ప్రాంతాల్ని మార్చేశారు.

ఏఐటియూసి మహాసభ కలకత్తాలో జరుగుతోంది. దానికి కామ్రేడ్ పర్సా కామ్రేడ్ శేషగిరిరావులు హాజరుకావాల్సి ఉంది. రాత్రికి ఆఫీస్‌లో ఉండి ఉదయమే బయలుదేరాలి అనుకున్నారు. హఠాత్తుగా తెల్లవారేటప్పుడికి పోలీసులు వచ్చి చుట్టుముట్టారు. ఆది మొదటి షిఫ్ట్ సమయం. పోలీసులను నిలువరిస్తూ బయటే ప్రతిఘటించారు. ఆటుగా వెళ్తున్న కార్మికులకి విషయం తెలిసింది. సింగరేణి కాలనీ మొత్తం యూనియన్ నాయకుల్ని పోలీసులు అరెస్ట్ చేస్తున్నారన్న విషయం పాకిపోయింది. పెద్ద సంఖ్యలో కార్మికులు వచ్చేసారు. శేషగిరిరావు ఉపన్యాసం అందుకున్నారు. ఈలోగా సమయం చూసుకుని గుమిగూడిన కార్మికుల మధ్య నుండి కామ్రేడ్ పర్స తప్పించుకున్నారు. ఆఫీస్ వెనుక భాగం నుండి ఊరు బయటకు వచ్చేసారు. పోలీసు వ్యాన్‌లు లైన్‌గా ఊర్లోకి వెళ్లడం చూసి శేషగిరిరావుకు వెంటనే తప్పుకోమని స్లిప్ మీద రాసి పంపించారు, చాకచక్యంగా శేషగిరిరావు కూడా పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకున్నారు. పర్స విజయవాడ చేరుకున్నారు. విజయవాడ రావడం అదే తొలిసారి. ఎవరూ తెలియదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు, "కామ్రేడ్స్ హొటల్' అన్న బోర్డును చూసి అక్కడ వివరాలు తెలుసుకుని మొగల్రాజపురం

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఆశయాల శిఖరం కామ్రేడ్ పర్స
వై రాము........2

2. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి ఎక్కడ?
వి శ్రీనివాసరావు ........4

3. ఎన్నికల బాండ్లు ఒక భారీ కుంభకోణం
ఎస్ మేఘనంద్, పరంజోయ్ గుహ ఠాకుర్తా, అబీర్ దాస్ గుప్తా........10

4. దక్షిణాదిన కొత్త రాజ్యాల స్థాపన-విస్తరణ
ఎంవిఎస్ శర్మ........15

5. భారత ఆర్థికాభివృద్ధి: అన్నీ అనుమానాలే
సుకుమార్ మురళీధరన్........18

6. ప్రజాస్వామ్య పరిరక్షణా సంవత్సరం
సతీశ్ దేశ్‌పాండే........21

7. ఇజ్రాయిల్ దాష్టీకంపై అమెరికాలో విద్యార్థుల నిరసన వెల్లువ
ఎస్.వెంకట్రావు........26

8. విశ్వగురు కాదు మరుగుజ్జు
ఎ.కోటిరెడ్డి........29

9. విప్లవ మహిళ రోజా లక్సెంబర్గ్
టి చంద్రపాల్........32



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# అబద్ధాల ప్రచారం

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఓటమి భయం ఎంతగా వణికిస్తోందో గత కొద్ది రోజులుగా ప్రధాన మంత్రి పదవిలో ఉన్న నరేంద్ర మోడీ నిస్సిగ్గుగా వల్లిస్తున్న అబద్ధాలే వెల్లడిస్తున్నాయి. ఎన్నికల్లో రెండు విడతలు ముగిసిన తరువాత నుండి కాషాయ పరివారం ముఖ్యంగా మోడీ ప్రచారం తీరు మారిపోయింది. ఆయన తన ప్రసంగాల్లో నేరుగా ముస్లిం మైనారిటీలపై విషం చిమ్మడం, లేదా ముస్లింలకూ ఇతర వెనుక బడిన వర్గాలకూ మధ్య పొరపొచ్చాలు సృషించడానికి ప్రయత్నించడం ప్రారంభించారు. దాని కోసం ఆయన పచ్చి అబద్ధాలను అలవోకగా చెప్పేస్తున్నారు.

ఏప్రిల్ 21న మోడీ రాజస్థాన్‌లోని బాన్స్వారాలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళల మంగళ సూత్రాలతో సహా ప్రజల ఆస్తిని స్వాధీనం చేసుకుని ముస్లింలకు అప్పగించడానికి ప్రణాళిక వేస్తున్నదని పేర్కొన్నారు. పైగా ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో పెట్టిందని చెప్పారు. ఒక సెక్షన్ ప్రజలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ఇటువంటి ప్రసంగాలు చేయడం ఎన్నికల నిబంధనావళి ప్రకారం నేరం. "భిన్న కులాలు, మతాలు, భాషల ప్రజల మధ్య నెలకొని ఉన్న విభేధాలను పెంచడం లేక వారి మధ్య పరస్పర విద్వేషం సృష్టించడం లేక ఉద్రిక్తతలు సృష్టించడం వంటి కార్యకలాపాల్లో ఏ పార్టీ లేక అభ్యర్థి పాల్గనరాదు" అని ఎన్నికల నిబంధనావళి స్పష్టంగా చెబుతోంది. పైగా మోడీ చేసిన ఆరోపణ పచ్చి అబద్ధం ఎందుకంటే కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో అటువంటి విషయమే పేర్కొనలేదు.

ప్రధాన మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్వేష ప్రసంగాలు చేయడం పట్ల కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. మీడియాలో ముఖ్యంగా సోషల్ మీడియాలో దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయినప్పటికీ మోడీ ధోరణిలో మార్పులేదు. 24 గంటలు గడవక ముందే ఏప్రిల్ 22న అలీఘర్‌లో ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ దేశంలోని వనరులపై మొదటి హక్కు ముస్లింలకే ఉన్నదని కాంగ్రెస్ చెప్పిందని మరో అబద్ధం చెప్పారు. దేశ సంపదను ఆ పార్టీ 'విదేశీ చొరబాటుదారులకూ', 'అధిక సంతానం కనేవారికీ' పున: పంపిణీ చేస్తుందని ఆరోపించారు. మరోఎన్నికల సభలో మోడీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని రాజకుమారుడిగా పేర్కొంటూ వారి "పార్టీ అధికారంలోకి వస్తే మీకు ఎంత ఆదాయం ఉందో, ఎంత ఆస్తి ఉందో, ఎన్ని ఇళ్లు ఉన్నాయో సర్వే నిర్వహిస్తుంది...ఆ ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇతరులకు పంచేస్తుంది. ఈ విషయాన్ని వాళ్ల ఎన్నికల ప్రణాళికలో చేర్చారు" అని ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నించారు. ఆయన ఇంకా ఎంతకు దిగజారారంటే.."మీకు గనుక గ్రామాంలో పూర్వీకుల ఇల్లు ఉండి పట్టణంలో మీ పిల్లల కోసం చిన్న ఇల్లు కొనుక్కుంటే దాన్ని మీదగ్గరనుండి లాగేసుకుంటారు. ఇది మావోయిస్టుల ఆలోచన కాదా? మీరు కష్టపడి సంపాదించుకున్న సంపదను కాంగ్రెస్ పార్టీ లాగేసుకుంటుంది. మీ మహిళల ఆస్తిని లూటీ చేస్తుంది" అన్నారు.


మోడీ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే, ఎందుకంటే కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిలో అటువంటిదెక్కడా చెప్పలేదు, కాంగ్రెస్ నాయకులు ఏనాడూ అటువంటి మాటలూ చెప్పలేదు.

కానీ మోడీ ఇప్పుడెందుకు పచ్చి అబద్ధాలతో ఇంతగా దిగజారిపోయి మాట్లాడుతున్నారు? తమకు ఈ ఎన్నికల్లో400 స్థానాలు రావడం తథ్యమనీ, దాంతో రాజ్యాంగాన్ని మార్చేస్తామనీ, జమిలి ఎన్నికలకు వెళతామనీ, హిందూరాష్ట్రను ఏర్పాటు చేస్తామనీ గప్పాలు కొట్టిన మోడీ, ఆయన పార్టీ నేతలు గెలుపు కోసం ఇప్పుడెందుకిలాంటి కత్తిత్రాలకు పాల్పడుతున్నారు. అసలు తమకు పోటీయే లేదని ప్రగల్బాలు పలికిన వారు ఇప్పుడు ప్రతిపక్షాల మీద ప్రధానితో సహా ఇటువంటి నిరాధార నిందలు ఎందుకు పాల్పడుతున్నారు? కారణం, భారత ప్రజలు కాషాయ పార్టీ మతోన్మాదాన్ని రానురాను అసహ్యించుకుంటున్నారు. తిరస్కరిస్తున్నారు. అందువల్లనే మరోసారి విద్వేష ప్రసంగాలతో హిందూ మెజారిటీ ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడానికి ప్రధాని అతని కాషాయ పరివారం ప్రయత్నిస్తున్నది. కానీ, ఇటువంటి చౌకబారు ఎత్తుగడలతో ప్రజలను ఎల్లకాలం మోసగించగలం అని కాషాయ పరివారం అనుకుంటే అది వారి అవివేకమే అవుతుంది.

**ఈ మాసం ముఖ్యాంశం**

# ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి ఎక్కడ?

## పథకాల ఊరింపులే గానీ భారాల బాదుడు గురించి చెప్పరేం?



రచయిత సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

**వి.శ్రీనివాస రావు**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత గడిచిన పదేళ్లల్లో ఆంధ్ర ప్రదేశ్‌లో అభివృద్ధి సాధించామని వైసిపి, టిడిపి డబ్బాలు కొట్టుకుంటున్నాయి. వాస్తవానికి కనిపిస్తున్న అభివృద్ధి ఏమీ లేదు. పిల్లల చదువు, పౌష్టికాహారం వంటి 12 సూచికల్లో ఒక్కదానిలో కూడా మన రాష్ట్రం మొదటి స్థానం సాధించలేదు సరికదా కనీసం ఆ దారిదాపుల్లో కూడా లేదు. కేరళ రాష్ట్రం మాత్రం ఐదు అంశాల్లో తొలి స్థానాల్లో చోటు దక్కించుకుంది. చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించకుండా, పిల్లలకు చదువు అందించకుండా గప్పాలు కొంటుకుంటే ఉపయోగం ఏమిటి?

రాష్ట్ర విభజన తరువాత రైతులు 13లక్షల వ్యవసాయ సాగుభూమిని కోల్పోయారని ప్రభుత్వ లెక్కలు (ఏపి ఎకనమిక్ సర్వే 22-23) చెబుతున్నాయి. ఇది ఆందోళనకర అంశం. రాష్ట్రంలో భూ కేంద్రీకరణ పెరిగింది. చిన్న రైతుల వద్ద ఉండే భూమి శాతం కూడా తగ్గింది. ఈ భూములు మొత్తం కార్పొరేట్, రియల్ ఎస్టేట్ చేతుల్లోకి వెళ్లాయి. కార్పొరేట్లకు అప్పగించిన కాకినాడ సెజ్, సౌత్, నార్త్, ఈస్ట్ వంటి కారిడార్లలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఈ భూముల్లో వ్యవసాయం చేసి పంటలు పండించినట్లయితే అభివృద్ధి కాస్తయినా అభివృద్ధి జరిగేది.

రాష్ట్రంలో 40వేల హెక్టార్లకు సాగునీటి వసతి తగ్గింది. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామని చెబుతున్న వైసిపి, టిడిపి దీనిపై సమాధానం చెప్పాలి.

గత టిడిపి ప్రభుత్వం ఐదేళ్ల హయాంలో 1,29,528 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. అదే టిడిపి ఇప్పుడు 'సూపర్ సిక్స్' హామీల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతోంది. వీటిని ఎక్కడి నుంచి తెస్తుందోమాత్రం అది చెప్పడం లేదు. ఉద్యోగ కల్పనపై వైసిపి అసలు మాట్లాడ్డమే లేదు. ఆ పార్టీ ప్రకటించిన మానిఫెస్టోలో ఈ అంశంపై ప్రస్తావనే లేదు.

ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షంలోని ఎన్డీఏ పార్టీలు ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలను గురించి పోటీలు పడి ప్రకటిస్తున్నాయి. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల నుంచి పన్నులు, ధరలు పెంచి ఎంత వసూలు చేస్తారో చెప్పడం లేదు. ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తే ప్రజలకు మేలు జరుగే అధికారంలోకి వచ్చిన తరువాత పన్నులు పెంచుతారనేగా! ఈ పార్టీలు ప్రజలకు మూడు హామీలు ఇవ్వాలి. ఆస్తి, చెత్త, జిఎస్టీ తదితర పన్నులు, కరెంటు చార్జీలు, ఇసుక, పెట్రోలు, గ్యాసు సహా నిత్యావసర సరకుల ధరలు పెంచబోమని, కొత్త భారాలు ప్రజలపై మోపబోమని, ప్రజల సంపదను కార్పొరేట్లకు

**పట్టిక 1**

ఆంధ్ర ప్రదేశ్ స్థానమెక్కడ?

| వరుస సంఖ్య | సూచీ | ఏపి% | ఇండియా% | ఉత్తమ రాష్ట్రం% | ఏపి స్థానం |
|---|---|---|---|---|---|
| 1. | పౌష్టికాహారం | 26.38 | 37.6 | 13.3 సిక్కిం | 10 |
| 2. | శిశుమరణాలు | 1.82 | 2.69 | 0.19 కేరళ | 13 |
| 3. | మాటర్నల్ హీల్ | 9.66 | 22.59 | 1.73 కేరళ | 5 |
| 4. | పాఠశాలకు వెళ్లే సంవత్సరాలు | 16.9 | 13.88 | 1.78 కేరళ | 22 |
| 5. | స్కూలు ఎటెండెన్స్ | 1.7 | 6.4 | 0.3 కేరళ | 7 |
| 6. | వంట ఇంధనం | 16.4 | 58.4 | 3.1 గోవా | 6 |
| 7. | పారిశుధ్యం | 22.7 | 51.9 | 1.3 కేరళ | 15 |
| 8. | తాగునీరు | 9.3 | 14.6 | 1.93 పంజాబ్ | 26 |
| 9. | విద్యుత్తు | 0.5 | 12.2 | 0 గోవా | 6 |
| 10. | గృహవసతి | 14.7 | 45.6 | 9.5 గోవా | 3 |
| 11. | ఆస్తులు | 11 | 13.9 | 1.72 పంజాబ్ | 9 |
| 12. | బ్యాంకు ఎకౌంట్ | 3.6 | 9.66 | 2.1 హిమాచల్ ప్రదేశ్ | 7 |

మాట నిజమే. కానీ సంక్షేమ పథకాలు, ప్రజలపై భారాల్లో ఒకదాని గురించి ప్రకటనలు చేస్తూ రెండో దాని గురించి మాట్లాడకపోతే ఏమనుకోవాలి? కట్టబెట్టబోమని హామీలు ఇవ్వాలి. భూమి, సాగు నీటి హక్కు రైతులకూ, అడవులపై హక్కు ఆదివాసీలకు ఉంటాయని హామీ ఇవ్వాలి. ఉపాధి హామీ వ్యవసాయ కార్మికుల

హక్కుగా కనీస వేతనాలు పొందడం కార్మికుల హక్కుగా ఉంటాయని కూడా హామీ ఇవ్వాలి.

కానీ,ఈ హక్కులను కాపాడతాయో లేదో ఈ పార్టీలు చెప్పడం లేదు. ఒకవైపు రిజర్వేషన్లు ఎత్తేస్తామని ప్రకటనలు చేస్తున్న బిజెపి పల్లకిని ఈ మూడు పార్టీలు మోస్తున్నాయి. సిఎఎ గురించి వైసిపి, టిడిపి మాట్లాడడం లేదు. విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితులపై మౌనం పాటిస్తున్నాయి. అభివృద్ధిలో విఫలమైన బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతోంది. ప్రధాని స్వయంగా విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. బిజెపి చేతిలో దేశం మరోసారి విచ్చిన్నమయ్యే ప్రమాదం ముంచుకొచ్చింది. కేంద్రంలో బిజెపి గద్దెనెక్కకుండా నిరోధించాలి. అందుకు తోడ్పడే పార్టీలనే గెలిపించాలి.

నాడు - నేడు పేరుతో ప్రభుత్వ విద్య నాణ్యతను పెంచామని చెప్తున్నా ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. (కరోనాలో మాత్రమే మినహాయింపు) చేరిన వారిని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పెట్టి ఉపాధ్యాయులపై వేధింపులు పెంచారు.

> **“ రానున్న ఎన్నికలు సామాన్యులకు సంపన్నులైన బడా కార్పొరేట్ల మధ్య జరుగుతున్న యుద్ధం. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, వైసిపి, బిజెపిల నుంచి అత్యంత సంపన్నులు పోటీలో ఉన్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.50 కోట్లు నుండి 6 వేల కోట్ల వరకు డబ్బున్నట్లు వారు వెల్లడించిన అఫిడవిట్లు చెబుతున్నాయి. ”**

**పట్టిక 2**

ఎ.5.1 భూమి వినియోగ వివరాలు (ప్రాంతం లక్షల ఎకరాల్లో)

| సం॥ | అడవి | పనికిరాని భూమి | వ్యవసాయేతర భూమి | పశుమేత భూమి | చెట్లు, తుప్పలు | వ్యసాయబీడు | ఇతరబీడు | ప్రస్తుత బీడు | నికరంగా సాగుభూమి | భౌగోళిక ప్రాంతం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 2008-9 | 34.67 | 14.30 | 18.33 | 2.59 | 1.83 | 4.78 | 7.00 | 9.44 | 67.26 | 160.20 |
| 2009-10 | 34.67 | 14.25 | 18.47 | 2.58 | 1.80 | 4.76 | 8.19 | 14.23 | 61.25 | 160.20 |
| 2010-11 | 34.87 | 14.09 | 19.0 | 2.52 | 1.76 | 4.59 | 7.10 | 8.31 | 67.96 | 160.20 |
| 2011-12 | 34.87 | 14.07 | 19.21 | 2.50 | 1.75 | 4.49 | 7.32 | 10.37 | 65.67 | 160.20 |
| 2012-13 | 34.84 | 13.43 | 19.87 | 2.12 | 1.65 | 4.14 | 8.19 | 11.34 | 64.62 | 160.20 |
| 2013-14 | 34.93 | 13.41 | 19.82 | 2.12 | 1.60 | 3.92 | 7.92 | 10.87 | 65.61 | 160.20 |
| 2014-15 | 36.63 | 13.51 | 20.02 | 2.14 | 1.60 | 3.92 | 8.58 | 14.01 | 62.35 | 162.76 |
| 2015-16 | 36.88 | 13.47 | 20.32 | 2.12 | 1.57 | 4.11 | 8.32 | 14.10 | 62.08 | 162.97 |
| 2016-17 | 36.88 | 13.46 | 20.48 | 2.11 | 1.57 | 4.14 | 8.60 | 14.96 | 60.77 | 162.97 |
| 2017-18 | 36.88 | 13.45 | 20.55 | 2.09 | 1.55 | 4.14 | 9.40 | 14.43 | 60.48 | 162.97 |
| 2018-19 | 36.88 | 13.45 | 20.58 | 2.08 | 1.55 | 4.12 | 9.36 | 14.46 | 60.49 | 162.97 |
| 2019-20 | 36.88 | 13.36 | 20.74 | 2.06 | 1.55 | 4.12 | 9.25 | 14.52 | 60.88 | 162.97 |
| 2020-21 | 36.88 | 13.35 | 20.80 | 2.03 | 1.53 | 4.05 | 8.85 | 14.60 | 60.8 | 162.7 |
| 2021 22 | 36.88. | 13.35 | 20.82 | 2.04 | 1.54 | 4.02 | 8.94 | 15.00 | 60.38 | 162.97 |

ఆధారం: డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం,విజయవాడ.

**సామాన్యులకు, సంపన్నుల మధ్య పోటీ**

రానున్న ఎన్నికలు సామాన్యులకు సంపన్నులైన బడా కార్పొరేట్ల మధ్య జరుగుతున్న యుద్ధం. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, వైసిపి, బిజెపిల నుంచి అత్యంత సంపన్నులు పోటీలో ఉన్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.50 కోట్లు నుండి 6 వేల కోట్ల వరకు డబ్బున్నట్లు వారు వెల్లడించిన అఫిడవిట్లు చెబుతున్నాయి. 175 నియోజకవర్గాలకు గాను 124 (71శాతం) మంది సయాధనికులు ఉన్నారు. వీరంతా పారిశ్రామిక వేత్తలు, ఎన్‌ఆర్ఐలు, రియల్ ఎస్టేట్, మైనింగ్, మద్యం సిండికేట్, విద్యాసంస్థలు, ఆస్పత్రులు వంటి వ్యాపారాల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసి రాజకీయాలను శాసించే స్థాయికి కార్పొరేట్లు వచ్చారు. రూ.100కోట్లు పెట్టుబడి పెట్టి రూ.1000 కోట్లు సంపాదించే లాభసాటి వ్యాపారంగా రాజకీయాలను మార్చేశారు. దీనివల్ల సామాన్యులకు జరిగే మేలు ఏమిటి? పోటీలో ఉన్న సంపన్నులు, పోటీ చేస్తున్న శతకోటేశ్వరులు ఒక్కపైసా కూడా ఓటర్లకు పంచకుండా గెలిస్తే వారిపై ప్రజల విశ్వాసం ఉన్నట్లే. కానీ, వారు డబ్బు పెట్టకుండా ఎక్కడా రాయకీయాలు చేయడం లేదు.

**పట్టిక 3**

A 5.12: Source wise Gross Area Irrigated

(Area in lakh hectares)

| Sl. No | Year | Canals | Tanks | Wells | Others | Total |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 2009-10 | 16.96 | 3.03 | 15.01 | 1.33 | 36.33 |
| 2 | 2010-11 | 19.99 | 4.50 | 15.61 | 1.43 | 41.53 |
| 3 | 2011-12 | 17.84 | 3.94 | 15.99 | 1.44 | 39.21 |
| 4 | 2012-13 | 15.63 | 3.79 | 16.34 | 1.35 | 37.11 |
| 5 | 2013-14 | 19.56 | 3.77 | 16.23 | 1.40 | 40.96 |
| 6 | 2014-15 | 18.82 | 3.27 | 15.32 | 1.45 | 38.86 |
| 7 | 2015-16 | 13.93 | 3.86 | 16.43 | 1.25 | 35.47 |
| 8 | 2016-17 | 16.01 | 2.51 | 16.16 | 1.14 | 35.82 |
| 9 | 2017-18 | 16.21 | 3.15 | 16.71 | 1.23 | 37.30 |
| 10 | 2018-19 | 16.53 | 2.50 | 15.92 | 1.40 | 36.35 |
| 11 | 2019-20 | 17.84 | 3.12 | 15.76 | 1.41 | 38.13 |
| 12 | 2020-21 | 18.57 | 3.36 | 16.52 | 1.40 | 39.85 |
| 13 | 2021-22 | 17.54 | 3.46 | 16.15 | 1.29 | 38.44 |

Source: Directorate of Economics and Statistics

సిపిఎం అభ్యర్థులు 8 అసెంబ్లీ, 1 పార్లమెంటులో పోటీలో ఉన్నారు. వీరి ఆస్తుల మొత్తం రూ.5.90కోట్లు మాత్రమే. మరో 8 చోట్ల పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థుల ఆస్తులు మొత్తం రూ.9.84కోట్లు మాత్రమే. అసెంబ్లీ, పార్లమెంట్‌లు ఇటువంటి బడా కార్పొరేట్ల చేతుల్లోకి వెళితే అక్కడ సామాన్యుల గొంతు వినపడదు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, దళిత, ఆదివాసీ, మహిళలు గురించి మాట్లాడే వామపక్షాలు పదేళ్ల నుంచి అసెంబ్లీలో లేరు. ఎన్నికైన ప్రతినిధులు అసెంబ్లీ మొత్తాన్ని బూతుల ప్రాంగణంగా మారుస్తూ మహిళలను అవమానిస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం గులకరాయి రాజకీయం తోడైంది.

ప్రజలకు కావాల్సినవి ఇవి కాదు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రజల హృదయ స్పందనకు ప్రతిబింబంగా వుండాలి. ఈ స్వభావం రావాలంటే ప్రజల కోసం అంకితభావంతో పోరాడుతున్న వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవాలి.

**రాష్ట్ర హక్కులపై నోరు మెదపని జగన్, చంద్రబాబు**

రాష్ట్రం హక్కులకు సంబంధించిన కీలకమైన సమస్యల గురించి జగన్, చంద్రబాబు నోరుమెదపడం లేదు. పోరాడి ప్రత్యేక హోదా సాధిస్తామని చెప్పకుండా జగన్ సాగదీస్తున్నారు. ఈ ఐదేళ్లల్లో ఏం సాధించారో ఆయన చెప్పకుండా ఊకదంపుడు మాటలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే

**పట్టిక 4**

A. 6.6 Annual Survey of Industries

| Sl. No. | Characteristic | Unit | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 (Provisional) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Factories | No. | 11786 | 12696 | 12515 | 12536 | 12582 |
| | | | (-8.91) | (7.72) | (-1.43) | (0.17) | (0.37) |
| 2 | Fixed Capital | Rs. Crores | 168968.43 | 187770.52 | 183576.4 | 189923.30 | 200527.07 |
| | | | (12.32) | (11.13) | (-2.23) | (3.46) | (5.58) |
| 3 | Working Capital | Rs. Crores | 16708.42 | 2891.12 | 15496.55 | 38856.73 | 19968.71 |
| | | | (87.51) | (-82.7) | (436.01) | (150.74) | (-48.61) |
| 4 | Outstanding Loans | Rs. Crores | 54481.48 | 49304.45 | 59259.76 | 53616.44 | 63205.70 |
| | | | (2.48) | (-9.50) | (20.19) | (-9.52) | (17.88) |
| 5 | All Workers | No. | 421850 | 460467 | 499345 | 507053 | 551378 |
| | | | (-2.60) | (9.15) | (8.44) | (1.54) | (8.74) |
| 6 | All Employees | No. | 519530 | 567345 | 609798 | 620947 | 681224 |
| | | | (-1.99) | (-9.20) | (7.48) | (1.83) | (9.71) |
| 7 | Wages to Workers | Rs. Crores | 6392.47 | 7363.57 | 8258.68 | 9002.30 | 10660.66 |
| | | | (3.61) | (15.19) | (12.16) | (9.00) | (18.42) |
| 8 | Total Emoluments | Rs. Crores | 11163.71 | 12186.01 | 14255.37 | 15756.63 | 18460.22 |
| | | | (-3.51) | (9.16) | (16.98) | (10.53) | (17.16) |
| 9 | Fuel etc. consumed | Rs. Crores | 13316.87 | 14631.14 | 15964.6 | 18086.07 | 18122.47 |
| | | | (-4.86) | (9.87) | (9.11) | (13.29) | (0.20) |
| 10 | Material consumed | Rs. Crores | 145941.59 | 178681.69 | 225412.6 | 266833.01 | 272681.46 |
| | | | (-9.65) | (22.43) | (26.15) | (18.38) | (2.19) |
| 11 | Total Input | Rs. Crores | 203028.63 | 235897.45 | 284440.19 | 331540.12 | 347513.15 |
| | | | (-5.69) | (16.19) | (20.58) | (16.56) | (4.82) |
| 12 | Products & By Products | Rs. Crores | 200281.99 | 235176.48 | 298878.9 | 346721.49 | 349191.21 |
| | | | (-8.28) | (17.42) | (27.09) | (16.01) | (0.71) |
| 13 | Total Output. | Rs. Crores | 242692.46 | 273177.12 | 335946.48 | 381855.02 | 402548.19 |
| | | | (-3.41) | (12.56) | (22.98) | (13.67) | (5.42) |
| 14 | Depreciation | Rs. Crores | 7594.36 | 9112.83 | 10917.08 | 17326.27 | 13347.56 |
| | | | (7.95) | (19.99) | (19.80) | (58.71) | (-22.96) |
| 15 | Net Value Added | Rs. Crores | 32069.47 | 28166.83 | 40589.21 | 32988.63 | 41687.48 |
| | | | (10.82) | (-12.17) | (44.10) | (-18.73) | (26.37) |
| 16 | Gross Value Added | Rs. Crores | 39663.83 | 37279.66 | 51506.29 | 50314.90 | 55035.04 |
| | | | (10.25) | (-6.01) | (38.16) | (-2.31) | (9.38) |

Source: Directorate of Economics & Statistics.
* Figures in Brackets indicate % of growth over the previous year
* The above data from 2015-16 to 2019-20 is Pooled Data of Central & State sample survey of ASI results

పట్టిక 5

SOCIO ECONOMIC SURVEY 2022-23

SOCIAL INFRASTRUCTURE

A 8.5: Enrolment of Children in Schools

| Year | Pre Primary | I-V Classes | VI-VIII Classes | IX-X Classes | XI-XII Classes | Total |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 2001-02 | 239959 | 4888813 | 1261983 | 1159476 | 2659 | 7552890 |
| 2002-03 | 236448 | 4645175 | 1378157 | 1263455 | 2523 | 7525758 |
| 2003-04 | 157497 | 4286794 | 1382624 | 1395761 | 2666 | 7225342 |
| 2004-05 | 36199 | 2039848 | 665865 | 709635 | 1242 | 3452789 |
| 2005-06 | 154391 | 3955616 | 1387230 | 1598020 | 3443 | 7098700 |
| 2006-07 | 285781 | 3920406 | 1387937 | 1639163 | 3569 | 7236856 |
| 2007-08 | 267712 | 3814748 | 1376052 | 1670370 | 2785 | 7131667 |
| 2008-09 | 281988 | 3775763 | 1341770 | 1708002 | 6139 | 7113662 |
| 2009-10 | 162415 | 3808746 | 1323400 | 1728719 | 9765 | 7033045 |
| 2010-11 | 158537 | 3827465 | 1355780 | 1709061 | 11487 | 7062330 |
| 2011-12 | 23416 | 786908 | 279710 | 332618 | 7245 | 1429897 |
| 2012-13 | 168192 | 3810085 | 1417557 | 1783305 | 18771 | 7197910 |
| 2013-14 | 163138 | 3851333 | 2097833 | 1195459 | 29504 | 7337267 |
| 2014-15 | 87309 | 3747680 | 2098400 | 1263420 | 35962 | 7232771 |
| 2015-16 | NA | 3548246 | 2072730 | 1281701 | NA | 6902677 |
| 2016-17 | NA | 3475771 | 2084949 | 1286577 | NA | 6847297 |
| 2017-18 | NA | 3565725 | 2100691 | 1309110 | NA | 6975526 |
| 2018-19 | NA | 3612123 | 2094322 | 1336626 | NA | 7043071 |
| 2019-20 | 186170 | 3774467 | 2132103 | 1336699 | 893664 | 8323103 |
| 2020-21 | NA | 3727676 | 2179189 | 1371483 | 1097672 | 8376020 |
| 2021-22 | NA | 2606311 | 996633 | 3645574 | NA | 7248518 |
| 2022-23 | NA | 3573752 | 2229916 | 1375777 | NA | 7179445 |

Source: Selected Educational Statistics AP (Child Info. Data 2022-23)

ప్రణాళికలు ప్రకటిస్తున్నారు. ఇవి ప్రజలను ముంచేస్తాయే తప్ప ఉద్ధరించవు.

తాము అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. హోదా ఇవ్వబోమని బిజెపి చెప్పింది. అందువల్ల జగన్, చంద్రబాబు 'ప్రణాళికలనూ', వారి మాయ మాటలనూ తిరస్కరించి, ఇండియా బ్లాక్‌లోని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుంది. విశాఖ ఉక్కుపై రాష్ట్రమంతా ఆందోళన జరుగుతున్నా దీనిని కాపాడతామనే మాటను ఈ రెండు పార్టీలూ చెప్పడం లేదు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు రెండు పార్టీలు కూడా ఆమోదం తెలుపుతూ మరోవైపు కార్మికులకు అండగా ఉంటామన్న మాయ మాటలతో ఓట్లు అడుగుతున్నాయి.

నీటి ప్రాజెక్టుల గురించి వైసిపి తన మానిఫెస్టోలో పొందుపరచనేలేదు. రానున్న ఐదేళ్లల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తానని చెబుతున్న వైసిపి నిర్వాసితుల సంగతి గరించి మాట్లాడ్డం లేదు. పరిహారం ఇవ్వకుండా నిర్వాసితులను రెండు పార్టీలు గోదావరిలో ముంచేస్తాయా? గత టిడిపి ప్రభుత్వం గోదావరి నీళ్లు వదిలేసి దేవీపట్నం మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలను తరిమేయగా, వైసిపి ప్రభుత్వం వారిని వరదల్లో ముంచేసింది.

రాజధాని వాసులను టిడిపి త్రిశంకు స్వర్గంలోకి తీసుకెళ్తే, రాజధానే లేకుండా చేసిన ఘనత వైసిపిది. రాజధానికి 33వేల ఎకరాలు అవసరం లేదనీ, తక్షణమే 5-6 వేల ఎకరాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని సిపిఐ(ఎం) గతంలో చెప్పింది. ఇది జరిగి ఉంటే రాజధాని మార్చే అవకాశం ఉండేది కాదు. రష్యా, చైనా, సింగపూర్, జర్మనీ నమూనాలు అంటూ ఐదేళ్ల పాటు తిరిగి చివరకు సినీ దర్శకుడు రాజమౌళితో ప్రజలకు టిడిపి త్రిడి సెట్టింగులు చూపించింది. విశాఖపట్నం రాజధాని అంటున్న వైసిపి రిషికొండకు బోడిగుండు కొట్టి రూ.500 కోట్లతో గెస్ట్‌హౌస్ నిర్మించింది తప్ప ఎలాంటి అభివృద్ధి సాధించలేదు. బాబు, జగన్ ఇరువురూ కలిసి రాజధాని వాసులను నాశనం చేసి, రైతులను వీధిపాలు చేసి, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తీసుకొచ్చారు.

ల్యాండ్ పూలింగ్‌తో చంద్రబాబు రైతులను అన్యాయం చేస్తున్నారని సిపిఎం ఆనాడే చెప్పింది. ప్రస్తుతం రైతులు భూములు కోల్పోయారు. అక్కడ పంటలు లేవు. వారికి ప్లాట్లు రాలేదు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలోను, ప్రజా సంక్షేమాన్ని సమగ్రంగా అమలు చేయడం లోను, వివిధ సామాజిక తరగతులకు న్యాయం చేయడంలోను, మహిళలు, యువత భవిష్యత్తును తీర్చి దిద్దడంలోను బిజెపి, టిడిపి, జనసేన కూటమి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి విఫలమయ్యాయి. వారి ఎన్నికల ప్రణాళికలో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నా ఆచరణ శూన్యం. ఇలాంటి పార్టీలను ఓడించాలి.డ భాగస్వామిగా ఉన్న ఇండియా బ్లాకు పార్టీ (కాంగ్రెస్, సిపిఐ)లను గెలిపించాలి.

❃

**పట్టిక 6**

**పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థుల ఆస్తుల వివరాలు (పత్రికల ఆధారంగా)**

| నియోజకవర్గం | పేరు | పార్టీ | రూ.(కోట్లలో) |
|---|---|---|---|
| 1. గుంటూరు | పెమ్మసాని చంద్రశేఖర్ | టిడిపి | 5,785 |
| 2. నెల్లూరు | వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి | టిడిపి | 716.31 |
| 3. విజయవాడ | కేశినేని నాని | వైసిపి | 707.32 |
| 4. అనకాపల్లి | సిఎం రమేష్ | బిజెపి | 497.59 |
| 5. విశాఖపట్నం | మాత్కుమిల్లి శ్రీభరత్ | టిడిపి | 393.41 |
| 6. రాజంపేట | పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి | వైసిపి | 209.53 |
| 7. నంద్యాల | పోచా బ్రహ్మానందారెడ్డి | వైసిపి | 147.74 |
| 8. మచిలీపట్నం | సింహాద్రి చంద్రశేఖర్ | వైసిపి | 138.41 |
| 9. మచిలీపట్నం | వి.బాలశౌరి | జనసేన | 133.71 |
| 10. కడప | వై.ఎస్.షర్మిల | కాంగ్రెస్ | 132 |
| 11. రాజంపేట | ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి | బిజెపి | 95.33 |
| 12. కాకినాడ | చలమలశెట్టి సునీల్ కుమార్ | వైసిపి | 75.16 |
| 13. ఏలూరు | పుట్టా మహేష్‌యాదవ్ | టిడిపి | 71.63 |
| 14. గుంటూరు | కిలారి వెంకట రోశయ్య | వైసిపి | 70.50 |
| 15. రాజమండ్రి | దగ్గుపాటి పురందేశ్వరి | బిజెపి | 61.46 |
| 16. రాజమండ్రి | గూడూరి శ్రీనివాస్ | వైసిపి | 60.89 |
| 17. ఒంగోలు | మాగుంట శ్రీనివాసులురెడ్డి | టిడిపి | 57.95 |
| 18. నర్సరావుపేట | లావు శ్రీకృష్ణదేవరాయలు | టిడిపి | 56.22 |

**అసెంబ్లీ పోటీ చేసే అభ్యర్థుల ఆస్తుల వివరాలు (పత్రికల ఆధారంగా)**

| | | | |
|---|---|---|---|
| 1. పులివెందుల | జగన్‌మోహన్ రెడ్డి | వైసిపి | 1,287.52 |
| 2. కుప్పం | చంద్రబాబు | టిడిపి | 931.36 |
| 3. నెల్లిమర్ల | లోకం మాధవి | జనసేన | 894.92 |
| 4. నెల్లూరు | పి.నారాయణ | టిడిపి | 824.05 |
| 5. కోవూరు | వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి | టిడిపి | 715.62 |
| 6. మంగళగిరి | నారా లోకేష్ | టిడిపి | 542.17 |
| 7. విశాఖ తూర్పు | ఎన్‌వివి సత్యనారాయణ | వైసిపి | 421.30 |
| 8. కడప | మాధవీ రెడ్డి | టిడిపి | 325.61 |
| 9. కర్నూలు | టిజి భరత్ | టిడిపి | 243.57 |
| 10. కావలి | రామిరెడ్డి ప్రతాప్ కుమార్ | వైసిపి | 236.98 |
| 11. ఉండి | రఘురామకృష్ణంరాజు | టిడిపి | 219.4 |
| 12. వినుకొండ | బొల్లా బ్రహ్మనాయుడు | టిడిపి | 219 |
| 13. ఆత్మకూరు | మేకపాటి విక్రమ్‌రెడ్డి | వైసిపి | 209.22 |
| 14. మైలవరం | వసంత కృష్ణప్రసాద్ | టిడిపి | 188 |
| 15. హిందుపురం | బాలకృష్ణ | టిడిపి | 184.83 |
| 16. బనగానపల్లి | బిసి జనార్థన రెడ్డి | టిడిపి | 173.29 |
| 17. పిఠాపురం | పవన్‌కళ్యాన్ | జనసేన | 164.54 |
| 18. కావలి | దగుమాటి వెంకట కృష్ణారెడ్డి | టిడిపి | 153.27 |
| 19. గుంటూరు పశ్చిమ | విడదల రజిని | వైసిపి | 129.62 |
| 20. గంగాధర నెల్లూరు | థామస్ | టిడిపి | 124 |
| 21. పుంగనూరు | పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి | వైసిపి | 114.27 |
| 22. బాపట్ల | బి.నరేంద్ర వర్మ | టిడిపి | 109.47 |
| 23. విశాఖ ఉత్తరం | విష్ణుకుమార్ రాజు | బిజెపి | 106.22 |
| 24. రాజమండ్రి | భరత్‌రామ్ | వైసిపి | 95.02 |
| 25. విజయవాడ సెంట్రల్ | బొండా ఉమా | టిడిపి | 93.05 |
| 26. కాకినాడ | ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి | వైసిపి | 76.01 |
| 27. తిరుపతి | ఆరంకి శ్రీనివాసులు | జనసేన | 75.91 |
| 28. గన్నవరం | వల్లభనేని వంశీ | వైసిపి | 72.50 |
| 29. ఆదోని | డా॥పార్థసారథి | బిజెపి | 56.37 |
| 30. తుని | దాడిశెట్టి రామలింగేశ్వరరావు | వైసిపి | 52.67 |
| 31. దెందులూరు | చింతమనేని ప్రభాకర్ | టిడిపి | 50 |

# దక్షిణాదిన

**(19వ పేజీ తరువాయి)**

అంతస్తుల శిఖరాన్ని విరూపాక్ష దేవాలయంగా నిర్మించారు. ఇది పూర్తిగా దక్షిణాది శిల్పశైలితో నిర్మించినది.

ప్రజలనుండి వసూలు చేసిన పన్నులతోటే ఈ దేవాలయాలన్నింటినీ నిర్మించారు. రైతులు కూడా తమ ఆధ్యాత్మిక చింతనను సంతృప్తి పరుచుకోవడం కోసం దేవాలయాలకు ధాన్య రూపంలో విరివిగా కానుకలను చెల్లించేవారు.

**రైతాంగం మీద భారాలు**

రాజులు దండయాత్రలు సాగించడానికి, కళలను సాహిత్యాన్ని పోషించడానికి, మత ప్రచారం కొనసాగించడానికి, రాజోద్యోగులను, సైనికులను పోషించడానికి చాలా ఆర్థిక వనరులు కావాలి. ఈ వనరులను రైతులనుండే వసూలు చేసేవారని వేరే చెప్పనక్కరలేదు. అది వాకాటక రాజ్యం అయినా, పల్లవ రాజ్యం అయినా, అటు ఉత్తరాన గాని, ఇటు దక్షిణాన గాని ప్రభువులు రైతులను పీడించిన తీరు మాత్రం ఒకే విధంగా ఉండేది. భూమి శిస్తుతోబాటు రాజు రైతులనుండి ధాన్యం రూపేణా గానీ, బంగారం రూపేణా గానీ వసూళ్ళు చేసేవాడు. అది గాక భూమిలో ఉండే నిక్షేపాలన్నీ రాజుగారి సొత్తుగానే పరిగణించబడేది. తాటిచెట్లు కూడా రాజుగారి సొత్తే. కలప, గడ్డి, పాలు వంటివి కూడా వసూలు చేసేవారు. అది గాక రాజుగారి సరుకులను రవాణా చేసే పని

**లోక్‌సభ :**

| పార్టీ | సభ్యులు | రూ.కోట్లలో |
|---|---|---|
| వైసిపి | 7 | 1,409.55 |
| టిడిపి | 6 | 6,995.52 |
| బిజెపి | 3 | 634.7 |
| జనసేన | 1 | 133.71 |
| కాంగ్రెస్ | 1 | 132 |
| | మొత్తం | 9,305.48 |

**అసెంబ్లీ :**

| పార్టీ | సభ్యులు | రూ.కోట్లలో |
|---|---|---|
| వైసిపి | 10 | 2,692.11 |
| టిడిపి | 16 | 5,096.69 |
| బిజెపి | 2 | 162.59 |
| జనసేన | 3 | 1,135.37 |
| | మొత్తం | 9,086.76 |

# కొత్త రాజ్యాల స్థాపన - విస్తరణ

కూడా రైతులదే. వారే బండ్లను, ఎద్దులను కూడా సరఫరా చేయాలి. ఎటువంటి కూలీ లేకుండా రాజు కోరినప్పుడు వెట్టి కి సిద్ధం కావాలి. ఇక రాజోద్యోగులు గ్రామానికి వచ్చినప్పుడు, సైనిక పటాలాలు గ్రామం గుండా ప్రయాణం చేసినప్పుడు వారిని తగువిధంగా ఆదరించి సంతృప్తి పరచవలసినది కూడా గ్రామస్తులే. సుమారు 18 రకాల పన్నుల భారాలను రైతులమీద మోపేవారు. బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన భూముల విషయంలో మాత్రం ఈ పన్నులన్నింటినీ మినహాయించారు. ఆ తర్వాత కాలంలో ఈ పన్నుల భారం ఇంకా పెరుగుతూవచ్చింది.

**విస్తరణ**

ప్రభువులు పన్నులను పెంచుతూపోవాలంటే ముందు వ్యవసాయం నుండి వచ్చే ఆదాయం కూడా పెరగాలి. అందుకు భూ విస్తీర్ణం కూడా పెరగాలి. బ్రాహ్మణులకిచ్చిన భూదానాలు వ్యవసాయ విస్తరణకు, వివిధ ఆదిమ తెగలు వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలోకి రావడానికి దోహదం చేశాయని ముందే చెప్పుకున్నాం. ఈ విస్తరణలో భాగంగానే అనేక సామంత రాజ్యాలు కూడా ఏర్పడ్డాయి. ఇలా విస్తరించిన ప్రాంతాలను మూడు రకాలుగా పరిగణించారు.

1. ఊరు, 2.అగ్రహారం, 3. నగరం.

ఊరు అనేది మామూలు గ్రామం. ఊరి పెద్దలే బాధ్యత వహించి వ్యవహారాలను చక్కదిద్దాలి. అంతేగాక చెల్లించవలసిన పన్నులకు కూడా బాధ్యత వహించాలి. అగ్రహారం అంటే బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన ప్రాంతం. అక్కడ బ్రాహ్మణులే భూ యజమానులు. ఆ అగ్రహారాల సంపద అంతా వాళ్ళదే. ఇక నగరం అంటే పాత పట్టణాలనుండి వలస వచ్చి స్థిరపడిన చేతివృత్తుల వారితో, వ్యాపారులతో కూడినది. మొత్తంగా క్రీ.శ.300–750 మధ్య కాలంలో గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ, కొత్త రాజ్యాల ఏర్పాటు, గ్రామీణ వ్యవస్థల ఏర్పాటు విరివిగా జరిగింది.

**సామాజిక నిర్మాణం**

స్థూలంగా చెప్పాలంటే సమాజంలో ప్రధాన ఆధిపత్యం ప్రభువులది, పురోహితులది. వాస్తవంగా స్థానిక తెగలకు చెందినవారైనప్పటికీ, తమది క్షత్రియ వంశమేనని చెప్పుకోడానికి ప్రభువులు ఆరాటపడేవారు. అందుకోసం పురోహితులు ప్రభువులకోసం ఉన్నత వంశ మూలాలను సృష్టించేవారు. చంద్ర వంశం నుండో, సూర్య వంశం నుండో ఆ ప్రభువులు వచ్చారని కథలు అల్లేవారు. ఆ విధంగా ప్రజల దృష్టిలో ప్రభువులు పాలనకు అర్హత కలిగినవారిగా నిలిచే వారు. ఇక పురోహితుల్లో బ్రాహ్మణులే ప్రధానం. అక్కడక్కడా బౌద్ధ, జైన సన్యాసులు కూడా కనిపించేవారు.

ఈ ప్రభువులు, పురోహితుల తర్వాత రైతాంగం వస్తారు. వీరంతా అసంఖ్యాకమైన కులాలుగా విభజించబడిఉండే వారు. వీరిలో అత్యధికులు శూద్రులుగా పరిగణించబడే వారు. తమ తమ కులాల విధులను నెరవేర్చడంలో వారు విఫలం అయితే అది ధర్మాన్ని ఉల్లంఘించినట్టే అని భావించే వారు. విధులంటే పైకులాల వారు కోరిన పన్నులను, కానుకలను ఎప్పటికప్పుడు చెల్లించడం, వారు చెప్పినట్లల్లా చాకిరీ చేయడం అని గ్రహించాలి. ధర్మాన్ని కాపాడే బాధ్యత ప్రభువుది. ఈ ధర్మాన్ని సవాలు చేసిన కాలభ్రులను శిక్షించడానికి ఆనాటి అన్ని రాజ్యాల ప్రభువులూ ఏకమై వ్యవహరించిన సంగతి ముందే చెప్పుకున్నాం.

(తరువాయి వచ్చే మాసంలో)

**పట్టిక 7**

**సిపిఎం పార్లమెంటు అభ్యర్థి ఆస్తుల వివరాలు**

| | నియోజకవర్గం | పేరు | ఆస్తులు | అప్పులు |
|---|---|---|---|---|
| 1. | అరకు | పాచిపెంట అప్పలనర్స | 22.55 లక్షలు | 2.43 లక్షలు |

**సిపిఎం అసెంబ్లీ అభ్యర్థుల ఆస్తుల వివరాలు**

| | నియోజకవర్గం | పేరు | ఆస్తులు | అప్పులు |
|---|---|---|---|---|
| 1. | మంగళగిరి | జొన్నా శివశంకర్ | 1.86 కోట్లు | 11.13 లక్షలు |
| 2. | విజయవాడ సెంట్రల్ | చిగురుపాటి బాబురావు | 73.54 లక్షలు | 25 లక్షలు |
| 3. | పాణ్యం | దేశాయ్ గౌస్ దేశాయ్ | 67.16 లక్షలు | 0 |
| 4. | గాజువాక | మరడాన జగ్గునాయుడు | 42.40 లక్షలు | 3.35 లక్షలు |
| 5. | రంపచోడవరం | లోతా రామారావు | 18.80 లక్షలు | 3.85 లక్షలు |
| 6. | కురుపాం | మండంగి రమణ | 9.13 లక్షలు | 71,130 |
| 7. | గన్నవరం | కళ్ళం వెంకటేశ్వరరావు | 8.45 లక్షలు | 2 లక్షలు |
| 8. | నెల్లూరు సిటి | మూలం రమేష్ | 80,500 | 0 |
| | | మొత్తం | 5.90 కోట్లు | 48.47 లక్షలు |

**సిపిఐ పార్లమెంటు అభ్యర్థి ఆస్తుల వివరాలు**

| | నియోజకవర్గం | పేరు | ఆస్తులు | అప్పులు |
|---|---|---|---|---|
| 1. | గుంటూరు | జంగాల అజయ్ కుమార్ | 61.67 లక్షలు | 1.40 లక్షలు |

**సిపిఐ అసెంబ్లీ అభ్యర్థుల ఆస్తుల వివరాలు**

| | నియోజకవర్గం | పేరు | ఆస్తులు | అప్పులు |
|---|---|---|---|---|
| 1. | విజయవాడ పశ్చిమ | జి.కోటేశ్వరరావు | 1.92 కోట్లు | 70 లక్షలు |
| 2. | తిరుపతి | పి.మురళి | 1.07 కోట్లు | 3.35 లక్షలు |
| 3. | పత్తికొండ | పి.రామచంద్రయ్య | 68 లక్షలు | 0 |
| 4. | ఏలూరు | బండి వెంకటేశ్వరరావు | 55.25 లక్షలు | 0 |
| 5. | కమలాపురం | గాలి చంద్ర | 40.02 లక్షలు | 23.65 లక్షలు |
| 6. | విశాఖ పశ్చిమ | అత్తిలి విమల | 38 లక్షలు | 4.50 లక్షలు |
| 7. | రాజంపేట | భుక్యా విశ్వనాథనాయక్ | 17.72 లక్షలు | 8.30 లక్షలు |
| 8. | అనంతపురం అర్బన్ | సి.జాఫర్ | 1.10 లక్షలు | 0 |
| | | మొత్తం | 9.84 కోట్లు | 3.94 కోట్లు |

# ఎన్నికల బాండ్లు ఒక భారీ కుంభకోణం




**ఎస్ మేఘనంద్, పరంజోయ్ గుహ ఠాకుర్తా, అబీర్ దాస్ గుప్తా**

పాలక పార్టీ. అధికార మాధ్యమాల వాదనలు పక్కన పెడితే, ఎన్నికల బాండ్లు "ఆశ్రిత పెట్టుబడిని సులభతరం చేసిందని", అసమానతల పెరుగుదలకు దోహదం చేసిందని, మార్కెట్‌ను వికృతంగా మార్చిందని చెప్పవచ్చు.

ఒక ఇంటిని ఊహించుకోండి...

ఆ ఇంట్లో ఉన్నవారందరూ ఇల్లు అత్యంత శుభ్రంగా ఉంచుకోవడానికి ఇష్టపడ తారు. కానీ, ఒక రోజు ఆ ఇంట్లోని వాళ్ళు నిద్రలేచేసరికి ఇంటి మధ్యలో ఓ పెద్ద చెత్త కుప్ప పడేసి ఉంటుంది. ఇంట్లో ఉన్న వారందరూ ఆ చెత్తకుప్ప వైపు చూసి విచారంగా తలలూపుతూ, ఫిర్యాదులు చేయడం మొదలెడతారు.

ఉన్నట్టుండి అందంగా అలంకరించుకుని , ఆధునిక వస్త్రధారణతో మెరిసిపోతున్న ఒక గడ్డపాయన అక్కడ ప్రత్యక్షమై, "నన్ను ఈ ఇంటి యజమానిని చేయండి. నేనీ చెత్తనంతా ఊడ్చి పారేస్తాను. అంతేకాదు, ఈ చెత్తవేసినవాడి అంతు చూస్తా!." అంటే, చుట్టూ ఉన్న వారంతా, 'అబ్బా ఎంత అందంగా ఉన్నాడీ గడ్డపాయన, మనల్ని రక్షించడానికి వచ్చినట్లున్నాడు. అమ్మయ్య! మనల్ని కాపాడే వాడొకడొచ్చాడు' అని అనుకోరూ!

గడ్డపాయన సంకల్పంతో, దృఢ విశ్వాసంతో అన్న మాటలు ఇంట్లో అందరి మనసులో బలంగా నాటుకు పోయాయి. వెంటనే గడ్డపాయన పనిలోకి దిగాడు. హాల్ మధ్యలో ఉన్న తివాసీని పైకి ఎత్తి, చీపురు చేత పుచ్చుకొని చెత్తనంతా దానికిందికి నెట్టేసాడు. "చూశారా! ఇప్పుడు ఇక్కడ ఏ మాత్రం చెత్త మిగలలేదు అని గర్వంగా 'ప్రకటించాడు'.

'ఈ ఇంటి చరిత్రలో ఎన్నడూ లేనంత సమర్ధవంతమైన ఇంటిపెద్దను నేనే' అని మరీ ప్రకటించుకున్నాడు.

అయితే, ఇంట్లో వాళ్ళ కష్టాలు అక్కడితో తీరిపోలేదు. మర్నాడు మళ్ళీ మరింత చెత్త ప్రత్యక్షం అయింది. ప్రజలు మళ్ళీ ఫిర్యాదు చేయడం మొదలెట్టారు. అయితే, గడ్డపాయన మళ్ళీ చీపురుతో సిద్ధంగా ఉన్నాడు. చెత్త కనిపించినప్పుడల్లా తివాచీ కిందికి తోసేస్తూ ఉన్నాడు. ఆ తర్వాత ఒక్క తివాసీ కిందికే కాదు. సోఫాల కిందికి, పుస్తకాల బీరువాల కిందికి, ప్రతి మూలకి, ఇంట్లోని మూల మూలలకి తోసేయడం మొదలెట్టాడు.

ఇంటి చుట్టూ చెత్తే. సమస్య పరిష్కరించ బడలేదు. అయితే, కంటి ఎదురుగా కనిపించకుండా నిలవరించగలిగాడు. కంటికయితే కనిపించకుండా నిలవరించగలి గాడు గానీ, కంపు కొట్టకుండా ఆపలేకపో యాడు. ఇల్లంతా గబ్బు కొట్టడం మొదలైంది. దానితో ఇంట్లో ఉన్నవారంతా మళ్ళీ ఫిర్యాదులు చేయడం మొదలెట్టారు. ఫిర్యాదుల పరంపర మొదలయ్యాయి, గడ్డపాయన కేవలం ఇటు అటు తోసేస్తున్నాడు గానీ, పూర్తిగా తీసేయడం లేదని గ్రహించారు. "నిజానికి అతడంతా తొలగించి ఉండాల్సింది. కానీ కేవలం కనిపించకుండా చేస్తున్నాడు" అన్నారు. అందులో చాలామందికి 'మాటిచ్చిన గడ్డపాయనతో ఏ పేచీ లేదు'. వాళ్ళు బాధపడుతున్నది కేవలం చెత్త గురించే. "రాజకీయాలు మాకొద్దు". "ఈ విషయం. మా మానసిక ఆరోగ్యాన్ని కలుషితం చేస్తుంది. మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వండి. హాయిగా ఆడుతూ పాడుతూ గడపనివ్వండి" అన్నారు.

ఇంట్లోని కొంతమందయితే ఏకంగా, "ఈ కంపు ఆరోగ్యానికి మంచిదని కూడా వాదించడం మొదలెట్టారు''. మనం చేయవలసిందల్లా "ఆ మహానుభావుడి అడుగుజాడల్లో నడవడం. అతడెంతటి దూరదృష్టి గలవాడు! అతనిలా మీరు కూడా ప్రతిరోజూ యోగా చేయండి. ఇదిగో.. ఈ హాల్ లోనే... . అతనిలా..." అనడం మొదలెట్టారు.

గడ్డపాయన ఆనందంలో ఉబ్బితబ్బిబ్బ య్యాడు .

తానింక ఎప్పటికీ ఇంటి పెద్దగా ఎన్నుకోబడతాననే నమ్మకం ఏర్పడింది. కానీ ఉన్నట్టుండి ఓ రోజు కళ్లద్దాలతో ప్రత్యక్షం అయ్యాడు ఓ యువకుడు . "ఈ ఇల్లు గబ్బు కొడుతున్నది. దీనికి కారణం మనం కనుక్కోవాలి కదా! నన్ను ఇంట్లో ఉన్న సామానుని పక్కకు జరపనివ్వండి. తివాసీ కింద ఏముందో చూడనివ్వండి అని గట్టిగా అరిచాడు."

అయ్యో! తీరా చూస్తే ఏముంది .., ఏ మూల చూసినా, ఏ వస్తువు కింద చూసినా చెత్త పేరుకుపోయి ఉంది. ఆఖరికి తోటలో.., గడ్డి లాన్‌లో.., కార్లో.., ఎక్కడ పడితే అక్కడ!

కళ్లద్దాల యువకుడు "దేవుడా! నేను అనుకున్న దానికంటే ఇది మరింత అధ్వానంగా ఉంది !" అన్నాడు.

అప్పటివరకు శుభ్రం చేస్తున్నానని అనడం ఒట్టి నాటకం. అందుకే కంపు మరింత పెరిగింది. ఇప్పుడేం చేద్దాం?

ఈ కథేంటని ఆశ్చర్య పోయే వారి కోసం– గొడ్డపాయన–నరేంద్రమోడీ, చెత్తకుప్ప– ఆశ్రిత పెట్టుబడి, ఇంట్లో వాళ్ళు ప్రజలు, గబ్బుని గొప్పగా చూపే ప్రయత్నం చేసినవారు ప్రధాన ప్రచార మాధ్యమ స్రవంతులు, కళ్లద్దాల ఆసామీ జస్టిస్ చంద్రచూడ్, "ఊడ్చే ప్రక్రియ" ఎన్నికల బాండ్ల పథకం.

> **"ఎన్నిక బాండ్లకు సంబంధించి మనకు చెప్పింది, రాజకీయ పార్టీలకు కోట్లలో డబ్బులు విరాళాలుగా ఇవ్వడాన్ని నియంత్రించడానికని. ఎన్నికల్లో కేవలం ' తెల్ల డబ్బు (లెక్క చెప్పగల డబ్బు) వినియోగాన్ని ప్రవేశ పెట్టడానికని. కానీ వాస్తవంలో, రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే కార్పొరేట్లకు, ఇందులో కొత్త సౌలభ్యం కనిపించింది."**

గత కొద్ది వారాలుగా వస్తున్న వార్తలను మీరు గమనించి ఉన్నట్టయితే, భారతదేశమనే మన ఇల్లు అంతా, ఇంకా గబ్బుకొడుతున్నదని గుర్తించి ఉంటారు.

2012-13లో, భారతదేశవ్యాపితంగా అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం సాగుతున్న రోజుల్లో, నరేంద్రమోడీ తెరపైకి వచ్చారు. అప్పటి యుపిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు కోపంతో ఊగిపోతు న్నారు. అప్పుడే ఆశ్రిత పెట్టుబడి చాపకింద నీరులా గుట్టుచప్పుడు కాకుండా దేశంలో ప్రవేశించడానికి అవకాశం కలిగింది. మోడీ ప్రభుత్వం, తాను తిననని, ఎవ్వరినీ తిననివ్వనని మాటిచ్చి అధికారంలోకి వచ్చింది. నిజానికి వ్యవస్థలో సంస్కరణలు ప్రవేశపెట్టి, ఆశ్రిత పెట్టుబడిని మూలాలకంటా పెకిలించి ఉండవలసింది. కానీ అలా జరగలేదు.

2017లో ప్రభుత్వం ఎన్నికల బాండ్లు ప్రవేశ పెట్టినప్పుడు రాజకీయాలను ప్రక్షాళన చేయడానికని అందరూ భావించారు. అప్పటి ఆర్థిక మంత్రి కీ॥శే॥ అరుణ్ జైట్లీ, దేశంలో ధన ప్రవాహం మితిమీరుతున్నదని, ఎన్నికల్లో కేవలం చట్టబద్ధమైన ధనం బ్యాంకులద్వారా రాజకీయాలలోకి ప్రవేశించడానికి అనువైన చర్య అని చెప్పారు. సంస్కరణల్లో భాగంగానే డబ్బు విరాళాలుగా ఇవ్వడాన్ని రూ 20,000/- నుంచి రూ 2,000 కు తగ్గిస్తున్నట్టు చెప్పు కున్నారు (గమనిక: ఆయన డబ్బు ఇవ్వడాన్ని పూర్తిగా తొలగించలేదు. కేవలం తగ్గించాడు.) అంతేకాదు రాజకీయ పార్టీల ప్రయోజనాలు కాపాడడం కోసం కొత్త రకం డబ్బుని అంటే ఎన్నికల బాండ్ల రూపంలో రూపొందించారు . మనకు చెప్పింది, రాజకీయ పార్టీలకు కోట్లలో డబ్బులు విరాళాలుగా ఇవ్వడాన్ని నియంత్రించడానికని. ఎన్నికల్లో కేవలం ' తెల్ల డబ్బు (లెక్క చెప్పగల డబ్బు) వినియోగాన్ని ప్రవేశ పెట్టడానికని. కానీ వాస్తవంలో, రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే కార్పొరేట్లకు, ఇందులో కొత్త సౌలభ్యం కనిపించింది. ఆ వివరాలు చూద్దాం.

మొదటిది, ఎన్నికల బాండ్ల కొనుగోలు అనామకంగా జరుగుతుంది. మీరు ఎన్ని కోట్లయినా విరాళాలుగా ఇవ్వవచ్చు. మీ పేరు బయట పడదు. ఎవరూ అడగరు. అంటే, ఏ బాధ్యతా ఉండదు. రాజకీయ పార్టీకి, దాతకి మధ్య సాధారణ ప్రజల ప్రమేయం ఏ మాత్రం ఉండదు.

రెండు, వ్యాపారంలో లాభాలు ఆర్జించకుండా కూడా విరాళాలు ఇవ్వదలుచుకున్నారా? ఇవ్వవచ్చు! కేవలం లాభాలు ఆర్జించినవారే విరాళాలు ఇవ్వాలన్న నిబంధన ఏమీ లేదు. అదివరకు లాభాలలో 7.5 % మాత్రమే రాజకీయ పార్టీలకు విరాళాలుగా ఇవ్వవచ్చన్న నిబంధన ఉండేది. దాన్నీ తొలగించేశారు. ఇంకా చెప్పాలంటే విరాళాలు ఇవ్వదలుచుకున్న వారు ఏరకమైన వ్యాపారాలు చేయాల్సిన అవసరం లేదు కూడా....నేనేం అంటున్నానో అర్థమయింది గా... కన్ను కొట్టావచ్చు...ఛూ జంతర్ మంతర్ చేయావచ్చు.

మూడు, ఇదివరకు రాజకీయ పార్టీలకు విదేశీ కంపెనీలు విరాళం ఇవ్వడానికి అనుమతి లేదు. కానీ, ఇప్పుడు ఆ నియమాన్ని ఆ కంపెనీకి ఏదో ఒక భారతదేశ సబ్సిడీ కంపెనీతో భాగస్వాయం ఉంటే చాలు అని మార్చారు. ఆ భాగస్వామ్య భారతీయ కంపెనీ ద్వారా ఏ రాజకీయ పార్టీకైనా విరాళాలు ఇవ్వవచ్చు. పైగా 1976 నుండి అమలులో ఉన్న విదేశీ చందాదారుల నియంత్రణ చట్టాన్ని, గత కాలంలో విరాళాలు ఇచ్చిన వారికి కూడా వర్తింప చేస్తూ సవరించారు. అంటే పాత పాపాలు కూడా కడిగేసుకోవచ్చు.

ఈ ఎన్నికల బాండ్ల కుంభకోణం చాలా బాగుంది కదా! అవును, నేను అనేది ఈ బాండ్ల పథకం గురించే. 'మీకు నచ్చినంత ధనాన్ని ఇష్టమైన రాజకీయ పార్టీలకు విసిరేయండి!' 'మేము అధికారంలో ఉండగానే, మీకు అవసరమైన కాంట్రాక్టులు అందిపుచ్చుకోండి. మీకు దక్కేట్టుచూసే బాధ్యత మాదే. దీనికి అదనపు బోనస్, 'మీపని మీరు కానిచ్చే సమయంలో, పరిశోధనా సంస్థలు పక్క చూపులు చూసేటట్టు మేము చేస్తాము. సంతోషమేనా?!' ఇదీ ప్రభుత్వ నిర్వాకం.

ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థలో మీరు గనక కునారిల్లి పోతుంటే, అందులోనుంచి ఎలా బయట పడాలి అని ఆలోచిస్తుంటే, ఈ పథకం మీకోసమే. కంపెనీని పెంచుకోవా లనుకుంటే, వాటాదారులకు లాభాలు సమకూర్చాలనుకుంటే ఈ పథకం మీ కోసమే. అంతా క్రమపద్ధతిలో జరిగే విధానంలోనే. అయితే కొత్త తరహా ఆలోచనలు చేయాల్సి ఉ ంటుంది. కొత్త కొత్త రూపకల్పనలు చేయాలి. పోటీకి నిలబడగల విధంగా ఉత్పత్తులను రూపొందించుకోవాలి. క్రమపద్ధతిలో మార్కెట్ వ్యవహరించే టట్టు చూసుకోవాలి. కానీ ఎలక్టోరల్ బాండ్లు చేతిలో ఉంటే అవేం అక్కరలేదు. నేరుగా అధికార స్థానాలలో ఉ న్నవారి దగ్గరికి ప్రవేశం దొరుకుతుంది. పనులు చేయించుకోడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రత్యక్షంగా పార్టీలకు విరాళాలు ఇచ్చి, ప్రభుత్వ కాంట్రాక్టులు కైవసం చేసుకోవచ్చు. ఏ రకమైన నియమాలు, నియంత్ర ణలు వర్తించవు. ఏ విధమైన ప్రకంపనలు లేకుండా లాభాలు దండుకునేం దుకు ఇది చట్టబద్ధత కల్పించింది. ఈ ఎలక్టోరల్ బాండ్లు కొద్ది మందికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాయన్నది వాస్తవం. వ్యాపారాలలో అభివృద్ధి చెందుదామని అనుకుంటున్న కొత్త పరిశ్రమల యజమానులు, చిన్న వ్యాపారులు, అంత పెద్ద మొత్తాలలో విరాళాలు ఇవ్వలేరు కాబట్టి, ఎదిగేందుకు వారి అవకాశాలు కుంచించుకుపోతున్నాయి. పూర్తిగా అణచి వేయబడుతున్నారు.

"వ్యాపారాలు సులభతరం చేయబడ తాయని ఆశించిన ఈ చిరువ్యాపారులు, చిన్న పారిశ్రామిక వేత్తలు", ఈ విధానం వివరాలు తెలుసుకుని, ఇప్పుడు తీవ్రంగా మోసపోయా మని భావిస్తున్నారు. వారెంత కష్టపడి పనిచేసినా, ఎంత కొత్త ఆలోచనలు ప్రవేశ పెట్టినా, వారానికి 70 గంటలు పని చేసినా, అస్తవ్యస్త మార్కెట్‌లో నిలబడలేరు. ఎలక్టోరల్ బాండ్ల పుణ్యమా అని 40 మంది విరాళాలు అందించిన పెట్టుబడిదారులు, మార్కెట్‌లోని అత్యధిక వాటాను ఎగరేసుకు పోతుంటే,

> “వ్యాపారాలు సులభతరం” చేయబడిన భారతదేశంలో మనం నివసించాలని అనుకుంటే, ఈ కుంభకోణ నిందితులను కఠినంగా శిక్షించాలి. అలా జరగకపోతే, మనం నిరంతరం మార్కెట్‌ను అతలాకుతలం చేసే సమాజంలో, సంపద పంపిణీలో విపరీతమైన అసమానతలను ప్రోత్సహించే ఆశ్రిత పెట్టుబడి వ్యవస్థతో సహజీవనం చేయాల్సి వస్తుంది.

మిగిలిన వారంతా నిస్సహాయంగా చూస్తూ కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఇంకా దారుణమైన విషయం,మూక మనస్తత్వం కారణంగా, వారి వాటాల విలువలు పెరగవు. వారి కంపెనీలలో వాటాలు పెట్టిన వారు అత్యంత ధనవంతుల జాబితాలో చేరలేరు. వ్యాపార సమూహాలు ఎప్పుడూ వాటాల విలువ పెరుగుతున్న సంస్థల వైపే మొగ్గు చూపుతాయి. స్టాక్ మార్కెట్‌లో ఏ రకమైన నైతిక విలువలు ఉండవు. దీనిని మనం ఎదుర్కోవలసి ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆశ్రిత పెట్టుబడిదారులు, తాము ఆశించిన ప్రయోజనాలు పొందుతూ, లావాదేవీలు జరుపుకుంటూ, తమ వాటాల విలువ అనూహ్యంగా పెంచుకుంటూ పోతున్నారు. వారి వాటాల విలువ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నది. వారికి ఏ విధమైన జవాబుదారీ తనం ఉండడం లేదు. పర్యవసానాలు చూడడం లేదు.

ఈ చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణం, చెత్త నంతటినీ ఎప్పటికప్పుడు ఎత్తి పారేయకుండా, కనిపించని చోటికి తోసేయడం అని మనలాంటి సామాన్యులు గుర్తించాలి. ఇంట్లో చెత్త ఎక్కడనుండి పడిందో, ఎవరు పోశారో ముందుగా గుర్తించాలి. ఆ తరువాత దానిని ఎత్తి పారేసే విధానాన్ని రూపొందించాలి. చెత్త పోసిన వారికి శిక్ష పడాలి. అప్పుడే మళ్ళీ మరొకరు చెత్త పోయడానికి సాహసించరు.

“వ్యాపారాలు సులభతరం” చేయబడిన భారతదేశంలో మనం నివసించాలని అనుకుంటే, ఈ కుంభకోణ నిందితులను కఠినంగా శిక్షించాలి. అలా జరగకపోతే, మనం నిరంతరం మార్కెట్‌ను అతలాకుతలం చేసే సమాజంలో, సంపద పంపిణీలో విపరీతమైన అసమానతలను ప్రోత్సహించే ఆశ్రిత పెట్టుబడి వ్యవస్థతో సహజీవనం చేయాల్సి వస్తుంది.

నా మటుకు నేను, చెత్త నిండిన ఇంట్లో జీవించడానికి నిరాకరిస్తాను.

### ఇది ఒక నిరంకుశ పథకం

ఎలక్టోరల్ బాండ్స్ పథకం సంఘ్ పరివార్ అజెండాలోంచి రూపుదిద్దుకుంది. ఆ సంస్థ దీర్ఘకాలిక లక్ష్యమైన సైద్ధాంతిక నియంతృత్వానికి ఈ పథకం దారి తీస్తుంది. అదెలాగో స్పష్టమైన ఉదాహరణలతో చూద్దాం!

**1. అజయ్ మిశ్రా తేని:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఉత్తరప్రదేశ్‌లోని ఖేరి నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థిగా లోక్‌సభకు 2021లో ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు అశిష్ మిశ్రా లఖింపూర్ ఖేరీలో నిరసన తెలుపుతున్న రైతులపై తన వాహనంతో దూసుకెళ్లి నలుగురు రైతులను, ఒక జర్నలిస్టును హత్య చేశారు. ఈ హత్య కేసు విచారణలో ఉంది.

ఆ సమయంలో అజయ్‌మిశ్రాను మంత్రి వర్గం నుండి తొలగించాలని దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చింది. అయితే, నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ డిమాండ్‌ను తోసిపుచ్చింది. ఆయనను మంత్రి వర్గంలో కొనసాగించింది. అజయ్ మిశ్రా పాలక పార్టీకి స్థానికంగా చిరునామాగా మారాడు. ఆయన కనుసన్నల్లోనే స్థానిక పాలన సాగింది. ‘తేని మహారాజ్’ అనే పదం స్థానిక పెత్తందారులకు పర్యాయపదంగా మారింది. తాజాగా జరుగుతున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు బిజెపి మళ్లీ టికెట్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అజయ్ మిశ్రా తేనికి బిజెపి మళ్లీ టికెట్ ఇవ్వడానికి కార్పొరేట్ సంస్థల మద్దతే కారణమనుకుంటే పొరపాటే. నిజానికి ఆయనకు ఎలక్టోరల్ బాండ్లను పెద్దఎత్తున కొనుగోలు చేసిన ఏ కార్పొరేట్ సంస్థకూడా మద్దతు ఇచ్చినట్లు కనిపించదు.

**2. అరబిందో ఫార్మా :** దాదాపు 24వేల కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్‌తో ఔషధ ఉత్పత్తుల తయారీలో అగ్రగామి సంస్థ. ఈ సంస్థ ఆదాయంలో దాదాపు 90 శాతం 150కి పైగా దేశాలకు చేసే ఎగుమతుల నుండి వస్తుంది. ఏప్రిల్ 2021– నవంబర్ 2023 మధ్య రెండు అనుబంధ సంస్థలతో కలిసి 77 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లను ఈ సంస్థ కొనుగోలు చేసింది. అరబిందో డైరక్టర్లే ఆ సంస్థలకు కూడా డైరక్టర్లుగా ఉండటం గమనార్హం. కొనుగోలు చేసిన బాండ్లలో 77శాతం బిజెపికి, 19 శాతం బిఆర్ఎస్‌కు, మిగిలినవి తెలుగుదేశం పార్టీకి ఆ సంస్థ అందించింది. తెలంగాణాకు చెందిన ఈ సంస్థ మద్యం వ్యాపారాన్ని కూడా నిర్వహిస్తోంది. నవంబర్ 10, 2022న ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ పి. శరత్ చంద్రారెడ్డిని అరెస్ట్ చేశారు. అరెస్టు జరిగిన ఐదు రోజుల తరువాత బిజెపి కోసం ఐదు కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లను ఆ సంస్థ కొనుగోలు చేసింది. 2023 జూన్‌లో ఢిల్లీలోని ఒక కోర్టు అప్రూవర్‌గా మారడానికి, క్షమాభిక్ష పొందడానికి శరత్ చంద్రారెడ్డికి అనుమతి ఇచ్చింది. ఆ తరవాత 2023 నవంబర్‌లో అరబిందో సంస్థ, తన అనుబంధ సంస్థలతో కలిసి 50 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లను బిజెపికి అందచేసింది. ఇదంతా శరత్ చంద్రారెడ్డి పొందిన క్షమాభిక్షను బిజెపికీ అయనకూ మధ్య జరిగిన స్పష్టమైన క్విడ్ ప్రోకో (నీకు అది ..నాకు ఇది)గా ఆప్ ఆరోపించింది. మితవాద హిందూ జాతీయ వాద పాలకులు చేసుకున్న ఒప్పందంగా దీనిని ఆప్ అభివర్ణించింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఇడి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

**3 ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ :** 2019 ఏప్రిల్ 12 నుండి జరిగిన 12,154.51 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్ల లావాదేవీల్లో ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ అత్యధిక భాగాన్ని కొనుగోలు చేసింది. ఏప్రిల్ 2019–ఫిబ్రవరి 2024 మధ్య ఈ సంస్థ 1,368 కోట్ల రూపాయల బాండ్లను కొనుగోలు చేసింది. ఈ సంస్థ కోయంబత్తూరుకు చెందిన శాంటియాగో మార్టిన్ నియంత్రణలో ఉంది. మార్టిన్‌ను భారత దేశ లాటరీ కింగ్‌గా పిలుస్తారు. ఎన్నో సంవత్సరాల నుండి సిబిఐ, ఇడి తదితర సంస్థలు అతనిపై కన్నేసి ఉ

న్నాయి. మార్టిన్ కంపెనీ రాజకీయ పార్టీలకు పెద్ద ఎత్తున విరాళాలు అందచేసింది. టిఎంసికి 542 కోట్ల రూపాయలు, డిఎంకెకి 503 కోట్ల రూపాయలు, కాంగ్రెస్‌కు 50 కోట్లు, వైఎస్ఆర్‌సిపికి 154 కోట్ల రూపాయలు, బిజెపికి 100 కోట్లు, సిక్కిం క్రాంతి కార్‌మోర్చాకు 11, సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్‌కు 5 కోట్ల రూపాయలను ఆ సంస్థ అందచేసింది.

ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడం నిస్సందేహంగా ప్రజాస్వామ్యానికి అనుకూలమైన చర్య. సంఘ్‌పరివార్ నిరంకుశత్వాన్ని ఇది దెబ్బతీసింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దాచిపెట్టిన ఆల్ఫాన్యూమరిక్ కోడ్ (ఈ కోడ్ బాండ్లను కొనుగోలు చేసిన వారిని, స్వీకరించిన రాజకీయ పార్టీలతో సరిపోల్చడానికి వీలు కల్పిస్తుంది)ను బహిర్గతం చేయకముందే ఆ సమాచారంలో కొంతభాగం తెలిసిపోయింది. కోర్టులో విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో అందచేసిన ఎలక్టోరల్ బాండ్ల దాతల పేర్లను డిఎంకె స్వయంగా ఎన్నికల కమిషన్‌కు అందచేసింది. ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఆ వివరాలను ఎన్నికల కమిషన్ బహిరంగ పరిచింది. డిఎంకెతో పాటు ఎఐఎడిఎంకె, ఎన్‌సిపి, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్ (సెక్యులర్), జనతాదళ్ (యునైటెడ్) పార్టీలు కూడా తాము అందుకున్న ఎలక్టోరల్ బాండ్ల విరాళాల వివరాలను వెల్లడించాయి. అయితే, పెద్ద మొత్తంలో బాండ్లు స్వీకరించిన బిజెపి, కాంగ్రెస్, టిఎంసి, బిఆర్ఎస్‌లు తమ దాతల పేర్లను ప్రకటించలేదు.

**4. పూనేకు చెందిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా** ప్రైవేట్ లిమిటెడ్‌ను పూనేవాలా కుటుంబం నిర్వహిస్తోంది. ఇది కరోనా కోసం రూపొందించిన కోవిషీల్డ్ వ్యాక్సిన్ తయారీదారుల్లో ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీల్లో ఒకటి. ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేయడానికి బదులుగా బిజెపికి లబ్ధి చేకూర్చడానికి ఈ సంస్థ పన్ను రహిత ఎలక్టోరల్ ట్రస్టు మార్గాన్ని అనుసరించింది. 2022 ఆగస్టులో (కరోనా రెండవ వేవ్ గరిష్టస్థాయికి చేరుకున్న తరువాత) మూడు విడతలుగా 50.25 కోట్ల రూపాయలను ఈ సంస్థ బిజెపికి అందచేసింది. దీనికోసం ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు (అంతకుముందు దీనినే సత్య ఎలక్టోరల్ ట్రస్టు అని పిలిచేవారు) ను ఎంపిక చేసింది. ఆ ట్రస్టు ద్వారా బిజెపికి తాను ఇవ్వదలుచుకున్న మొత్తాన్ని ఇచ్చేసింది.

> **“ రాయ్‌టర్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2013వ సంవత్సరం నుండి వివిధ ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా దాదాపుగా 2,176 కోట్ల రూపాయలు దేశంలోకి వచ్చాయి. ఆ మొత్తంలో 3/4వ వంతు బిజెపికే చేరింది. ఢిల్లీలోని ఇద్దరు ఛార్టెడ్ అక్కౌంటెంట్లు గుట్టుచప్పడు కాకుండా నిర్వహిస్తున్న ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు ద్వారా దేశంలోని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు నిధులను అందచేస్తున్నాయి. ”**

రాయ్‌టర్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2013వ సంవత్సరం నుండి వివిధ ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా దాదాపుగా 2,176 కోట్ల రూపాయలు దేశంలోకి వచ్చాయి. ఆ మొత్తంలో 3/4వ వంతు బిజెపికే చేరింది. ఢిల్లీలోని ఇద్దరు ఛార్టెడ్ అక్కౌంటెంట్లు గుట్టుచప్పడు కాకుండా నిర్వహిస్తున్న ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు ద్వారా దేశంలోని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు నిధులను అందచేస్తున్నాయి. సునీల్ భారతీ మిట్టల్ నేతృత్వంలోని భారతీ ఎయిర్‌టెల్ గ్రూపు, రుయాస్ యొక్క ఎస్సార్ గ్రూపు, డిఎల్ఎఫ్ గ్రూపు, కుశాల్ పాల్‌సింగ్ నేతృత్వంలో పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు, పలు పురుగుమందుల కంపెనీలు ఈ ట్రస్టును ఉపయోగించుకుంటున్నాయి.

రాజకీయ పార్టీలకు నిధులు అందచేయడానికి (పొలిటికల్ ఫండింగ్) భారతదేశంలో అనేక దారులు, అడ్డదారులు కూడా ఉన్నాయి. వీటిలో ఎలక్టోరల్ బాండ్లు ఒకటి. మాజీ ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ 2017 ఫిబ్రవరిలో చేసిన ఎన్నికల ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రస్తావించినప్పుడు ఈ పథకం రాజకీయ పార్టీల నిధుల్లో పారదర్శకతను తీసుకువస్తుందని చెప్పారు. అయితే, ఆయన మాటలను చాలా మందినమ్మలేదు. ఈ పథకానికి నిబంధనలు రూపొందించడానికి 11 నెలల సమయం పట్టింది. అయితే, ఆర్‌బిఐతో పాటు ఆర్థికశాఖలోని పలువురు అధికారులు ఈ పథకాన్ని వ్యతిరేకించారు. తాజాగా ఎలక్టోరల్ బాండ్లు కొన్న 18,871 మంది దాతల పేర్లతో పాటు, వారు కొన్న తేదీలను, వాటిని అందుకున్న పార్టీల పేర్లను, బాండ్లను నగదుగా మార్చుకున్న తేదీలను బహిరంగ పరచాలని సుప్రీంకోర్టు ఎస్‌బిఐని ఆదేశించింది. అలా ప్రస్తుతం మనకు తెలిసిన సమాచారం అందుబాటులోకి వచ్చింది. అయితే, దేశంలో చట్టబద్దంగానూ, చట్ట వ్యతిరేకంగానూ జరుగుతున్న పొలిటికల్ ఫండింగ్‌లో ఎలక్టోరల్ బాండ్లు ఒక చిన్న భాగం మాత్రమే అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

మన దేశంలో సెమీ కేపిటలిస్ట్, సెమీ ఫ్యూడల్ అనే పదాలను తరుచుగా వాడుతుంటారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ కూడా ధనబలం, కండబలం దుర్వినియోగాన్ని అడ్డుకోవడం గురించి మాట్లాడుతోంది. ఈ పద ప్రయోగాలు రాజకీయ ఆర్థిక వ్యవస్థ యొక్క గమనశీలతను తెలియచేస్తాయి. ఒకవైపు కార్పొరేట్ సంస్థలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పాలక పార్టీలకు సమర్ధవంతంగా ముడుపులు చెల్లిస్తూ, తమకు కావాల్సిన టెండర్లను దక్కించుకుంటున్నాయి. మరోవైపు దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో ఒక రాజకీయ పార్టీయో, లేక స్వయంగా రాజ్యమో ఫ్యూడల్ ప్రభువుల నిరంకుశత్వ లక్షణాలను అలవర్చుకుంటున్నాయి. వీటితో పాటు, సంఘ్‌పరివార్ సైద్ధాంతిక ప్రాజెక్టు కూడా ఉంది. ఇది సైనికీకరించిన హిందువులను శాశ్వతంగా సమీకరించడం ద్వారా నిరంకుశత్వ భారతీయ సమాజాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. హిందూ రాష్ట్రంగా పిలిచే దీనిని సాధించుకోవడం కోసం అది నిరంతరం శత్రువులను వెతుకుతూఉంటుంది. ఆ లక్ష్య సాధనలో భాగంగా ప్రస్తుతమున్న చట్టాలను, సామాజిక జీవనాన్ని మార్చడం కూడా దీనికి అవసరం. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు రాజకీయ విభాగం. హిందూ దేశాన్ని నిర్మించే పథకానికి కచ్చితంగా భారీ మొత్తంలో నిధులు అవసరం. అదే విధంగా దేశ వ్యాప్తంగా ఉన్న బలవంతుల మద్దతు కూడా అవసరం. దీని అర్థం సమాజంలోని అర్ధ పెట్టుబడిదారీ, అర్ధ భూస్వామ్య వర్గాల నుండి డబ్బు, బలం సంఘ్ పరివార్‌కు అవసరం. అయితే, వీరి మద్దతు పొందడం, అధికారాన్ని సాధించడం మాత్రమే సంఘ్ లక్ష్యాలు కావు. అంతిమ

> **❝ ఎలక్టోరల్ బాండ్లను, పొలిటికల్ ఫండింగ్‌ను సాధారణ అవినీతి వ్యవహారంగా నో లేక క్రోని కాపిటలిజమ్ గానో (ఆశ్రిత పెట్టుబడి దారి విధానం) లేదా చట్టబద్ధ పాలన సరిదిద్దగల ఇతర అవినీతి, దోపిడి సాధనంగానో చూడకూడదు. రాజ్యం-పెట్టుబడికి సంబంధించిన విధానాల్లో 'ధనాన్ని అనుసరించడం' అనేది ఒకటి. ❞**

లక్ష్యాన్ని సాధించడానికి ఇవి సాధనాలు మాత్రమే.

ఎలక్టోరల్ బాండ్లను, పొలిటికల్ ఫండింగ్‌ను సాధారణ అవినీతి వ్యవహారంగా నో లేక క్రోని కాపిటలిజమ్ గానో (ఆశ్రిత పెట్టుబడి దారి విధానం) లేదా చట్టబద్ధ పాలన సరిదిద్దగల ఇతర అవినీతి, దోపిడి సాధనంగానో చూడకూడదు. రాజ్యం-పెట్టుబడికి సంబంధించిన విధానాల్లో 'ధనాన్ని అనుసరించడం' అనేది ఒకటి. పెట్టుబడిపై నియంత్రణ కలిగి ఉన్న వారి ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యం వ్యవహరించాలి. వారు తమ నిధులను ఉపసంహరించుకుంటే పాలన కుప్పకూలుతుంది. కాబట్టి అధికారంలో ఉన్న వారు పెట్టుబడిదారుల కోరికలను తీర్చాలి. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలోని క్విడ్‌ప్రోకోకు సంబంధించిన సూత్రమిది. లాభదాయకమైన కాంట్రాక్టులను సొంత చేసుకోవడానికి ముందు లేదా తరువాత చాలా కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను అధికారంలో ఉన్న వారికి విరాళంగా ఇచ్చినట్లు తేలడం దీనిలో భాగమే. కంపెనీల దృష్టి నుండి దీనిని వ్యాపారంచేయడానికైన ఖర్చుగా భావించవచ్చు. అంటే బ్యాలెన్స్‌షీట్‌లో ప్రస్తుతమున్న పన్నులు, సుంకాలు తదితర వరుసలకు ఖర్చుకు సంబంధించిన మరో వరుస అదనంగా చేర్చబడుతుంది.

ఇప్పుడు రాజ్యానికి సంబంధించిన 'గుత్తాధిపత్యం' లేదా ' హింస యొక్క గుత్తాధిపత్యం' భావనను పరిశీలిద్దాం. విధేయులైన పోలీసు బలగాలు, దర్యాప్తు ఏజెన్సీలు, చాలా నెమ్మదిగా స్పందించే లేదా విధేయంగా వ్యవహరించే న్యాయవ్యవస్థల సహాయంతో ప్రభుత్వం ఎవరినైనా వేధించవచ్చు. ఈ తరహా దాడులను నివారించుకోవడానికి కంపెనీలు కొంత చెల్లించుకోవాల్సి రావచ్చు. ఆ చెల్లింపులతో ఆ కంపెనీలపై దాడులు నిలిచిపోతాయి. వాటికి సంబంధించినంతవరకు ఇది వ్యాపారానికి సంబంధించిన మరో ఖర్చు మాత్రమే! అంటే ఇక్కడ ప్రభుత్వ యంత్రాంగం ఒక రక్షణ రాకెట్‌ను నిర్వహిస్తోంది. ఈ రక్షణ రాకెట్ చాలా తరుచుగా నేరవ్యవస్థలో భాగంగా వ్యవహరిస్తుంది. మైనింగ్, రియల్ ఎస్టేట్‌తో సహా వివిధ రకాల వ్యాపారాలు చేసే సంస్థలు ప్రజలకు వ్యతిరేకంగా చేసే నేరాల (ప్రజల భూమిని గుంజుకోవడం, కాలుష్యాన్ని వెదజల్లడం తదితరాలకు) అండగా నిలుస్తుంది. చట్టబద్ధమైన చర్యల నుండి ఈ రక్షణ రాకెట్ వారిని కాపాడుతుంది.

ఈ రెండు సమస్యలను చట్ట పరంగా పరిష్కరించుకోవచ్చు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు క్విడ్ ప్రోకో ఆరోపణలపై దర్యాప్తు చేయవచ్చు. తప్పు చేసిన వారిని ప్రాసిక్యూట్ చేయవచ్చు. న్యాయస్థానాలు శిక్షలు విధించవచ్చు. చట్టవిరుద్ధంగా ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేయవచ్చు. న్యాయబద్ధంగా టెండర్లను నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయవచ్చు. ఎన్‌ఫోర్స్‌మెంటు చర్యలనుండి రక్షణ కోసం విరాళాలు ఇచ్చినట్లు తేలితే తప్పు చేసిన వారిని విచారించి, శిక్షించవచ్చు. చట్టబద్ధంగా లావాదేవీలు జరిగిఉంటే వాటిని కొనసాగించవచ్చు.

ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో మరొక అంశం పన్ను ఎగవేత. కంపెనీల పుస్తకాల్లో కార్పొరేట్ లాభాలను తగ్గించి చూపడానికి షెల్ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చిన్న కంపెనీలు, స్పష్టంగా లేని బినామీ సంస్థల ఏర్పాటు భారీ రాజకీయ విరాళాలకు దారి తీస్తోంది. ధృడమైన రాజకీయ సంకల్పం ఉంటే, చట్టబద్ధమైన పాలన ద్వారా దీనిని ఎదుర్కోవచ్చు. అయితే, ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని కోర్టు కొట్టివేసినప్పటికీ, ఈ పథకం ద్వారా ఎవరు, ఎవరికి ఎంత విరాళం ఇచ్చారన్నది పూర్తి స్థాయిలో బహిర్గతం చేయడం అవసరం.

రాజకీయ పార్టీలకు నిధులు కేవలం ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే అందడం లేదు. బాండ్లను ప్రవేశపెట్టినప్పటికీ బిజెపికి అందిన మొత్తం నిధుల్లో అవి 50 శాతం మాత్రమే. కాంగ్రెస్ పార్టీకి అందిన నిధుల్లో ఎలక్టోరల్ బాండ్ల వాటా 60శాతం. చాలా పార్టీలు బ్యాంకుల్లో ఖాతాలు తెరచినప్పటికీ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వాటికి నిధులు అందలేదు. ఇతర విరాళాల రూపంలో అవి నిధులను సేకరించాయి. ఈ తరహా నిధుల కోసం ఇంతకు ముందున్న మార్గాలు ఇప్పుడు కూడా ఉన్నాయి. బాండ్ల పథకం రద్దు కావడంతో అవి మళ్లీ తెరమీదకు వస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి కంపెనీలు లాభదాయకంగా ఉన్నాయి. మూడేళ్లలో తమ సగటు లాభాల్లో 7.5శాతం వరకు మాత్రమే అవి విరాళాలు ఇవ్వాలి. తమ బ్యాలెన్స్ షీట్లలో ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చాయో ప్రకటించాలి. అయినప్పటికీ, నగదు రూపంలో, బినామీదార్ల ద్వారా పెద్ద ఎత్తున గుర్తింపులేని విరాళాలు రావడానికి దారి తీసే అవకాశం ఉంది.


రాజకీయ పార్టీల నిధులకు సంబంధించి పారదర్శక పథకమేదీ లేదు. అంతర్జాతీయ అనుభవం కూడా ఇదే. ఉత్తమ వ్యవస్థలు ఉన్నాయని భావించే చోట్ల కూడా అస్పష్ట స్థితే. ఎందుకంటే తన రాజకీయ పలుకుబడిని, పార్టీల మద్దతును రహస్యంగా ఉంచడానికే పెట్టుబడి ఎప్పుడూ ప్రయత్నిస్తుంది. భారతదేశంలో బ్లాక్ ఎకానమి ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపించి ఉంది. రాజకీయ ఆర్థిక వ్యవస్థ యొక్క దోపిడి నమూనాలో భాగంగా రాజకీయ పార్టీలకు భారీ దాతగా ఉంది. ప్రజా నిధుల వ్యవస్థను రూపొందించడం వంటి చర్యలు ఈ దిశలో కొంత మేర పారదర్శకతను పెంచే అవకాశం ఉంది. అయితే. పార్టీలకు అందే విరాళాలను ఎలా ఖర్చు చేయాలన్నది మరో సమస్య. దీనిపై స్పష్టత లేకుండా పార్టీలకు నిధులు అందే (సప్లయి వైపు) తీరుపై మాత్రమే తీసుకునే చర్యలు ఏమాత్రం చాలవు.

భారతదేశ ఎన్నికలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా మారాయి. రాజకీయ పార్టీల నిర్వహణ కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తారు. భారతదేశంలోని రాజకీయ పార్టీలుకూడా అతి పెద్ద పార్టీలు. ప్రపంచంలోని ఇతర పెద్ద పార్టీలతో అవి పోటీపడుతాయి. ఎన్నికల ప్రచారంలోనూ అదే పోకడను అనుసరిస్తాయి. అయితే, పార్టీలు చేసే ఖర్చులో లెక్కల్లోకి, చర్చకు పెద్దగా రానిది ఓటర్లకు అవి ఇచ్చే తాయిలాలు. నగదు రూపంలోనూ, వస్తువుల రూపంలోనూ

(మిగతా 34వ పేజీలో)

# దక్షిణాదిన కొత్త రాజ్యాల స్థాపన-విస్తరణ

**ఎంవిఎస్ శర్మ**



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

దక్షిణ భారత ఉపఖండంలో రాజ్యాలు ఏర్పడిన తొలిదశ క్రీ.పూ.200–కీ.శ. 300 నాటిది. ఈ దశలో దక్కను ప్రాంతం మీద శాతవాహనుల ఆధిపత్యం నెలకొంది. అదే విధంగా తమిళ రాజ్యాల ఆధిపత్యం చెన్నపట్నానికి దక్షిణాన ఉన్న భూభాగాల మీద ఏర్పడింది. ఈ కాలంలో తమిళనాడుకు ఉత్తరాన, కర్నాటక, మహారాష్ట్రలకు దక్షిణాన ఉన్న భూభాగాలు, మహానది, గోదావరి నదుల మధ్య వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న భూబాగాలలో ప్రజలు శాతవాహన, లేదా తమిళ చక్రవర్తుల ఆధిపత్యానికి లోబడి వ్యవహరించేవారు. ఈ ప్రాంతాలలో ప్రజలకు తమ స్వంత రాజ్యాలు అప్పటికి ఏర్పడలేదు. క్రీ.శ.300–600 మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో దాదాపు పాతిక రాజ్యాలు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతాలలో లభించిన భూశాసనాలను బట్టి ఈ విషయాలను నిర్ధారించవచ్చు. క్రీ.శ.7వ శతాబ్దం నాటికి వాటిలో కాంచీపురం రాజధానిగా పాలించిన పల్లవులు, బాదామి రాజధానిగా పాలించిన చాళుక్యులు, మదురై రాజధానిగా పాలించిన పాండ్యులు ప్రధాన సామ్రాజ్యాధిపతులుగా ఉన్నారు.

### క్షీణించిన పట్టణాలు, వ్యాపారం

తొలి దశలో (క్రీ.పూ.200–క్రీ.శ.300) అనేక చేతివృత్తులు అభివృద్ధి చెందడం, దేశీయంగా మాత్రమే గాక ఇతర దేశాలతోనూ, ఇతర ఖండాలతోనూ వ్యాపారం పెరగడం, నాణేలను విస్తృతంగా ఉపయోగించడం. అనేక పట్టణాలు ఏర్పడడం ప్రధాన ధోరణులు. అదే రెండవ దశకు వచ్చేసరికి వ్యాపారం, నాణేల వినియోగం బాగా తగ్గుముఖం పట్టాయి. పట్టణాలు బలహీన పడ్డాయి. దాంతో బతుకుతెరువు కోసం గ్రామాలవైపు వలసలు మొదలయ్యాయి. ఆ గ్రామాల్లో వ్యవసాయ భూములు విస్తరించనిదే అక్కడ కూడా మనుగడ కష్టం అవుతుంది. అందుచేత ఈ దశలో పాలకులు ఎటువంటి పన్నులూ చెల్లించనవసరం లేకుండా భూములను విరివిగా బ్రాహ్మణులకు దానాలుగా ఇచ్చారు. ఆ కొత్త భూముల్లో వ్యవసాయం విస్తరించాలంటే అక్కడ జీవించే స్థానికులను వ్యవసాయ సమాజంలోకి, కొత్త ఉత్పత్తి విధానంలోకి తీసుకురావాలి. ఉత్పత్తి స్థాయి పెరిగిన కొద్దీ అక్కడ చేతివృత్తులవారికి కూడా జీవనోపాధి లభిస్తుంది. భూదానాలను విరివిగా చేయడం ద్వారా పాలకులు ఈ ప్రక్రియకు దోహదం చేశారు.

### బలపడిన బ్రాహ్మణాధిపత్యం

బ్రాహ్మణాధిపత్యం ఈ కాలంలో బలపడింది. మొదవటి దశ కాలంలో దక్షిణాదిలో ఆంధ్ర, మహారాష్ట్ర ప్రాంతాల్లో బౌద్ధం విస్తృతంగా వ్యాపించింది. జైనం, బౌద్ధం దక్షిణాదిలో తమిళనాట కూడా వ్యాపించినట్టు అక్కడి గుహల్లోని చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. కాని రెండవ దశ వచ్చేసరికి జైనం కర్నాటకలోని కొంత ప్రాంతానికి మాత్రమే పరిమితం అయిపోయింది. రాజులు వైదిక క్రతువులను నిర్వహించిన దాఖలాలు దక్షిణాపథం అంతటా కనిపించాయి. పల్లవ రాజుల హయాంలో తమిళనాడు ప్రాంతంలో శైవ, వైష్ణవ రాతి దేవాలయాల నిర్మాణం జరిగింది. ఇదే కాలంలో కర్నాటకలో బాదామి పాలకులైన చాళుక్య రాజుల ఆధ్వర్యంలో ఈ మాదిరి దేవాలయాల నిర్మాణం జరిగింది. తొలి దశలో ప్రధానంగా గుహలను తొలిచి దేవాలయాలను నిర్మించే సంస్కృతి ఉండేది. అదే రెండవ దశ ముగిసే నాటికి, అంటే క్రీ.శ. 7వ శతాబ్దం నాటికి దక్షిణాది అంతటా దేవాలయాల నిర్మాణం చాలా విస్తృతంగా జరిగింది. (చూ: బాదామిలో కొండను తొలిచి నిర్మించిన దేవాలయం)

దక్షిణాదిలో అశోకుడి కాలంలో స్థాపించిన శిలా శాసనాలు మినహాయిస్తే తక్కిన శాసనాలన్నీ, క్రీ.శ.300 వరకూ ప్రధానంగా ప్రాకృత భాషనే ఉపయోగించాయి. తమిళనాట ఉపయోగించిన బ్రాహ్మీ లిపి సైతం ప్రాకృత పదాలతో కూడివుంది. అదే క్రీ.శ.400 నాటికి దక్షిణాదిన సంస్కృతం అధికార భాషగా రూపొందింది. చాలా శాసనాలు ఆ భాషలోనే కనిపిస్తున్నాయి. (చూ. పటం: దక్షిణాది భారతంలో క్రీ.శ.300–750 మధ్య కాలపు ప్రధాన పట్టణాలు)

ఉత్తర మహారాష్ట్ర, విదర్భ ప్రాంతంలో శాతవాహనుల అనంతరం వాకాటకులు పరిపాలన చేపట్టారు. వాకాటకులు బ్రాహ్మణులు. అనేకమంది బ్రాహ్మణులకు భూములను దానం చేస్తూ జారీ చేసిన రాగి శాసనాలు ఎక్కువగా లభిస్తున్నాయి. బ్రాహ్మణ లేదా వైదిక మతాన్ని బలంగా వ్యాప్తి చేయడానికి వాకాటకులు పాటుపడ్డారు. వీరి ప్రభావం ఉత్తర భారతం మీద ఎక్కువగా ఉంది. రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడు తన కుమార్తె ప్రభావతిని వాకాటక ప్రభువులకే ఇచ్చి వివాహం జరిపించాడు. వారి తోడ్పాటుతోనే గుజరాత్, పశ్చిమ భారత భూభాగాలను శక రాజులనుండి గెలుచుకోగలిగాడు. ఇది క్రీ.శ.4వ శతాబ్దం చివరి భాగంలో జరిగింది. వాకాటక రాజ్యం బ్రాహ్మణ సంస్కృతిని, ఆ భావజాలాన్ని దక్షిణాదికి వ్యాపింపజేయడంలో ఒక వాహకంగా పని చేసింది.

వాకాటకుల తర్వాత దక్షిణాపథాన, ముఖ్యంగా దక్కను ప్రాంతంలో సుమారు రెండు శతాబ్దాలపాటు ఆధిపత్యం నెరపినవారు చాళుక్యులు. క్రీ.శ.757లో వీరిని రాష్ట్ర కూటులు కూలదోసేవరకూ ఆ ఆధిపత్యం కొనసాగింది. తాము నేరుగా బ్రహ్మకు వారసులమనీ, మనువు వారసులమనీ, చంద్రవంశపు ప్రభువులమనీ చెప్పుకుని తమది ఉన్నత క్షత్రియ వంశం


> **"చాళుక్యులు క్రీ.శ.6వ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో పశ్చిమ దక్కను ప్రాంతంలో ప్రస్తుత బిజాపూర్ ప్రాంతంలోని వాతాపి వద్ద తమ రాజ్యాన్ని స్థాపించారు. దీనినే ఇప్పుడు బాదామిగా వ్యవహరిస్తున్నారు. ఈ చాళుక్యులు ఆ తర్వాత కాలంలో అనేక స్వతంత్ర రాజ్యాలుగా వేరు వేరు ప్రాంతాల్లో ఏర్పడినప్పటికీ, వారి ప్రధాన కేంద్రంగా వాతాపి కొనసాగింది."**

అనిపించుకోడానికి చాళుక్యులు తాపత్రయ పడ్డారు. కాని వారు స్థానిక కన్నడిగులే అని చెప్పడానికి పలు ఆధారాలున్నాయి. వీరిని కూలదోసిన రాష్ట్ర కూటులు అంతవరకూ వీరికి సామంతులుగా వ్యవహరించినవారే.

చాళుక్యులు క్రీ.శ.6వ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో పశ్చిమ దక్కను ప్రాంతంలో ప్రస్తుత బిజాపూర్ ప్రాంతంలోని వాతాపి వద్ద తమ రాజ్యాన్ని స్థాపించారు. దీనినే ఇప్పుడు బాదామిగా వ్యవహరిస్తున్నారు. ఈ చాళుక్యులు ఆ తర్వాత కాలంలో అనేక స్వతంత్ర రాజ్యాలుగా వేరు వేరు ప్రాంతాల్లో ఏర్పడినప్పటికీ, వారి ప్రధాన కేంద్రంగా వాతాపి కొనసాగింది. చాళుక్యుల రాజ్యం తర్వాత మళ్ళీ దక్కను ప్రాంతంలో ప్రాధాన్యతకల రాజ్యం ఏర్పడింది విజయనగర సామ్రాజ్యం తోనే.

శాతవాహనులు బలహీనపడిన తర్వాత కృష్ణా-గుంటూరు ప్రాంతంలో ఇక్ష్వాకులు తమ రాజ్యాన్ని స్థాపించారు. స్థానిక తెగకు చెందిన ఇక్ష్వాకులు తమ వంశ ప్రతిష్టను చాటుకునే ప్రయత్నంలోనే ఇక్ష్వాక అన్న పేరు తగిలించుకున్నారు. నాగార్జున కొండ, ధరణికోట ప్రాంతాల్లో ఇక్ష్వాకులు చాలా నిర్మాణాలు చేపట్టారు. కృష్ణా-గుంటూరు ప్రాంతంలో ఎక్కువగా భూదానాలు చేసినట్టు వీరి శాసనాలు తెలుపుతున్నాయి.


ఇక్ష్వాకుల అనంతరం పల్లవులు తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు. పల్లవం అంటే తీగ. తమిళంలో దానినే తొండై అంటారు. తొండైనాడు ప్రాంతంలో (తీగ మొక్కలు ఎక్కువగా ఉండిన ప్రాంతం) తమ అధికారాన్ని తొలుత స్థాపించినందువలన వీరికి పల్లవులు అన్న పేరు వచ్చింది. ఐతే అప్పటి నాగరిక ప్రపంచం వీరిని ఆమోదించడానికి కొంత సమయం పట్టివుండాలి. తొండై అన్న పదానికి తమిళంలో ఇంకొక అర్థం దోపిడీ దొంగ. క్రమంగా పల్లవుల అధికారం




**దక్కను, దక్షిణ భారత దేశ పటం**

విస్తరించింది. కాంచీ పురాన్ని రాజధానిగా చేసుకుని వీరు పాలించారు. వీరి హయాంలో కంచి దేవాలయాలతో నిండి వేదాధ్యయనానికి కేంద్రంగా ఉండేది.

క్రీ.శ.4వ శతాబ్దంలో ఉత్తర కర్నాటకలో తమ రాజ్యాన్ని స్థాపించిన కాదంబులతో పల్లవులు తొలి నాళ్ళలో తలపడ్డారు. కాదంబ రాజ్యాన్ని స్థాపించిన మయూర శర్మ కంచి పట్టణంలో వేదాలను అభ్యసించడానికి



**బదామీలో గుహాలయం**

వెళ్ళినట్టు అక్కడ అతడిని అమర్యాదకరంగా వెళ్ళగొట్టినట్లు గాథ ఉంది. ఆ అవమానానికి ప్రతీకారం చేయడం కోసం మయూర శర్మ అక్కడికి సమీపంలోనే ఉన్న అడవుల్లో ఉంటూ స్థానిక తెగల ప్రజలను కూడగట్టి పల్లవులతో తలపడినట్టు చెప్తారు. ఆ యుద్ధంలో మయూర శర్మను ఓడించినప్పటికీ, ఆ తర్వాత అతడిని ప్రభువుగా గుర్తించి పల్లవులు సంధి చేసుకున్నారు. ఉత్తర కనరా ప్రాంతంలోని వైజయంతి (దీనినే బనవాసి అని కూడా అంటారు) దగ్గర మయూర శర్మ తన రాజ్యాన్ని స్థాపించాడు. 18 అశ్వమేథ యాగాలు చేసినట్టు, విరివిగా బ్రాహ్మణులకు భూదానాలు చేసినట్టు శాసనాలు లభిస్తున్నాయి.

పల్లవ రాజులకు సమకాలీకులుగా ఉన్న గాంగులు దక్షిణ కర్నాటక ప్రాంతంలో క్రీ.శ.4వ శతాబ్దంలో తమ రాజ్యాన్ని స్థాపించారు. అటు పశ్చిమాన కాదంబులకు, ఇటు తూర్పున పల్లవులకు మధ్య గాంగుల రాజ్యం ఉండేది. కొంతకాలంపాటు గాంగులు పల్లవులకు సామంతులుగా వ్యవహరించారు. వీరి భూభాగంలోనే బంగారం గనులున్న కోలారు ప్రాంతం ఉంది. అక్కడ బంగారం ఖనిజాన్ని కనుగొన్నాక, దాని బలంతో వీరు స్వతంత్ర రాజులుగా వ్యవహరించసాగారు. గాంగులు ఎక్కువగా జైన మఠాలను ప్రోత్సహించారు. అటు కాదంబులు, ఇటు పల్లవులు మాత్రం బ్రాహ్మణులనే ఎక్కువగా ఆదరించారు.

పల్లవులు, కాదంబులు, చాళుక్యులు, వారి సమకాలీకులు ఎక్కువగా బ్రాహ్మణ మతాన్నే ప్రోత్సహించారు. అశ్వమేధ యాగం, వాజపేయ యాగం వంటి క్రతువులను విరివిగా చేస్తూ తమ ప్రతిష్టను పెంచుకునే ప్రయత్నం చేశారు. వీరికి ప్రతిష్ట పెరగడంతోబాటు బ్రాహ్మణులకు ఆదాయాలు కూడా బాగా గిట్టుబాటు అయేవి. ఈ క్రమంలో బ్రాహ్మణులు సంపదను చేజిక్కించుకుని సంపన్నులయారు. రాజు రైతులనుండి వసూలు చేసే పన్నుల్లో అధికభాగం యాగాల రూపంలో బ్రాహ్మణులవద్దకు చేరేది.

**కాలభ్రుల సవాలు**

దక్షిణ భూభాగంలో దిగువన ఉన్న పాండ్య, చేర, చోళ సామ్రాజ్యాలు బలహీన పడిన తర్వాత ఆ ప్రాంతంలో జరిగిన చారిత్రిక పరిణామాల గురించి కొద్దిగా మాత్రమే మనకు తెలుస్తోంది. వాటిలో ముఖ్యంగా ఇక్కడ చెప్పుకోవలసినది కాలభ్రుల తిరుగుబాట్లు. వీళ్ళు ప్రధానంగా బౌద్ధులు. బ్రాహ్మణులకు విచ్చలవిడిగా భూములమీద అధికారాన్ని కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళ ప్రాంతంలో క్రీ.శ.6వ శతాబ్దంలో కాలభ్రులు అనేకమంది ప్రభువులను ఓడించి బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేశారు. వీళ్ళని అణచివేయడానికి చోళ, పాండ్య, చేర

ప్రభువులు అందరూ కలిసి ఒక కూటమిగా వ్యవహరించవలసివచ్చింది. ఒకానొక సమయంలో కాలభ్రులు చోళ, పాండ్య, చేర రాజలందరినీ నిర్బంధించగలిగారని గాథలు చెప్తున్నాయి. కాలభ్రుల తిరుగుబాట్లు ఆనాడు ఏర్పడిన రాజకీయ సామాజిక వ్యవస్థ మీదనే ఎక్కుపెట్టబడ్డాయనీ, బ్రాహ్మణాధిపత్యానికి వారు పెను సవాలుగా నిలిచారని చెప్పవచ్చు. తమిళ ప్రాచీన 'సంగం' లోని రాతలను బట్టి క్రీ.శ. 3వ శతాబ్దం వరకూ యుద్ధాల్లో వీరత్వాన్ని ప్రదర్శించిన యోధులకు చక్రవర్తులు భూములపై అధికారాన్ని కల్పించే పద్ధతి ఉండేది. అందుకు భిన్నమైన పద్ధతిని ప్రవేశపెట్టడాన్ని వారు వ్యతిరేకించారని అనుకోవాలి.

### పల్లవులకు, చాళుక్యులకు మధ్య ఎడతెగని ఘర్షణలు

క్రీ.శ.6వ శతాబ్దం నుండి 8వ శతాబ్దం మధ్య కాలంలో కంచిని పాలించిన పల్లవులకి, బాదామిని పాలించిన చాళుక్యులకి మధ్య ఎడతెగని యుద్ధాలు జరిగాయి. రెండు రాజ్యాలూ బ్రాహ్మణ మతాన్ని పాటించినవే. ఐనప్పటికీ ఘర్షణలు జరగడానికి కారణం ఆ రెండు రాజ్యాలకూ మధ్య ఉన్న భూభాగం. కృష్ణా, తుంగభద్ర నదులమధ్య ఉన్న డెల్టా ప్రాంతం మీద ఆధిపత్యం కోసం ఈ రెండు రాజ్యాలు పరస్పరం తలపడ్డాయి. ఆ తర్వాత కాలంలో విజయనగర రాజులకు, బహమనీ సుల్తానులకు మధ్య యుద్ధాలకు కూడా ఈ భూమిపైన ఆధిపత్య వాంఛే ప్రధాన కారణం. పల్లవ రాజులు పలుమార్లు తుంగభద్రను దాటి దక్కను ప్రాంతంలోకి చొచ్చుకురావడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలను చాళుక్యులు తిప్పికొడుతూవచ్చారు.

చాళుక్య ప్రభువుల్లో ప్రముఖుడు రెండవ పులికేశి ( (609–642). అతడి చరిత్రను పొగుడుతూ ఆస్థాన కవి రవికీర్తి చెక్కించిన శాసనాలు లభించాయి. వాటిలోని అతిశయోక్తులను పక్కన పెడితే అవి ఆ నాటి చరిత్రకు సంబంధించి విలువైన సమాచారాన్ని అందించాయి. ఆ శాసనాల్లో ఉపయోగించిన సంస్కృత భాష ఆ నాటికి ఉన్నత స్థాయికి చేరిందని చెప్పవచ్చు. రెండవ పులికేశి పశ్చిమాన కాదంబులను ఓడించిన తర్వాత గాంగులు అతడి సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. ఆ తర్వాత అతడు నర్మదా తీరంలో హర్షుడి సేనలను ఎదుర్కొని నిలవరించాడు. అక్కడి నుండి పల్లవులమీద దండయాత్రకు బయలు దేరాడు. ఐతే పల్లవులు అతడితో సంధి చేసుకున్నారు. క్రీ.శ.610 నాటికి పులికేశి

"చాళుక్యుల ఆధిపత్యానికి పల్లవ రాజు నరసింహ వర్మ((630-668) గండి కొట్టాడు. క్రీ.శ. 642లో ఏకంగా చాళుక్యుల రాజధాని వాతాపినే స్వాధీనం చేసుకున్నాడు. ఆ యుద్ధంలో రెండవ పులికేశి మరణించాడు. ఈ నరసింహ వర్మ దక్షిణాన పాండ్య, చేర, చోళ రాజులను, కాలభ్రులను సైతం ఓడించినట్టు తెలుస్తోంది."



మహాబలిపురంలో రథం దేవాలయం, కంచిలోని కైలాశనాథ దేవాలయం

కృష్ణా–తుంగభద్ర ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఈ ప్రాంతాన్నే వేంగి అని కూడా అంటారు. ఆ ప్రాంతంలో పులికేశి తన ప్రతినిధిని నియమించి ఏలుబడి సాగించాడు. ఇక్కడినుండి పాలించిన చాళుక్యులనే వేంగీ చాళుక్యులు లేదా తూర్పు చాళుక్యులు అని అంటారు.

ఐతే చాళుక్యుల ఆధిపత్యానికి పల్లవ రాజు నరసింహ వర్మ ((630–668) గండి కొట్టాడు. క్రీ.శ. 642లో ఏకంగా చాళుక్యుల రాజధాని వాతాపినే స్వాధీనం చేసుకున్నాడు. ఆ యుద్ధంలో రెండవ పులికేశి మరణించాడు. ఈ నరసింహ వర్మ దక్షిణాన పాండ్య, చేర, చోళ రాజులను, కాలభ్రులను సైతం ఓడించినట్టు తెలుస్తోంది.

ఆ తర్వాత చాళుక్య రాజు విక్రమాదిత్యుడు–2 (733–745) పల్లవ రాజధాని కంచిని మూడుసార్లు కొల్లగొట్టాడు. పల్లవులను పూర్తిగా ఓడించాడు. ఐతే చాళుక్యుల ఆధిపత్యం ఎంతో కాలం కొనసాగలేదు. క్రీ.శ. 757లో రాష్ట్ర కూటులు చాళుక్య సామ్రాజ్యాన్ని కూలదోశారు. పల్లవులు ఓడిపోయిన తర్వాత కూడా దాదాపు ఒక శతాబ్దం పాటు ప్రభువులుగా పెత్తనం సాగించారు. ఐతే ఆ ఓటమితో దక్షిణాన వారికి గల ప్రాభవం క్రమంగా నశించింది.

### దేవాలయాలు

వైదిక క్రతువులు నిర్వహించడం తోబాటు సామాన్య ప్రజల్లో ప్రాచుర్యం పొందినవి బ్రహ్మా, విష్ణు, మహేశ్వర ఆరాధనలు. ముఖ్యంగా విష్ణువును, ఈశ్వరుడిని ఎక్కువగా ఆరాధించసాగారు. విష్ణుభక్తులైన ఆళ్వారులు వైష్ణవ సాంప్రదాయాన్ని బాగా ప్రచారం చేశారు. మరోపక్క నయనార్లు శైవ ఆరాధనను ప్రచారంలో పెట్టారు. 7వ శతాబ్దం నాటికి దక్షిణాపథాన భక్తి ఉద్యమం మత కార్యకలాపాలలో ప్రధాన పాత్రను పోషించింది. ఇందులో ఆళ్వారులు, నయనార్లు ముఖ్య పాత్ర పోషించారు.

పల్లవ రాజులు మహాబలిపురం ప్రాంతంలో నిర్మించిన ఏడు రథాల దేవాలయాలు చాలా ప్రసిద్ధికెక్కాయి. ఇవి చెన్నపట్నానికి 65 కి.మీ. దూరంలో ఉన్నాయి. వీటిని 7వ శతాబ్దంలో నరసింహ వర్మ కట్టించినట్టు చెప్తారు. పల్లవ రాజుల హయాంలో అనేక దేవాలయాలను రాళ్ళతో కట్టారు. 8వ శతాబ్దంలో కంచిలో నిర్మించిన కైలాసనాథ దేవాలయం కూడా పేరు పొందింది. (చూ. మహాబలిపురంలోని రథాలయం, కంచిలోని కైలాసనాథ దేవాలయం)

ఇదే కాలంలో చాళుక్య ప్రభువులు కూడా తమ రాజ్యంలో అనేక రాతి దేవాలయాల నిర్మాణాన్ని నిర్వహించారు. 680లో నిర్మించిన పాపనాథ దేవాలయం, 740లో నిర్మించిన విరూపాక్ష దేవాలయం చెప్పుకోదగ్గవి. 40 మీటర్ల పొడవుతో, చాలా ఎత్తుగా, బహుళ

(మిగతా 8, 9 పేజీల్లో)

# భారత ఆర్థికాభివృద్ధి: అన్నీ అనుమానాలే



రచయిత న్యూఢిల్లీలోని ఓపి జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీలో జర్నలిజం విభాగం ప్రొఫెసర్. సైన్సు-టెక్నాలజీతో సహా అనేక అంశాలపై విస్తృతంగా రచనలు చేశారు.

**సుకుమార్ మురళీధరన్**

భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2021-22 అర్థిక సంవత్సరంలో కొత్త పుంతలు తొక్కుడం ప్రారంభించిందని వార్తాపత్రికలు పతాక శీర్షికలు వెలువరించాయి . 2022-23 ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వార్తలనే గట్టిగా పట్టుకుంది. ఐ ఎం ఎఫ్ వంటి ఏజెన్సీలు కూడా అధికారికంగా వచ్చిన ఈ భావనను గట్టిగా ధ్రువపరుస్తున్నాయి బీ ఈ ఆర్థిక సంవత్సర అభివృద్ధిలో ,భారతదేశ ఆర్థిక వ్యవస్థ ,ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అగ్రభాగాన నిలిచి ఉంటుందని ,భవిష్యత్తులో కూడా ఉండే అవకాశాలు ఉన్నాయని ఉ టంకించింది.

ఇన్ని అడ్డంకులు ఎదురైనా, భారతదేశ ఆర్థిక వ్యవస్థ, స్థితిస్థాపకత సాధించిందని డాంబికాలు పోవడానికి, ప్రభుత్వాలు తమను తాము అభినందించుకోడానికి ఈ సందర్భం ఎంతగానో ఉపయోగపడింది. 2020 నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి గురించి అర్థవంతంగా ఏం మాట్లాడుకున్నా,మహమ్మారిని గురించిన ప్రస్తావన అందులో భాగం కావలసిందేబీ ఇది మరో రెండేళ్ల పాటు ప్రపంచాన్ని కుదిపేస్తుందని అంచనా ఉండనే ఉంది. మానవుల ప్రాణాలను రక్షించేందుకు గాను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను మూసేయాల్సిన పరిస్థితి వచ్చింది ఆ నాడు . మహమ్మారి చేసిన దాడి నుంచి అతి త్వరగా బయటపడాలన్న ఆశతో ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, ఆ చర్యల ఆధారంగా చేసిన జోస్యాలన్నీ చివరికి భ్రమలుగా తేలాయి.

మానవుల జీవనోపాధులను త్యాగం చేయాల్సి వచ్చిందిబీ ప్రాణం పోతే, తిరిగి తెచ్చుకోలేము గానీ ఉపాధి పోయినా తిరిగి సంపాదించుకోగలమని భావించడం జరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2020 లో 4.3 % కుంచించుకుపోయింది. మొత్తంగా %వి%10 . 3 ట్రిలియన్ల ఆదాయం నష్టపోయాం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2020-21 మొదటి త్రైమాసంలో ,అప్పుడు రెండు నెలలపాటు లోక్ డౌన్ ప్రకటించబడింది, 23.9 % కుంచించుకు పోయింది.

అతలాకుతలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కాస్తంత ఊపిరి తీసుకుని బయటపడుతుండగా ,1945 నుండి ప్రశాంతంగా ఉన్న యూరప్ లోని రాజ్యాల మధ్య సైనిక చర్యలు మొదలయ్యాయిబీ 1990 ల నుంచి బహిష్కరించబడిన రాజ్యాధికార ముఠా కుమ్ములాటలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇది ఇంధన ధరలను అమాంతం పైకిఎగబాకెట్టు చేసింది బీ విదేశీ వాణిజ్య సమతుల్యత దెబ్బతినింది. ఆర్ బి ఐ రంగంలోకి దిగి రూపాయి విలువను కాపాడేందుకు పూనుకోగా విదేశీ నిల్వలకు భారీగా గండి పడింది.

మహమ్మారి తొలిదశ అంతం అవగానే ,ఇక అభివృద్ధి నిరాటంకంగా జరుగుతుందని జోస్యాలు చెప్పారు. దీనికి ఆర్థిక సర్వే 2020-21 మద్దతు నిచ్చింది. ఆర్థిక ఉదారవాద విధానాలు అనేక రంగాలలో,అనేక రూపాలలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోబడ్డాయి.

1980 ల నుండి భారతదేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే సిద్ధాంతాలు, మార్కెట్లను ఉత్తేజపరిచి అభివృద్ధి సాధించేందుకు దోహద పడతాయని భావించడం జరిగింది. కానీ,2021 ఏప్రిల్ లో ఉన్న ఆ ఆశ కాస్తా త్వరలోనే, మహమ్మారి రెండో సారి దాడి చేయడంతో ఆవిరయ్యింది. దీనికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఏమాత్రం సంసిద్ధంగా లేదు.

అప్పటినుండి భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనం ముందనుకున్నట్టు 'v' కాదు గాని 'k' ఆకారంలో ఉందన్న పాట మొదలైంది. పూర్తి తిరోగమనం కాదు, పురోగమనం నుండి వెనక్కి మళ్ళినా మళ్ళీ అత్యంతవేగంగా పుంజుకుంటుందని అంచనా. ఈ కాలంలో, కాస్తంత అయినా పురోగతి ఉన్న మాట నిజమేగానీ, అది ధనికులకు మాత్రమే బీ అశేష ప్రజానీకం జీవన స్థితులు ఇప్పటికీ పడిపోతూనే ఉన్నాయి.

అనేక రంగాలలో'k' రూపంలో పునరుద్ధరణ ఉన్నట్టు తెలుస్తున్నది- ప్రధానంగా ఆటోమొబైల్, గృహ, విలాస వస్తువుల వినియోగ పరిశ్రమ. కానీ ఉన్నత తరగతుల పరిమితమైన వినిమయం వలన మొత్తంగా చూసినప్పుడు సరాసరి గణాంకాలు అతి తక్కువ స్థాయిలోనే ఉన్నాయి.

ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ బాగా నెమ్మదించి ఉందిబీ మహమ్మారి వ్యాపించక ముందున్న సాధారణ జీవన ప్రమాణాలు అందుకోడానికి ఇంకా చాల దూరం ప్రయాణించవలసి ఉంది. అనిశ్చిత స్థితి కొనసాగుతూనే ఉంది. భారతదేశంలో గాని.ప్రపంచవ్యాప్తంగా గాని అభివృద్ధి అంతుచిక్కని రహస్యం గా మిగిలే ఉందిబీ పెట్టుబడులు పుంజుకోనే లేదు. గత దశాబ్దం లో స్థూల స్థిర పెట్టుబడి నిర్మాణం ఆర్థిక వ్యవస్థలో 34% నుండి 30% నికి పడిపోయింది.

ఇక స్థూల స్థిర పెట్టుబడిలోని వివిధ

అంశాలను పరిశీలిస్తే, ప్రభుత్వ రంగం పాత్ర పెరుగుతున్నప్పటికీ ,ఆ పెరుగుదల పరిమితంగా ఉండడం గమనిస్తాము. ప్రభుత్వం ప్రధానంగా మౌలిక వసతుల కల్పనలో పురోగతి సాధించినట్టు చెప్పుకుంటున్నా, అదింకా జాతీయ గణాంకాలలో ప్రతిబింబించడం లేదు. ప్రైవేటు రంగం లో పెట్టుబడులు ఆశించిన మోతాదులో పుంజుకోలేదు.

అందువలన నిందారోపణలపర్వం మొదలయింది. నిర్మలాసీతారామన్ అవకాశం దొరికినప్పుడల్లా ప్రైవేటు పెట్టుబడిదారులు ప్రభుత్వ పెట్టుబడులకు దీటుగా పెట్టుబడులు పెట్టడంలో విఫలమైనందుకు వారిని కించపరుస్తూనే ఉన్నారు. కానీ ఆశ్చర్యకరంగా, పెట్టుబడులు తగ్గడానికి కారణాలుగా ఈ రెండు రంగాలలో దేనినీ బాధ్యులను చేయరు . అది వ్యక్తిగత స్థిర పెట్టుబడులు తీవ్ర స్థాయిలో తగ్గడంగా చూపుతున్నారు. భౌతిక సంపదలనుండి, ద్రవ్య సంపాదనలవైపుకు మళ్లడం గర్హించదగ్గ విషయమే. అదికూడా ఎత్తువల్లాలుగా ఉన్నది. సాధారణంగా భారతదేశంలో సాధారణ ప్రజలు బంగారం రూపంలో స్థిర సంపదను కలిగి ఉంటారని, అవసరాలకు దానిని నగదు రూపంలో మార్చుకుంటారని అనుకోడం కద్దు. కానీ గత దశాబ్ద కాలంలో పెట్టుబడిగా బంగారాన్ని కొన్న కుటుంబాలు తక్కువగా ఉన్నాయి.

" వ్యక్తులు తమ పెట్టుబడులను ఇళ్లపై పెట్టడానికి మొట్టమొదటి ప్రాధాన్యత నిస్తున్నారు. ఆ తరువాత సాధారణ కుటుంబీలకు ఉపయోగించే వస్తువులపై పెట్టుబడులుపెడు తున్నారు. గత దశాబ్దంలో ఈ పెట్టుబడులే గణనీయంగా తగ్గాయి. ఈ అంశాన్నే విధాన నిర్ణయధికారులు తీవ్రంగా పరిగణించవలసి ఉంటుంది. "




వ్యక్తులు తమ పెట్టుబడులను ఇళ్లపై పెట్టడానికి మొట్టమొదటి ప్రాధాన్యత నిస్తున్నారు. ఆ తరువాత సాధారణ కుటుంబీలకు ఉపయోగించే వస్తువులపై పెట్టుబడులుపెడుతున్నారు. గత దశాబ్దంలో ఈ పెట్టుబడులే గణనీయంగా తగ్గాయి. ఈ అంశాన్నే విధాన నిర్ణయధికారులు తీవ్రంగా పరిగణించవలసి ఉంటుంది.

మరోవైపు జరుగుతున్న మార్పులను కూడా శ్రద్ధగా గమనించవలసిన అవసరం ఉంది. వ్యక్తులు తమ పొదుపులో ఎక్కువ భాగం, ద్రవ్య రూపంలో సంపదను కలిగి ఉండడానికి ఇష్టపడుతున్నారు. ఇప్పటివరకు చాలామంది కింది తరగతిలో ఉన్నవారు తమ సంపదని భౌతిక రూపంలో– ఇల్లు, బంగారం, లేదా ఇతర తరుగులేని సంపదలు, కలిగి ఉండడానికి ప్రాధాన్యత నిస్తారని భావించడం జరుగుతున్నది బీ కాదని ఎక్కడా రుజువు కాలేదు కూడా. ఈ నిల్వచేసుకోవడం ఇప్పుడు ద్రవ్య పెట్టుబడులవైపుకు మళ్లింది. ఇందులో ఇక పార్శ్వము లాభదాయకం అయితే మరొకటి నష్టదాయకమైనది కూడా. లాభదాయకమని చెప్పుకునే అంశం –ఇముడ్చుకునే అర్దిక విధానాల అమలు. ప్రత్యక్షంగా నగదు బదిలీ చేయడం, డిజిటల్ విధానంలో చెల్లింపులు– వీటినే ప్రస్తుత ప్రభుత్వం తన విజయాలుగా బాకాలూదుకుంటున్నది. ఈ పథకాలు అమలులో లేకుండా ఉండి ఉంటే వ్యక్తిగత పొదుపులు మరింతగా పెరిగేవేమో. ఇక అశుభ పరిమాణామం, పెరుగుతున్న అసమానతలు. ఇది ఉన్నత ఆదాయ వర్గాలలో మరింత ఎక్కువగా ద్రవ్య రూపాలుగా సహజంగానే సంతరించుకుంటుంది.

ఇప్పుడు అందుబాటులో ఉన్న గణాంకాలను బట్టి చూస్తే, వాస్తవాలకు ఏది దగ్గరగా ఉందో తెలుసుకోవాలంటే, వివిధ తరగతుల పొదుపు చేసే విధానాలను మరింత స్పష్టంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఈ అధ్యయనం ఇప్పటప్పట్లో సాధ్యపడే అవకాశం లేదు.

ద్రవ్య రూపంలో ఉన్న పెట్టుబడులు ప్రాముఖ్యత పెరుగుత్నునదని మాత్రం స్పష్టంగా చెప్పగలం. భౌతిక సంపదల కన్నా ద్రవ్య పెట్టుబడి ప్రాధాన్యత సంతరించుకున్నది. ఇది కొత్త విధాన రూపకల్పన కి దారి తీస్తున్నది. ఒకప్పుడు ఉత్పత్తి ప్రవాహం ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు నిర్ణయించడంలో కీలకపాత్ర పోషించేది. ఉత్పత్తి క్రమం నుండి వచ్చిన ఆదాయం ఆధారంగా ఆదాయ పంపిణి, ఆర్థిక సంక్షేమం నిర్ణయించబడుతుండేవి. ఈ రోజుకొత్తగా సృష్టించబడుతున్న సంపద , మార్కెట్లు సృష్టిస్తున్న సంపద పై ఆధారపడుతున్నందువలన, సంపద సృష్టిలో దాని వాటాని ఏమాత్రం విస్మరించలేము.

స్టాక్ మార్కెట్ అభిమానులు నవంబర్ 13 వ తేదీ ముంబై స్టాక్ ఎక్స్ఛేంజి లో దీపావళి ముహూర్తం వాణిజ్యాన్ని ఉత్సవంగా జరుపుకుంటారు. వ్యక్తులు మరింత అధికంగా స్టాక్ ఎక్స్ఛేంజి లో పెట్టుబడులు పెడుతున్నారు.

> **"భారతదేశంలో అభివృద్ధి వేగవంతం అవడమంతా 'యూనికోర్న్'ల - కొత్తగా సృష్టించబడిన సంస్థల చుట్టూ తిరుగుతున్నది. ఇవి ఐటి రంగంలో ఎక్కువగా విస్తరించాయి. వీటి మార్కెట్ విలువ బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంటుంది. స్వల్పకాల లాభాపేక్షతో దేశ నిలవాలని ఈ రంగం వైపు మరింత ఎక్కువగా మళ్ళించబడుతున్నాయి."**

అనేక అధ్యయనాలు ,ప్రధానంగా 2013 లో థామస్ పికెటి అనే ఫ్రెంచ్ ఆర్థిక శాస్త్ర వేత్త , 21 వ శతాబ్దంలో కాపిటల్ అనే తన పుస్తకంలో వ్రాసినట్టు, ఉత్పత్తుల ద్వారా పొందిన ఆదాయాల కన్నా,ద్రవ్య పెట్టుబడి సంపద యాజమాన్యం ఎక్కువ అసమానతలకు దారితీస్తున్నది . గత మూడు దశాబ్దాలలో,ప్రధానంగా 2008 లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం అయిన తరువాత, ప్రపంచంలోని చాలా ఆర్థిక వ్యవస్థలలో పెట్టుబడులు పెట్టే వార0దరూ, తమ పెట్టుబడులను అవసరమనుకున్న వెనువెంటనే ద్రవ్య రూపంలోకి మార్చుకునే అవకాశాలున్న పెట్టుబడులతో మదుపు పెట్టడానికే ప్రాధాన్యత నిస్తున్నారు.

కోవిద్ మహమ్మారి వ్యాపించిన కాలంలో ఈ విషయం స్పష్టంగా కనిపించనుందిబీ ప్రపంచవ్యాప్తంగా అన్ని ఆర్థిక వ్యవస్థలు ఎంత ఒత్తిడికి గురి చేయబడ్డాయో ఆ సందర్భంలోనే తెలియవచ్చింది. జనజీవనం నిలిపే సాధారణ నగదు బదిలీలు స్తంభించిన వేళ, మరింత ఎక్కువగా వ్యవస్థలోకి నగదును జొప్పించడం ద్వారా మాత్రమే వ్యవస్థను కాపాడ గలిగాము. అది అనేక పేర్లతో జరిగింది-పరిమాణాత్మక సులభతరీకరణ అనేది ప్రస్తుతం వాడుతున్న పదం- కానీ, అసలు విషయం , డబ్బు సృష్టించడం.

సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థలో ,దీని వలన ధరలు మరింతగా పెరగాల్సిందిబీ అన్ని తరగతుల ఆర్థిక సంక్షేమం నాశనం అయి ఉండవలసింది. కానీ, కొత్తగా సృష్టించబడిన సొమ్ము, అత్యంత సులభతరంగా అసెట్ మార్కెట్ లోకి ప్రవహించింది. సాధారణ ధరలు పెరగడానికి బదులుగా అసెట్ ధరలు పెరిగాయి.

దీనివలన పెట్టుబడులమీద ఆదాయాలు అధికంగా వచ్చాయిబీ పెట్టుబడి ఖరీదు తగ్గింది. షేర్స్ ధరలు గణనీయంగా పెరగడంతో కొత్త పెట్టుబడులను ఆకర్షించడం సులభతరం అయింది.

ప్రపంచ పెట్టుబడి మార్కెట్‌లో విలువలు పెంచుకునే ఆటలు ఎలా ఆడబడతాయో తెలుసుకుంటున్న వారెవరికయినా ,కొత్త స్టార్ట్ అప్ ల పేరుతొ వ్యవస్థలు కళ్లుచెదిరే లాభాలను ఎలా పోగేసుకున్నారో అర్థం అవుతుంది.

**యూనికోర్న్ ల పెరుగుదల**

భారతదేశంలో అభివృద్ధి వేగవంతం అవడమంతా 'యూనికోర్న్', ల చుట్టూ - కొత్తగా సృష్టించబడిన సంస్థ లు- తిరుగుతున్నది.ఇవి ఐటి రంగంలో ఎక్కువగా విస్తరించాయి. వీటి మార్కెట్ విలువ బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంటుంది. స్వల్పకాల లాభాపేక్షతో దేశ నిలవాలని ఈ రంగం వైపు మరింత ఎక్కువగా మళ్ళించబడుతున్నాయి. ఇందులో చెప్పుకోవలసిన అంశం, ఈ సంస్థలలో చాలా సంస్థలు సాంప్రదాయకంగా లాభాలుగా పరిగణించే, ఆదాయం నుండి ఖర్చులు పోను మిగిలేది, లాభలన్నవి ఏనాడూ ఎరగని సంస్థలు. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ఎదుర్కొన్న క్లిష్టమైన సుడులనుండి బయట పడడానికి ఈ దారిని వెతుక్కున్నట్టుందిబీ ఈ విధానంలో విదేశీ పెట్టుబడి పాత సంస్థలో మరింత పెట్టుబడిని పెట్టి కొత్తగా సంస్థ విలువ పెరిగినట్టు చూపడం జరుగుతున్నది. ఈ సంస్థ ఎదుగుతున్న భ్రమ కల్పిస్తున్నది.

దీనితో పాటుగా కొంత ప్రమాదం పొంచి ఉన్నరంగం రియల్ ఎస్టేట్ రంగం. సట్టా వ్యాపారానికి అలవాటుపడ్డ ఈ రంగం ఆధునికతను ఎంతమాత్రం ఆహ్వానించడానికి సిద్ధంగా లేదు. వ్యక్తులు చేసుకున్న పొదుపులు ఆర్థిక వ్యవస్థద్వారా ఈ రంగం వైపుకు మళ్లుతుంటాయి.నిజానికి కొనే వాళ్ళు మరోవేపు తగ్గుతూనే ఉన్నారన్నది వాస్తవం అయినప్పటికీ ,ఇది ఆస్తుల ధరలు పెరగడానికి దారితీస్తుంది. ఆరోగ్యకరమైన ఆర్థిక రంగ నిర్మాణానికి అంతిమ బాధ్యత గల ఆర్‌బిఐ ,అనేక పర్యాయాలు ఈ విషయంలో హెచ్చరికలు జారీచేసిందిబీకానీ, ప్రధానంగా, ప్రభుత్వ ఖజానాకు భారీమొత్తాలలో దీని పెట్టుబడులు బదలాయించబడుతుండడంతో, ఈ రంగంలో స్థిరత్వం సాధించడానికి సమర్ధవంతంగా జోక్యం చేసుకోవడంలో ఆర్ బి ఐ వెనక్కుతగ్గింది.

2018 లో అప్పటి ఆర్‌బిఐ డెప్యూటీ గవర్నర్ గా ఉన్న వైరల్ ఆచార్య, కేంద్ర బ్యాంకు స్వతంత్రత అనివార్యమని, దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మాట్లాడారు. ఈ సందర్భంలో ఆయన అర్జెంటీనా విషయం ప్రస్తావించారు. అర్జెంటీనాలో 2010 లో ఆనాటి ప్రభుత్వం అక్కడి కేంద్ర బ్యాంకులో ఉన్న మొత్తం పెట్టుబడిని ,బడ్జెట్ నిధులు పెంచుకోడానికి అనువుగా,ప్రభుత్వ బడ్జెట్ కి బదలాయించామని కోరింది. కథ అంతటితో ఆగలేదు. ఆ తరువాత ,అన్యాయంగా ఆస్తులను బదిలీ చేసినందుకుగాను అమెరికా కోర్టు, అమెరికాలో ఉన్న అర్జెంటీనా కేంద్ర బ్యాంకు నిల్వలను స్తంభింపచేసింది. అప్పుడే అర్జెంటీనాలో మితవాద ప్రభుత్వం ఎన్నికయిందిబీ అతడు, కేంద్ర బ్యాంకును' పేల్చేస్తానని', మరకద్రవ్యాన్ని మొత్తంగా నిర్మూలిస్తానని, అమెరికా డాలర్ నే తమ కరెన్సీ గా చేస్తానని ప్రచారం చేసారు.

భారతదేశంలో అటువంటి సమస్య ఉత్పన్నం కాలేదుకానీ, ఆర్‌బిఐకి ప్రభుత్వానికి కొంత ఘర్షణ తలెత్తింది. ఆర్‌బిఐ తనదగ్గరున్న మొత్తాన్ని ఆర్థిక వ్యవస్థలో సమతుల్యత కాపాడడానికి వినియోగించాలని నిర్ణయించు కుంది.ప్రభుత్వం, నిధులు హక్కుదారుగా, తన బడ్జెట్ కోసం అందు బాటులో ఉన్న నిధులు వినియోగించుకోవాలని అనుకుంది. ఈ ఘర్షణలో ఇద్దరు ఆర్‌బిఐ గవెర్నర్లు , కొంతమంది డిప్యూటీలు మారారు- ఇవేవి ఆర్థిక అనిశ్చితిని నివారించ లేవు. ప్రపంచ అల్ల కల్లోలాలు తప్పని నేటి వాతావరణంలో, భవిష్యత్తులో విపత్తు ఎదురైనప్పుడు సమస్యను ఎలా పరిష్కరించాలన్న సమస్య అయితే నేటికీ అపరిష్కృతంగా మిగిలిపోయింది.

❋

విశ్లేషణ

# ప్రజాస్వామ్య పరిరక్షణా సంవత్సరం



రచయిత ఢిల్లీ యూనివర్శిటీలో సోషియాలజీ లెక్చరర్, సామాజిక-రాజకీయ అంశాల విశ్లేషకులు

**సతీశ్ దేశ్‌పాండే**

ఈ లీపు సంవత్సరం ప్రారంభం కాకముందే మనకాలంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిగా అదుపు చేసే ప్రభుత్వాలు ఏర్పడే సంవత్సరంగా రూపొందింది. అన్ని ఖండాలకు చెందిన 60కి పైగా దేశాలల్లోని, ప్రపంచంలోని సగం మందికి పైగా ప్రజలు తమ ప్రభుత్వాలను ఎన్నుకోవటానికి ఈ సంవత్సరంలోని 366 రోజుల కాలంలో ఎన్నికలలో పాల్గొననున్నారు. ఇది కేవలం ఎన్నికలకు సంబంధించినది మాత్రమే కాక, ప్రపంచంలోని పలుకుబడి కలిగిన ప్రభుత్వాల స్వభావం మారటం వలన 2024 ప్రత్యేకమైన రాజకీయ లీపు సంవత్సరంగా ఉండనున్నది. ఈ మధ్యకాలంలో జరిగిన ఎన్నికలలో బ్రెజిల్, చిలీ మితవాదం వైపుకు మొగ్గకుండా నిలబడ్డాయి. ఈ సంవత్సరం చివరలో జరగనున్న ఎన్నికలలో అమెరికా, యూరోపియన్ యూనియన్, మెక్సికోలు మరింతగా మితవాదం వైపుకు పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బ్రిటన్ గత దశాబ్దంలో మితవాద విధానాలను ఎక్కువగా అమలు చేసింది. ఇపుడు ఆ విధానాలు మరింత తీవ్రంగా అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. టర్కి, హంగరీలలో ప్రజాకర్షక విధానాలను అనుసరిస్తూ ఇంతకు ముందు నుండి మితవాద ప్రభుత్వాలు అధికారంలో కొనసాగుతున్నాయి. ఇపుడు జరిగిన ఎన్నికలలో ప్రజలు ఆ ప్రభుత్వాలకు ఆమోదం తెలిపారు. రష్యాలో జరుగనున్న ఎన్నికలలో వ్లదిమీర్ పుతిన్ మరోసారి అధికారంలో కొనసాగటానికి ప్రజలు అవకాశం ఇవ్వవచ్చునని భావిస్తున్నారు. ఒక జాతిని అంతం చేయటం కోసం గాజాలో జరుగుతున్న యుద్ధం ఇజ్రాయిల్ ఎన్నికలను జయప్రదంగా దారి తప్పించింది. బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంలోని అత్యంత మితవాద ప్రభుత్వ ఆయుష్షును నిరవధికంగా పెంచింది. "పశ్చిమ దేశాల ఉదారవాదం" గా చెప్పేదానికి గాజా ముగింపు పలికిందనేది నిర్వివాదాంశం. చెదురుమదురుగా జరుగుతున్న ప్రతిఘటనలను మినహాయిస్తే ప్రపంచంలోని అత్యధిక భాగం మితవాదం నుండి అత్యంత తీవ్రమైన మితవాదం వైపుకు మొగ్గుతున్నది.

ప్రపంచంలోని రాజకీయ వాతావరణంలో జరుగుతున్న ఈ మార్పులు ఎన్నికలు, రాజకీయ పార్టీల సాంప్రదాయక ప్రజాస్వామ్య, సైద్ధాంతిక చట్రమైన మితవాదం-మధ్యేవాద-అతివాదం ల పరిధిని అధిగమించాయి. "ప్రజలకు మేలు చేయటం గురించి ఎక్కువగా చెబుతూ, నిరంకుశ విధానాలను అనుసరించటం" ఈ మార్పులో కీలకమైనది. ప్రజా ఉద్యమాలు బలమైన నాయకులపై విశ్వాసాన్ని పెంచి, ప్రజలు నిరంకుశమైన పాలనను కూడా ఆమోదించే విధంగా చేస్తాయి. సిద్ధాంతపరమైన రాజకీయాల కోసం కాకుండా, గతంలో పనికిరాని భావాలుగా ఉన్నవాటికి విస్తృత ప్రజామోదం పొందటం కోసం ఈ ఉద్యమాలు ముందుకొస్తాయి. జాతి దురభిమానం, సంకుచిత భావాలతో విద్వేషాలను రెచ్చగొడు తున్న నాయకులకు ప్రపంచవ్యాపితంగా ప్రజాభిమానం పెరగటాన్ని చూస్తున్నాం.

ఈ నాయకులు తమను అనుసరించే ప్రజలను తీవ్రమైన బాధలకు గురిచేస్తున్నప్పటికీ, వారికి ప్రజాభిమానం కొనసాగుతుండటం అనేది ఇందులో కీలకమైనది. నిన్నటి వరకు ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకున్న వాటిలో ఒకదేశం తర్వాత మరొక దేశంలో ఫాసిస్ట నాయకులు, ప్రభుత్వాలను సమర్థించటం కోసం గణనీయమైన సంఖ్యలో ఓటర్లు త్యాగాలు చేయటానికి సిద్ధపడుతున్నారు.

ప్రపంచంలో సంభవిస్తున్న ఈ పరిణామాల పూర్వరంగంలో చూసినపుడు మరికొద్ది రోజులలో మనదేశంలో జరుగనున్న ఎన్నికలను ప్రత్యర్థి రాజకీయ కూటముల మధ్య జరిగే ఎన్నికలుగానే కాక, మరింత విస్తృతమైన అంశాల ప్రాతిపదికగా చూడాల్సివుంటుంది. రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఈ ఎన్నికలలో ప్రతిపక్ష రాజకీయ కూటమిని, దాని గెలుపు అవకాశాలను అంచనా వేయటం అంటే వాస్తవ పరిస్థితులను విస్మరించటమే అవుతుంది. 1977లో జరిగిన ఎన్నికలు ఇందిరాగాంధి ప్రకటించిన 18 నెలల ఎమర్జెన్సీ పాలనపై రిఫరెండంకాగా, 2024లో జరుగుతున్న ఈ ఎన్నికలు మోడి 10 సంవత్సరాల అప్రకటిత ఎమర్జెన్సీ పాలనపై రిఫరెండంగా ఉండనున్నాయి.

### ప్రజాస్వామ్య భావన

రిఫరెండం లాంటి పరిస్థితులలో అధికారంలో ఉన్న కూటమికి, ప్రతిపక్ష కూటమికి మధ్య పోటీగా ఎన్నికలు జరుగుతున్నాయని ఆలోచించటం పొరపాటవుతుంది. మోడి ప్రభుత్వం మన రాజకీయ వ్యవస్థలోని ప్రజాస్వామిక సారాన్నంతా నిర్వీర్యం చేసిన తర్వాత, బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ నుండి తీసుకున్న "అధికార పక్షం" లేక ప్రభుత్వం, "అధికారపు నీడ" లేక ప్రతిపక్షం అన్నవాటిని తప్పనిసరిగా పక్కన పెట్టాల్సి ఉంటుంది. మనదేశంలో నెలకొల్పిన విలువలను, మన రాజ్యాంగంలోని ప్రధానాంశాలను గత దశాబ్దకాలంగా ప్రభుత్వం నీరుగారుస్తున్నది. కులం, మతం, వర్గం ఏదైనప్పటికీ ఈ దేశంలోని పౌరులందరూ సమాన హక్కులను అనుభవిస్తారన్న భావనను మోడి ప్రభుత్వం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వ్యతిరేకిస్తున్నది. చట్టసభలు, కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థల మధ్య అధికారాలను విభజించటాన్ని అంగీకరించటం లేదు. ప్రభుత్వ పదవికి, దానికి ఎన్నికైన వ్యక్తికి మధ్య ఉండాల్సిన విభజనను అది వ్యతిరేకిస్తున్నది.

> **" ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఎజెండా ప్రకారం జరుగుతున్న ఎన్నికలను రిఫరెండంగా భావించటం ఆ ఎజెండాకు రాయితీ ఇవ్వటమే అవుతుంది. ఉన్నతస్థాయిలో జరుగవలసిన రాజకీయ పోరాటంలో అటువంటి అభిప్రాయం శత్రువుకు ఆధిక్యతను ఇవ్వటానికి, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టటానికి దారితీస్తుంది. ఈ విధమైన పోలిక భ్రమాజనితంగా ఉంటుంది. "**

రాజ్యాంగచట్టం నిర్దేశించిన పరిధిలో వివిధ సిద్ధాంతాలు, అభిప్రాయాలు ఆమోదయోగ్యమైన స్థాయిలో పోటీ పడుతూ, ప్రజాస్వామిక పద్ధతిలో పరిపాలన సాగించటం అన్న అతి ప్రధానమైన ప్రజాస్వామిక భావననే అది వ్యతిరేకిస్తున్నది.

ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఎజెండా ప్రకారం జరుగుతున్న ఎన్నికలను రిఫరెండంగా భావించటం ఆ ఎజెండాకు రాయితీ ఇవ్వటమే అవుతుంది. ఉన్నతస్థాయిలో జరుగవలసిన రాజకీయ పోరాటంలో అటువంటి అభిప్రాయం శత్రువుకు ఆధిక్యతను ఇవ్వటానికి, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టటానికి దారితీస్తుంది. ఈ విధమైన పోలిక భ్రమాజనితంగా ఉంటుంది.

గత దశాబ్దకాలంలో సంఘ్ పరివార్ సాటిలేని రాజకీయ శక్తిగా ఎదిగింది. నరేంద్రమోడిని మహా నాయకునిగా ముందుకు తెచ్చింది.

ఇటువంటి పరిస్థితులలో సాధారణమైన వ్యూహంతో రాజకీయ రంగంలో పోటీపడాలంటే ఒక సాధారణమైన నాయకుడు లేక నాయకురాలిని మహా నాయకునిగా చిత్రించటం, మీడియా ఆయనను ఆకాశానికి ఎత్తటం చేయాలి. దానితో పాటు పాలక పక్షాన్ని సవాలు చేయటానికి బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండా కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఇవేవీ సాధ్యం కాదు.

ఇవేవీ అవసరం కూడా కాదు. బాలివుడ్ తరహాలో డిష్యుం-డిష్యుంలతో ముగించే సమయం కూడా కాదు. శత్రువు బలాన్ని, శక్తిని తెలుసుకోవలసిన సమయం ఇది. ప్రతిపక్షం అన్న ముద్రను కూడా తిరస్కరించాలి. మనకు తెలిసిన భారతదేశం అన్న భావనను మౌలికంగా మోడి ప్రభుత్వమే వ్యతిరేకిస్తున్నదని ప్రచారం చేయాల్సిన సమయం ఇది. ఇండియా పేరును భారత్‌గా మార్చాలని కుట్రబుద్ధితో ప్రచారం చేస్తున్నారు. అలా జరిగినప్పటికీ లోపభూయిష్టంగా పనిచేస్తున్న మన ప్రజాస్వామ్యంపై సంఘ్ పరివార్ కున్న వ్యతిరేక భావాలలో వీసమెత్తుకూడా మార్పురాదు.

### తీవ్రమైన నిఘా

దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ఇండియా కూటమిని వ్యతిరేకించటం, అది ఏ మాత్రం విలువ లేనిదని, అందులోని భాగస్వాములు పరస్పరం ఘర్షణ పడుతున్నారని, ఓడిపోయిన వారికి ఎటువంటి లక్ష్యం లేదని చిత్రించటం పాలకపక్ష వ్యూహంగా ఉన్నది. బిజెపి పట్ల విమర్శనాత్మకంగా ఉంటున్న విశ్లేషకులు ఇండియా కూటమిని విమర్శిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. కూటమిలో తప్పులు వెదకటం సులభంగా ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో ఇండియా కూటమిలో అసాధారణమైన ఐక్యత ఏర్పడుతుందనో లేదా ఈ కూటమి పట్ల ప్రజలలో పెద్దస్థాయిలో సానుకూలత వ్యక్తమౌతుందనో భావించటం అంటే స్వయం వినాశనాన్ని కోరి తెచ్చుకోవటం అవుతుంది. కాబట్టి ఇటువంటి సమయంలో రిఫరెండం ప్రచారాన్ని అందుకుని, ప్రమాదకరమైన హిందుత్వ ఎజెండాకు వ్యతిరేకంగా ఓటు వేయమని చెప్పటం ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. అపుడు " కాదు అని చెప్పండి" అన్నది ప్రధాన నినాదంగా ఉంటుంది. సానుకూలమైన ఎజెండాను కూడా ముందుకు తెచ్చినప్పటికీ, దాని అవసరం లేదు కాబట్టి పెద్దగా ఉపయోగం ఉండదు. స్పష్టమైన, సంపూర్ణమైన, పూర్తి మార్పుకు దోహదం చేసే రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకురావాల్సిన అవసరాన్ని, ఎన్నికలలో "కాదు" అని చెప్పక తప్పని పరిస్థితిని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, నరేంద్రమోడి కల్పించారు.

అయినప్పటికీ " కాదు" అని ప్రచారం చేయటానికి కూడా కష్టపడి పనిచేయాలి. 1977లో ఎమర్జెన్సి తర్వాత జరిగిన ఎన్నికల ప్రచారంలో కన్నా ఇపుడు జరుగుతున్న ఎన్నికలలో ప్రచారం చేయటంలో మరిన్ని సమస్యలు ఎదురౌతాయి. వీటిలో ప్రధానమైనది మన సమాజం మతపరంగా చీలిపోవటం. గత దశాబ్దంతో పోల్చుకుంటే ఇందిరాగాంధి కొద్దికాలం విధించిన అత్యవసర పరిస్థితి దాదాపుగా ప్రమాదరహితంగా కనిపిస్తుంది. సంజయ్‌గాంధి, ఆయన తల్లి ఇందిరాగాంధిలు అపుడపుడు హిందు మతోన్మాద భావాలకు ఆకర్షితులైనట్లు వ్యవహరించినప్పటికీ, వారికి మతోన్మాద ఎజెండా లేదు. ఎన్నికలతో సంబంధం లేకుండా, ఊగిసలాటలు లేకుండా, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇపుడు అట్టడుగు స్థాయిలో లభిస్తున్న స్థిరమైన మద్దతుతో నాటి కాంగ్రెస్(ఐ) కి లభించిన మద్దతును పోల్చలేం. ప్రధానమైన వ్యత్యాసం ఏమిటంటే 1970 వ దశాబ్దం డిజిటల్ దశకు ముందుకాలం. ఆఫ్‌లైన్ దశ. డిజిటల్ యుగం ఉత్పత్తి అయిన మోడి ప్రభుత్వానికి అనేక లాభాలు ఉన్నాయి. పైకి కనిపిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియాపై గుత్తాధిపత్యం, ఎటువంటి తప్పుడు పనులనైనా చేయటానికి సందేహించని శక్తివంతమైన ఐటి విభాగం, రహస్య కార్యకలాపాల నిర్వహణ, ఏ మాత్రం సందేహించకుండా అత్యంత తీవ్రస్థాయిలో నిఘా వ్యవస్థలను వినియోగించటం, వ్యక్తులు, సంస్థల చేత వారికి ఇష్టం లేని పనులను కూడా బలవంతంగా చేయించగల శక్తి డిజిటలైజ్ అయిన మోడి ఆధిపత్యంలోని రాజ్యానికి ఉన్నది.

మనం అధిగమించలేనన్ని ఆటంకాలు ఉన్నట్లు కనబడుతున్నప్పటికీ, " కాదు" అని ఓటు వేయటానికి అవసరమైనన్ని సాక్ష్యాధారాలను కూడా మోడి ప్రభుత్వం అందిస్తున్నదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ సాక్ష్యాలకు సంబంధించి తప్పుదారి పట్టించే అంశం ఏమిటంటే, దానిలో ఎక్కువ భాగం గతంలో జరిగిన చరిత్ర అని, అది మోడి ప్రభుత్వానికి మాత్రమే ప్రత్యేకమైనది కాదని చెబుతున్నారు. కాని వీటిని విస్తరింపజేయటం, తీవ్రం చేయటం, పరిమాణాత్మకమైన వ్యత్యాసాలను గుణాత్మకమైన వాటిగా చూయించటంలో తనకు ముందున్న ప్రభుత్వాల కన్నా మోడి ప్రభుత్వం ఎంతో ముందుకుపోయింది.

ప్రభుత్వ వ్యవస్థలను ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేయటం " కాదు" అని ఓటు వేయటాన్ని న్యాయమైనదిగా చూయించ

టంలో ప్రధానమైన అంశంగా ఉంటుంది. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి తన సహచరులందరి కన్నా చాలా ముందున్నాడు. ఏ ప్రజాస్వామ్యంలో నైనా అత్యంత ప్రధాన సంస్థ అయిన పార్లమెంటు విషయం తీసుకోండి. మోడిని రెండవసారి ప్రధానిగా ఎన్నుకున్న 17వ పార్లమెంటు అనేకరంగాలలో అత్యంత దిగువస్థాయి పనితీరును కనబర్చింది. విధానాలు, న్యాయపరమైన అంశాలపై రీసెర్చి చేస్తున్న అంకిత్ దినకర్ ఈ విధంగా పేర్కొన్నాడు. " మొదటి అంశం పార్లమెంటుకు

**" ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరగటం, అసమ్మతిని వ్యక్తం చేయటం తదితరాలను (సజీవమైన ప్రజాస్వామ్యానికి ఇది జీవనాడి వంటిది) చాలాకాలం నుండి క్రమంగా కుదిస్తున్నారు. చర్చకు అవకాశం లేకుండా చేయటం ఎక్కువ కావటంతో, ఇటువంటివి సాధారణమనే వాతావరణం నెలకొంటున్నది. "**




ప్రమాదంలో పడ్డ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే నేడు భారత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ప్రధాన కర్తవ్యం

డిప్యూటి స్పీకర్‌ను ఎన్నుకోలేదు. చట్టసభల సమావేశాలు అత్యంత తక్కువ జరిగాయి. 70 శాతం మంది ప్రతిపక్ష ఎం పి లను సభ నుండి సస్పెండ్ చేసి, అత్యంత ముఖ్యమైన నేర సంస్కరణల చట్టం బిల్లును ఆమోదించారు. ప్రధానమంత్రి ఏ ప్రశ్నకూ మాటల ద్వారా సమాధానం ఇవ్వరు. రాతపూర్వకంగా మాత్రమే సమాధానం ఇస్తారు". 17వ లోకసభలో అర్థగంట చర్చ ఒకటి, స్వల్పకాల చర్చలు 13, కాలింగ్ అటెన్షన్ మోషన్‌పై ఒకసారి మాత్రమే చర్చలు జరిగాయి. వాయిదా తీర్మానాలపై అసలు చర్చలే జరగలేదు. 1990 కి ముందుకాలంలో వీటిసంఖ్య 11, 39, 40, 3 గా ఉన్నాయి. రాహుల్ గాంధి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేయటం ( తర్వాత పునరుద్ధరించారు), మహువా మొయిత్రాను పార్లమెంటు నుండి బహిష్కరించటంతో పాటు ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు.

### మైనారిటీని అణచివేసే గుర్తుగా బుల్డోజర్

పార్లమెంటుతో ప్రారంభించి ప్రభుత్వ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, బలహీనం చేసి, వక్రీకరించి తమ పాక్షిక ప్రయోజనాలను నెరవేర్చే విధంగా వాటిని దిగజారుస్తున్నారు. అవి న్యాయస్థానాలైనా, కార్యనిర్వాహక వర్గం అయినా, చట్టబద్ధంగా పనిచేయాల్సిన ( ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సి, సిబిఐ ) సంస్థలు, ఆర్థిక, సామాజిక సమాచారాన్ని సేకరించే సంస్థలు, ఎన్నికల కమిషన్, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తదితరాల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నది.

ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరగటం, అసమ్మతిని వ్యక్తం చేయటం తదితరాలను (సజీవమైన ప్రజాస్వామ్యానికి ఇది జీవనాడి వంటిది) చాలాకాలం నుండి క్రమంగా కుదిస్తున్నారు. చర్చకు అవకాశం లేకుండా చేయటం ఎక్కువ కావటంతో, ఇటువంటివి సాధారణమనే వాతావరణం నెలకొంటున్నది. మీడియా సంస్థలను కొనివేయటం, యజమానులను బెదిరించటం, బలవంతంగా ఒప్పించటం తదితరాలను క్రమబద్ధంగా చేయటం ద్వారా ప్రభుత్వం మీడియాను తన ఉక్కు పిడికిలిలో బిగించింది. పాలక కూటమిలో భాగంగా ఉండటం కోసం మీడియాలో ఉన్నవారు తొందరపడుతున్నారు. ప్రభుత్వ ప్రత్యక్ష

> **“ భారతదేశ సమాఖ్య విధానానికి మరొక ప్రమాదం ఎదురౌతున్నది. సాంప్రదాయకంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నది. గతం నుండి కొనసాగిస్తున్న విధానాలను పక్కన పెట్టటం ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. బిజెపి యేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు, ఆ ప్రభుత్వాలతో ఘర్షణ పడే గవర్నర్‌లను నియమిస్తున్నారు. ”**

ఆధిపత్యానికి వెలుపల ఉన్న ప్రైవేటు సంస్థలతో పాటు విశ్వ విద్యాలయాలు, విద్యార్థి గ్రూపులు, పౌర సమాజ సంస్థలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

భారతదేశ సమాఖ్య విధానానికి మరొక ప్రమాదం ఎదురౌతున్నది. సాంప్రదాయకంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నది. గతం నుండి కొనసాగిస్తున్న విధానాలను పక్కన పెట్టటం ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. బిజెపి యేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు, ఆ ప్రభుత్వాలతో ఘర్షణ పడే గవర్నర్‌లను నియమిస్తున్నారు. విధానాలు, పాలనకు సంబంధించిన రోజువారి అంశాలలో కూడా ఆ ప్రభుత్వాలు నిరంతరం ఘర్షణలను ఎదుర్కొంటున్నాయి.

చివరి అంశం అయిప్పటికీ ముఖ్యమైన అంశం ఏమిటంటే పథకం ప్రకారం మతాల మధ్య సంబంధాలను విషపూరితం చేస్తున్నారు. ప్రత్యేకంగా ముస్లింలను దుర్మార్గులుగా చిత్రిస్తూ, నిరంతరం దాడులు చేస్తూ, మెజారిటీగా ఉన్న హిందువుల ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి ప్రయత్నం చేస్తున్నారు. జాతీయ పౌరసత్వ రిజిష్టర్ అమలు, సవరించిన పౌరసత్వ చట్టానికి నిబంధనలు రూపొందించటంతో 15 శాతం మంది భారతపౌరులు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవటానికి నిరంతరం పోరాడాల్సివుంటుంది. అధికారంలో ఉన్నవారి ప్రత్యక్ష, పరోక్ష ప్రోత్సాహంతో ఉత్తరాదిలో పూర్తిగా, దక్షిణాదిలో కొన్ని ప్రాంతాలలో వ్యక్తులను కొట్టిచంపే సంస్కృతి రూపు దిద్దుకుంటున్నది. తమకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇతరులను అణచివేతకు గురిచేయగలమన్న మెజారిటీవాదులకు బుల్డోజర్ విజయచిహ్నంగా మారింది.

దిగజారుడుకు సంబంధించిన ఇటువంటి మార్పులన్నీ మోడిని విశ్వసించేవారు కేంద్రంగా జరుగుతున్నాయి. అన్ని కరెన్సీ నోట్లపై మహాత్మాగాంధి బొమ్మను ముద్రిస్తున్నప్పటికీ ఆయన కూడా మోడి అంత సంపూర్ణ అధికారం చెలాయించలేదు. భౌతికంగా, డిజిటల్‌గా ఉన్న స్థలాలన్నీ మోడి బొమ్మలతో నిండిపోతు న్నాయి. నావద్ద ఉన్న కోవిడ్-19 వ్యాక్సిన్ సర్టిఫికెట్‌పై మోడి బొమ్మలేదన్న కారణంగా ఆ సర్టిఫికెట్ నకిలీదని పారిస్ విమానాశ్ర యంలో వలసలను పరిశీలించే అధికారి నాతో వాదించాడు. నేను ఆ దేశాన్ని వదిలివస్తున్నాను కాబట్టి చివరకు ఆ అభ్యంతరాన్ని వదులుకున్నాడు. నరేంద్రమోడి, బిజెపికి సంబంధించి వ్యక్తికి-ఆయన ఎన్నికైన పదవికి, ప్రభుత్వ కార్యాలయానికి-ఒక రాజకీయ పార్టీ కార్యాలయానికి మధ్య ఉండాల్సిన వ్యత్యాసం అంతర్ధానమైపోయింది. ప్రభుత్వంతో సన్నిహితంగా ఉంటున్న పారిశ్రామిక సంస్థలకు సంబంధించిన అనేక ఉదాహరణలను చూసి నపుడు రాజ్యం ప్రైవేటు ఆస్తిగా మారినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి తర్వాత అటల్ బిహారి వాజ్‌పేయి ఇందిరాగాంధిని దుర్గాదేవిగా పొగిడినప్పటి కన్నా, “ఇందిరే ఇండియా, ఇండియాయే ఇందిర” అని 1974లో దేవకాంత బారువా అన్ననాటి కన్నా, అర్ధ శతాబ్దం క్రితం నాటి కన్నా ఈనాడు ప్రధానమంత్రి చేతిలో అనేక రెట్లు ఎక్కువగా అధికారం కేంద్రీకృతమై ఉంది.

### “కాదు” అని ప్రచారం చేయాలి

“కాదు” అని ఓటు వేయాలని చేసే ప్రచారంలో ఈ అంశాలన్నింటినీ భాగం చేయాలి. ఈ విధమైన

పరిణామాలు ఇంకా ఎక్కువ జరగాలా అని ప్రశ్నించాలి. ఈ ప్రశ్నకు “వద్దు” అని చెప్పే వారికి, ఆ నియోజకవర్గంలో బిజెపి మినహా గెలవటానికి తగిన అవకాశాలు ఉన్న ఏ పార్టీకైనా ఓటు వేయమని చెప్పాలి. కర్ణాటకలో 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల ప్రచారంలో పౌర సమాజ గ్రూపులు ఇదే వ్యూహాన్ని అనుసరించాయి. ఈ ఎన్నికలలో ఓటర్లు రికార్డు సంఖ్యలో ఓటు వేశారు(73.8 శాతం). 224 స్థానాలున్న శాసనసభలో కాంగ్రెస్ 42.9 శాతం ఓట్లతో 135 స్థానాలను గెలుచుకుంది. బిజెపికి 36 శాతం ఓట్లు, 66 స్థానాలు వచ్చాయి.

ఉద్దేశపూర్వకంగానే రెండు అంశాలు చర్చలోకి రాకుండా జాగ్రత్త పడుతున్నారు. మొదటిది, వాగ్దానాలను నెరవేర్చటం, ప్రజలకు అవసరమైన సేవలు అందించటంలో మొత్తంగా మోడి ప్రభుత్వ పనితీరు. రెండవది, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే లేదా మద్దతు తెలిపే సామాజిక గ్రూపులున్న నియోజకవర్గాలు.

సాధారణంగా చర్చకు వస్తున్న ఇటువంటి గ్రూపులకు సంబంధించిన అంశాలు విశాలంగా “రైతులు”, ‘దిగువ కులాలు’’, చేసిన భారీ వాగ్దానాలు, అందుకనుగుణంగా ఉద్యోగాలు కల్పించటంలో ప్రభుత్వం విఫలం కావటం ఉంటున్నాయి. ఇవి నిస్సందేహంగా ముఖ్యమైన అంశాలే. ఒక పార్టీని మాత్రమే అంచనా వేసే సందర్భమైన రిఫరెండంకు ఇవి కీలకమైన అంశాలు కావు. స్థానికమైన, ఒక ప్రత్యేకమైన సందర్భానికి తగినవిగా ఉన్నాయి. ఇందుకు భిన్నంగా ప్రభుత్వ పనితీరును గురించి ఓటర్ల అభిప్రాయాలు ఎలా ఉన్నప్పటికీ, పైన చెప్పిన విషయాలు ప్రాధాన్యతను కలిగివున్నాయి. “కాదు” అని ఓటు వేయటానికి ప్రభుత్వ అసమర్ధత కారణం కాదు. మన రాజకీయ వ్యవస్థలోని ప్రజాస్వామిక నిర్మాణాలను ధ్వంసం చేస్తుండటం “కాదు” అని ఓటు వేయటానికి కారణం. ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చకపోతే “కాదు” అని ఓటు వేయటానికి మద్దతు పెరగవచ్చు. కాని అది ప్రధానాంశం కాదు.

ముగించబోయే ముందు ఒక ముఖ్యమైన, ఆలోచనలను రేకెత్తించే అంశాన్ని గుర్తు చేస్తున్నాను. ఈ ప్రభుత్వం చేస్తున్న వాటిని బలపరిచేవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారన్న విషయాన్ని-మీడియా వాటిని మనకు రోజూ గుర్తు చేస్తున్న పరిస్థితులలో- మనం మరిచిపోరాదు. నిరంకుశమైన ప్రభుత్వం కావాలని కోరుతున్న భారతీయులు 2017లో 55 శాతం ఉండగా, 2023 నాటికి 67 శాతానికి పెరిగారని ప్యూ గ్లోబల్ యాటిట్యూడ్స్ సర్వే వెల్లడించింది. పైన పేర్కొన్న రెండు సంవత్సరాలలో 24

దేశాలలో సర్వే చేయగా, నిరంకుశ ప్రభుత్వాన్ని సమర్ధించేవారు భారతదేశంలోనే ఎక్కువ మంది ఉన్నట్లు రెండు సర్వేలూ వెల్లడించాయి!

మరోవైపున 2019 ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించినప్పటికీ, దానికి 37.7 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 62 శాతం మంది ఓటర్లు ఆ పార్టీకి ఓటు వేయలేదు. మోడి ప్రభుత్వం, హిందుత్వవాదులకు ఉన్న ప్రజాదరణను తక్కువ అంచనా వేయకుండానే, ఒక నియోజకవర్గంలో పోటి చేసిన అభ్యర్థులలో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందే విధంగా ఉన్న మన ఎన్నికల విధానం ఒక పార్టీకి పోలైన ఓట్లలో కొద్దిపాటి పెరుగుదల ఉన్నా, సీట్లు భారీగా రావటానికి– గెలిచిన వారికి భారి మెజారిటి రావటానికి– దోహదం చేస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఓట్లు, సీట్లకు ఉండే నిష్పత్తి రెండు విధాలుగానూ పనిచేస్తున్నది. ఓటర్ల ప్రాధాన్యతలో వచ్చిన చిన్నమార్పులు కూడా భారి విజయాలకు కారణమౌతున్నాయి.

**"2019 ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించినప్పటికీ, దానికి 37.7 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 62 శాతం మంది ఓటర్లు ఆ పార్టీకి ఓటు వేయలేదు. మోడి ప్రభుత్వం, హిందుత్వ వాదులకు ఉన్న ప్రజాదరణను తక్కువ అంచనా వేయకుండానే మన ఎన్నికల విధానంలో ఒక పార్టీకి పోలైన ఓట్లలో కొద్దిపాటి పెరుగుదల ఉన్నా, సీట్లు భారీగా రావటానికి- గెలిచిన వారికి భారి మెజారిటి రావటానికి- దోహదం చేస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి."**

**1977 ఎన్నికలలో చారిత్రక విజయం**

అర్థ శతాబ్దానికి ముందు 1977 ఎన్నికలలో సాధించిన చారిత్రాత్మకమైన విజయం ఉత్తేజకరమైనది. అపుడు నేను ఢిల్లీ యూనివర్సిటిలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రి చివరి సంవత్సరంలో ఉన్నాను. మార్చిలో పరీక్షలు రాయాలి. జనవరి చివరిలో అత్యవసర పరిస్థితి( నేను రెండవ సంవత్సరంలోకి రావటానికి కొంచెం ముందు విధించారు) ని సడలించారు. మేం 25–30 మందిమి ఇందిరా గాంధి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, జనతా పార్టి గెలుపు కోసం ప్రచారం చేయటానికి వెళ్ళాం. అప్పటికి అత్యవసర పరిస్థితిని రద్దు చేయలేదు. అది సృష్టించిన భయం, ఆందోళన ఇంకా కొనసాగుతున్నాయి. మా భవిష్యత్‌కు ఇబ్బంది రాకుండా, రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రచారంలో పాల్గొనే విధంగా మా అధ్యాపకులు మంచి సలహాలు ఇచ్చారు. కాని మేం ఎక్కువ కృషి చేయటానికి అవసరమైన శక్తిని అత్యవసర పరిస్థితి మాకు ఇచ్చింది. కొందరు కాలేజిలోని మిత్రులతో కలిపి, భారతీయ జనసంఘ్ అభ్యర్థి అటల్ బిహారి వాజ్‌పాయి పోటి చేస్తున్న న్యూ ఢిల్లీ నియోజకవర్గానికి నన్ను పంపారు. నా రాజకీయాభిప్రాయాలు జనసంఘ్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. కాని ఎన్నికలు ప్రధానంగా అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా, రిఫరెండంగా జరుగుతున్నాయి కాబట్టి అవి నాకు ఆటంకం కాలేదు. ఆ సమయంలో మేం చెప్పినట్లు అక్కడ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా లైటు స్తంభం ఉన్నా దానికే ప్రచారం చేసేవారం.

సెంట్రల్ ఢిల్లీలోని ప్రభుత్వ హౌసింగ్ కాలనీలలో ప్రచారం చేస్తుంటే చాలామంది తలుపులు కూడా తీయలేదు. అయినప్పటికీ ఉత్సాహంతో ప్రచారం చేశాం. పరిస్థితులలో ఏమైనా మార్పు తీసుకురాగలమా అని మేం సందేహంతో ఉన్నాం. విజయంపై ఎటువంటి ఆశ లేనప్పటికీ, అనేక మంది సాధారణ ప్రజలు కష్టనష్టాలకు ఓర్చి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కథలో ఉన్న నీతి ఏమిటంటే మనం నిలబడితే లెక్కలోకి వస్తాం. అందువలన ఎన్నికల ఫలితాలను వెల్లడించే మార్చి 22–23 రాత్రి నా జ్ఞాపకాలలో నిలిచిపోయింది. రాత్రి 10 గంటలకు మేం చిన్నగ్రూపుగా ఢిల్లీ యూనివర్సిటి క్యాంపస్ నుండి వార్తా పత్రికల( ది హిందు, టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది పేట్రియాట్) కార్యాలయాలున్న బహదూర్ షా జాఫర్ మార్గ్ వైపుకు వెళ్ళాం.

అక్కడ ఒకటి రెండు ట్రాన్సిస్టర్ రేడియోలు ఉన్నాయి. –మొబైల్ ఫోన్‌లు, ఇంటర్నెట్ రాకముందు– హడావిడిగా ఏర్పడిన జనతా పార్టి నమ్మలేనట్లుగా సాధించిన విజయాలు ఒకదాని తర్వాత ఒకటి రేడియోలో ప్రసారమౌతున్నాయి. మేం కాశ్మీరీ గేట్, దర్యాగంజ్‌కు మధ్యలో ఉండగా అమేథిలో సంజయ్ గాంధి ఓడిపోయాడనే వార్త విన్నాం. మరికొద్ది సేపటికి రాయ్‌బరేలిలో ఇందిరాగాంధి కూడా ఓడిపోయిందనే వార్త వచ్చింది. బిల్‌బోర్డులపై ఈ వార్తలను చూయిస్తున్న వార్తా పత్రికల కార్యాలయాల ముందు పెద్దసంఖ్యలో ప్రజలు గుమికూడారు. ఆ గుంపులో కలిసి మేం కూడా చరిత్రలో భాగమైనామని భావించాం.

ప్రతిపక్షాలలో ఐక్యత లేకపోవటం, జనతాపార్టిలోని వివిధ భాగస్వాముల మధ్య ఉన్న తీవ్రమైన సైద్ధాంతిక విభేధాలను గురించి ఆందోళన వ్యక్తం కావటం నాకు గుర్తుంది. ఇందిరాగాంధి అంతటి ఆకర్షణ శక్తిగల నాయకులు లేకపోవటం, కాంగ్రెస్, జనతాపార్టిల మధ్య వనరులలో ఉన్న వ్యత్యాసంపై మేం ఆందోళన పడ్డాం. వార్తా పత్రికలపై పూర్తి ఆధిక్యతతో పాటు రేడియో, టి వి లను కాంగ్రెస్ పార్టి పూర్తిగా అదుపు చేస్తున్నది. వీటన్నిటితో పాటు అత్యవసర పరిస్థితిని తిరిగి విధిస్తారనే భయం కూడా ఉన్నది. కాని వీటన్నింటినీ అధిగమించి ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చాయో చూశాం.

భారతదేశ రాజకీయాలు ప్రపంచంలోని ధోరణులను వ్యక్తం చేస్తాయన్నది వాస్తవం. ప్రపంచవ్యాపితంగా ప్రజాస్వామ్యంపై అసంతృప్తి పెరుగుతున్నది. బలమైన నాయకులు కావాలనే ఆకాంక్ష వ్యక్తమౌతున్నది. పాలకపార్టి ముందుకు తెస్తున్న తప్పుడు భావాలు మన సమాజంలోకి లోతుగా చొచ్చుకుపో తున్నాయి. అనేక విధాలైన ఆటంకాలు ఉన్నప్పటికీ గతంలో ఉన్న పరిస్థితులు మారాయన్నది వాస్తవం. భవిష్యత్‌లో కూడా మార్పులు జరుగుతాయన్నది కూడా అంతే వాస్తవం. పాలకపార్టి, దాని ప్రత్యర్థులకు మధ్య ఉన్న విభేధాలను గురించి మనం ఆందోళన పడాల్సిన అవసరం లేదు. రానున్న ఎన్నికలను ఒక రిఫరెండం లాగా పరిగణించాలి.

మోడి ప్రభుత్వం మన ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయటం అన్న ఒక్క గ్యారంటినే మనకు ఇస్తున్నది. కేవలం ఒక మాట కన్నా ప్రజాస్వామ్యం విలువైనదని భావిస్తే, అపుడు మీరు "కాదు" అని ఓటు వేయండి. 2024 సంవత్సరం భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించేదిగా ఉండాలని మీరు భావిస్తున్నారు కాబట్టి ఈ ప్రచారం చేయాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# ఇజ్రాయిల్ దాష్టీకంపై అమెరికాలో విద్యార్థుల నిరసన వెల్లువ



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు

ఎస్. వెంకట్రావు

గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఊచకోతలు, దానికి అమెరికా నిస్సిగ్గుగా ఇస్తున్న మద్దతుకు నిరసనగా అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం అనతి కాలంలోనే అమెరికా అంతటికీ విస్తరించి, పొరుగు దేశాలకు కూడా పాకింది. అమెరికాలోని ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులే కాకుండా ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది కూడా విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా రంగంలోకి దిగారు. దాంతో అమెరికా ప్రభుత్వం, విశ్వ విద్యాలయ అధికారులు తీవ్రమైన నిర్బంధానికి దిగారు. పోలీసులు వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారు. విశ్వ విద్యాలయాల్లో విద్యార్థి శిబిరాలను బలవంతంగా ఎత్తివేయడానికి ప్రయత్నించారు. నిరసనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థును తమ తమ దేశాలకు పంపించేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిర్బంధాలను, పోలీసుల అరెస్టులను ఎదిరించి నిరసనోద్యమంలో పాల్గొంటున్నారు. మొదట ఈ ఉద్యమాన్ని ఆషామాషీగా తీసుకున్న పాలక వర్గాలు దాని తీవ్రతనూ, లోతునూ అర్థం చేసుకున్న తరువాత దానిపై నిర్బంధం ప్రయోగించడమే కాకుండా ఉద్యమానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం ప్రారంభించారు.

### ఎందుకీ ఉద్యమం?

గాజా ప్రాంతంపై దాడుల చేస్తూ అమాయక పాలస్తీనా ప్రజల ప్రాణాలు తీసిన ఇజ్రాయిల్ ఘాతుకాన్ని ఖండిస్తూ అమెరికా, ఐరోపాలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికి కొనసాగింపుగా అమెరికాలోని విద్యాలయాల్లో విద్యార్థి ఉద్యమం ప్రారంభమై ఉద్ధృతినందుకుంటున్నది. గత ఏడాది అక్టోబర్ 17న హమాస్ దాడికి ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఏకపక్ష యుద్ధంలో ఇప్పటికే అధికారిక లెక్కల ప్రకారం 34,000 మంది పాలస్తీనా చిన్నారులు, స్త్రీలు, పురుషులు మరణించారు. అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంది. క్షతగాత్రులైన వారి సంఖ్య లక్షల్లోనే ఉంది. గాజాలోనూ, పశ్చిమ తీరంలోని పలు ప్రాంతాల్లోనూ పాలస్తీనియన్ల ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సదుపాయాలు పూర్తిగా నేలమట్టమైపోయాయి. ఈ ఘాతుకాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికా ప్రభుత్వం, దాని యూరోపియన్ మిత్ర దేశాలు పూర్తి మద్దతిస్తున్నాయి. నిజానికి గాజాలో అమెరికా అందిస్తున్న ఆయుధాలతోనే ఇజ్రాయిల్ సైనికులు పాలస్తీనియన్ల ప్రాణాలు తీస్తున్నారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా ఐక్య రాజ్య సమితిలో ఓటింగు జరిగేటప్పుడు, ఇతరత్రా కూడా అమెరికా మద్దతిస్తున్నది గనుకనే ఇజ్రాయిల్ ఈ దురాఘంతాలను నిరాఘాటంగా చేయగలుగుతున్నది.

ఇజ్రాయిల్ దురాఘతాలకూ, దానికి అమెరికా, ఐరోపా దేశాల మద్దతుకూ నిరసనగా అమెరికాలోనూ, ఐరోపాలోని అనేక నగరాల్లోనూ ఇటీవలి కాలంలో భారీ ప్రజా ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు జరిగాయి. అయినప్పటికీ ఇజ్రాయిల్ పైశాచిక దాడులు ఆగకపోవడంతో విద్యార్థులు రంగంలోకి వచ్చారు. ఏప్రిల్ 17న న్యూయార్క్ లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్శిటీ విద్యార్థులు తొలుత నిరసన ప్రదర్శనలకు దిగారు. నిరసన ప్రదర్శనలు జరపడంతోపాటు యూనివర్శిటీ కాంపస్‌లో గుడారాలు వేసుకుని రాత్రిపగలు క్యాంపులు నిర్వహించారు. రోజులు గడిచే కొద్దీ క్రమంగా నిరసన కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రొఫెసర్లతో సహా యూనివర్శిటీ ఫాకల్టీ కూడా నిరసర కార్యక్రమంలో చేరింది. కొద్ది రోజుల్లో కొలంబియా యూనివర్శిటీలో పుట్టిన అగ్గి అమెరికా అంతటా దావానలంలా వ్యాపించింది. దాంతో కొలంబియా విశ్వ విద్యాలయ ప్రెసిడెంట్ మినైచె షఫిక్ న్యూయార్క్ పోలీసులను క్యాంపస్‌లోకి పిలిపించి శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దాడి చేయించారు. ఆమె చర్యకు నిరసనగా యూనివర్శిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున క్లాసులు బాయ్‌కాట్ చేసి రోడ్లమీదకు వచ్చారు. ఫాకల్టీ మొత్తం విద్యార్థులకు సంఘీభావంగా, ఇజ్రాయిల్ దురాగతాలకు నిరసనగా ఉద్యమంలోకి దిగింది.

పోలీసులు కొలంబియా విద్యార్థులపై పెద్ద ఎత్తున దాడి చేశారు. వందల మందిని అరెస్టు చేశారు. కొందరు ప్రొఫెసర్లను కూడా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఏప్రిల్ 29 సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకల్లా క్యాంపస్‌లోని 120కి పైగా గుడారాలను ఎత్తివేసి ఆందోళన విరమించకపోతే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని యూనివర్శిటీ ప్రెసిడెంట్ షఫీక్ హెచ్చరించారు. అంతేకాదు 2025 జూన్ వరకు ఇటువంటి ఆందోళనల్లో పాల్గొనబోమని చెబుతూ విద్యార్థులు ఒక హామీ పత్రం మీద సంతకాలు చేయాలని కూడా ఆమె షరతు పెట్టారు. ఈ షరతులు ఆమోదించకపోతే విద్యార్థులను యూనివర్శిటీ నుండి సస్పెండ్ చేస్తామని ఆమె కర్కశత్వాన్ని ప్రదర్శించారు. అయితే విద్యార్థులుగానీ, ఫాకల్టీగానీ ఈ బెదిరింపులకు లొంగకపోగా ఆందోళన మరింత ఉద్ధృతం చేశారు. "కొలంబియా యూనివర్శిటీ అధికారులు యూనివర్శిటిలో అక్రమంగా 'ఎమర్జెన్సీ' విధించారు. విద్యార్థులను సామూహికంగా సస్పెండ్ చేయడం, బహిష్కరించడం వంటి చర్యలకు పూనుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి శాంతియుతంగా

ఆందోళన చేస్తున్న వందలాది మందిని బలవంతంగా ఖాళీచేయించారు'' అని 'కొలంబియా స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తైన్' సంస్థ ప్రతినిధి ఎక్స్‌లో వెల్లడించారు. యూనివర్సిటీ అధికారులు ఇటువంటి నిరంకుశత్వానికి పాల్పడితే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అన్నట్లు గానే మరునాడు ఉదయం వందలాది మంది విద్యార్థులు యూనివర్శిటీకి చెందిన హమిల్టన్ హాలును ఆక్రమించుకుని దాని పేరును 'హింద్ హాల్'గా మార్చారు. గాజాలో ఇజ్రాల్ బాంబు దాడుల్లో చనిపోయిన వారిలో హింద్ రజాబ్ అనే ఆరేళ్ల పాప పేరేను ఆ హాల్‌కు పెట్టారు. నిరసన కారుల డిమాండ్లు నెరవేర్చే వరకు హాల్‌ని ఆక్రమించుకుంటామని విద్యార్థులు 'ఎక్స్'లో తెలిపారు. యూనివర్శిటీ క్యాంపస్‌లోకి గనుక సాయుధ సైన్యాన్ని, లేక పోలీసులను పంపిస్తే 'విద్యార్థుల రక్తం మీ చేతులకు అంటుకుంటుంది' అని వారు హెచ్చరించారు.

> "కొలంబియా విద్యార్థుల పట్టుదలను చూసి, వారి ఆందోళన మరింత ఉద్ధృతమవుతుందని భయపడిని యూనివర్శిటీ యాజమాన్యం ఈ సెమిస్టర్ పూర్తయ్యే వరకు ప్రత్యక్ష తరగతలును నిర్వహించడం లేదనీ దానికి బదులుగా ఆన్‌లైన్ క్లాసులు జరుగుతాయనీ ఏప్రిల్ 29న ప్రకటించింది."



కొలంబియా యూనివర్శిటీ ప్రాంగణంలో గుడారాలు వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

### విద్యార్థుల డిమాండ్లు ఏమిటి?

ఇజ్రాయిల్‌తోనూ, గాజాపై అది చేస్తున్న యుద్ధంతోనూ సంబంధం ఉన్న అమెరికన్ కంపెనీల్లో షేర్లనూ, ఎండోమెంట్ నిధులనూ కొలంబియా యూనివర్శిటీ ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దాంతోబాటు ఇజ్రాయిల్ విశ్వవిద్యాలయాలతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని కూడా వారు కోరుతున్నారు. పాలస్తీనియన్లకు అనుకూలంగా మాట్లాడే విద్యార్థులు, ఫాకల్టీపై వేధింపులనూ, సెన్సార్‌షిప్‌నూ విడనాడాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

కొలంబియా విశ్వ విద్యాలయం ఇజ్రాయిల్‌తోనూ, గాజాలో అది చేస్తున్న యుద్ధంతోనూ సంబంధాలు గల కంపెనీల్లో ఎంత పెట్టుబడి పెట్టిందో వెల్లడించాలని, ఆ పెట్టుబడులను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి ఇజ్రాయిల్ యుద్ధంతో సంబంధాలు కలిగి ఉన్న కంపెనీలను బాయ్‌కాట్ చేయాలని అంతర్జాతీయంగా ఒక ఉద్యమం నడుస్తోంది. ఇప్పుడు అమెరికాలో విద్యార్థులు ఈ ఉద్యమాన్ని తమతమ యూనివర్శిటీ ప్రాంగణాల్లోకి తీసుకువచ్చారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధం ద్వారా లాభం పొందుతున్న అమెరికా కంపెనీల జాబితాను విద్యార్థులు ప్రచురించిన ఒక కరపత్రంలో పేర్కొన్నారు. లాక్‌హీడ్ మార్టిన్, హీకో, బ్లాక్ రాక్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బడా కార్పొరేట్ కంపెనీలు పాలస్తీనియన్ల రక్తం నుండి లాభాలు పొందుతున్నారని విద్యార్థు విమర్శిస్తున్నట్లు కొలంబియా యూనివర్శిటీ జర్నలిజం విద్యార్థి కరోలిన్ అన్నే బిస్సోనెట్టె చెప్పారు.

కొలంబియా యూనివర్శిటీ విద్యార్థులపై పోలీసుల దాడినీ, భారీ అరెస్టులనూ ఖండిస్తూ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు క్లాసులు బహిష్కరించి విద్యార్థుల క్యాంపు వద్దకు చేరుకున్నారు. "మా విద్యార్థుల జోలికి రావద్దు" అంటూ ప్లకార్డులు పట్టుకుని వారు విద్యార్థి ఆందోళనకు మద్దతు తెలిపారు.

కొలంబియా విద్యార్థుల పట్టుదలను చూసి, వారి ఆందోళన మరింత ఉద్ధృతమవుతుందని భయపడిని యూనివర్శిటీ యాజమాన్యం ఈ సెమిస్టర్ పూర్తయ్యేవరకు ప్రత్యక్ష తరగతలును నిర్వహించడం లేదనీ దానికి బదులుగా ఆన్‌లైన్ క్లాసులు జరుగుతాయనీ ఏప్రిల్ 29న ప్రకటించింది.

### అమెరికా అంతటికీ పాకిన ఆందోళనలు

ఏప్రిల్ 17న కొలంబియా యూనివర్శిటీలో ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన అనతి కాలంలోనే అమెరికాలోని పలు రాష్ట్రాలకూ, అనేక ఉన్నత విద్యాలయాలకూ పాకింది. 19వ తేదీన కనెక్టికట్‌లోని న్యూ హావెన్‌లోని యాలె యూనివర్శిటీ విద్యార్థులు గుడారాలు వేసుకుని ఇజ్రాయిల్ దురాగతాలకూ, దానికి అమెరికా ఇస్తున్న మద్దతుకూ నిరసనగా ఆందోళనకు దిగారు. యూనివర్శిటీ క్యాంపస్‌లోని బీనెకె ప్లాజాలో 24 టెంట్లు వేసి నిరనకు కూర్చున్నారు. ఇజ్రాయిల్ రక్షణ దళాలకు ఆయుధాలు, ఇతర రక్షణ పరికరాలు సరఫరా చేసే సంస్థల్లో యాలె యూనివర్శిటీ పెట్టిన పెట్టుబడులను వెల్లడించాలనీ, వెంటనే వాటన్నిటినీ ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు.

22వ తేదీ ఉదయానికి న్యూయార్క్ యూనివర్శిటీలోనూ, గ్రేటర్ బోస్టన్ ఏరియాలోని యూనివర్శిటీల్లోనూ ఇటువంటి ఆందోళనలు ప్రారంభమైనాయి. ఈ ప్రాంతంలో ప్రతిష్ఠాత్మకమైన మెసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్), ఎమర్సన్ కాలేజి, టఫ్స్ యూనివర్శిటీల్లో కూడా విద్యార్థులు ఆందోళన బాటపట్టారు.

22న యూనివర్శిటీ ఆఫ్ మేరీలాండ్‌లో కూడా విద్యార్థులు గుడారాలు వేసి నిరసనలకు దిగారు. యూనివర్శిటీ ఆఫ్ మిచిగాన్‌లో వందల సంఖ్యలో విద్యార్థులు యూనివర్శిటీ

**"గాజాపై ఇజ్రాయిల్ దురాగతాలను నిరసిస్తూ అమెరికా యూనివర్శిల్లో ప్రారంభమైన విద్యార్థి ఆందోళనలు ఇతర దేశాలకు ముఖ్యంగా యూరప్‌కు కూడా పాకాయి. ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, జర్మనీల్లో విద్యార్థులు యూనివర్శిటీ క్యాంపస్‌లలో అమెరికా తరహాలోనే గుడారాలు వేసుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇటలీ, ఫ్రాన్స్‌లలో విద్యార్థులపై పోలీసులు నిర్బంధానికి దిగారు."**

క్యాంపస్ మధ్యలోని డియాడ్ అనే పెద్ద మైదానాన్ని ఆక్రమించుకుని గుడారాలు వేసి నిరసన దీక్ష చేపట్టారు. బెర్కెలే లోని యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా క్యాంపస్ మధ్యలోని స్ప్రౌల్ హాల్ మెట్లమీద విద్యార్థులు బైఠాయించారు. ఉత్తర కాలిఫోర్నియాలోని కాల్‌పోలీ హంబోల్ట్‌లో సీమన్ హాలును ఆక్రమించిన విద్యార్థులు తమను ఖాళీ చేయించడానికి వచ్చిన సాయుధులైన పోలీసులతో ప్రతిఘటనకు దిగారు. న్యూయార్క్ నగరంలోని న్యూ స్కూల్‌లో రోజంతా విద్యార్థులు బైఠాయించారు.

లాస్ ఏంజెల్స్ పోలీసులు యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా క్యాంపస్‌ను దిగ్బంధనం గావించారు. పత్రికల వారిని కూడా లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. 93 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. పిట్టిస్‌బర్గ్ యూనివర్శిటీలో విద్యార్థులు "బైడెన్, ట్రంప్, బుష్, ఒబామా...అందరూ యుద్ధాన్ని కొనసాగించేవారే" అనే ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో వందలాది మంది ప్రదర్శన జరిపారు. కొలంబస్‌లోని ఒహియో స్టేట్ యూనివర్శిటీ, ఇండియానాలోని ఒహియో, ఇండియానా యూనివర్శిటీ, డెట్రాయిట్‌లోని వేన్ యూనివర్శిటీ, యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్ అర్బానా-చాంపెయిన్, కొలరాడో లోని డెన్వర్‌లో గల ఆరారియా యూనివర్శిటీలలో కూడా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్టు చేశారు. జార్జియాలోని అట్లాంటాలో ఎమోరీ యూనివర్శిటీలో పోలీసుల పెద్ద ఎత్తున దాడిచేసి 108 మందినీ, లాస్ ఏంజెల్స్‌లోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాలో 93 మందినీ, టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో యూనివర్శిటీ ఆఫ్ ఆస్టిన్‌లో 57 మంది విద్యార్థులను అరెస్టు చేశారు.

### ఇతర దేశాల్లో కూడా

గాజాపై ఇజ్రాయిల్ దురాగతాలను నిరసిస్తూ అమెరికా యూనివర్శిల్లో ప్రారంభమైన విద్యార్థి ఆందోళనలు ఇతర దేశాలకు ముఖ్యంగా యూరప్‌కు కూడా పాకాయి. ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, జర్మనీల్లో విద్యార్థులు యూనివర్శిటీ క్యాంపస్‌లలో అమెరికా తరహాలోనే గుడారాలు వేసుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇటలీ, ఫ్రాన్స్‌లలో విద్యార్థులపై పోలీసులు నిర్బంధానికి దిగారు. ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత యూనివర్శిటీ ఆఫ్ మెల్‌బోర్న్, యూనివర్శిటీ ఆఫ్ సిడ్నీల్లో ఇజ్రాయిల్ దాష్టీకాన్ని నిరసిస్తూ, అమెరికాలో విద్యార్థులపై నిర్బంధాన్ని ఖండిస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

### విద్యార్థి ఉద్యమంపై దుష్ప్రచారం

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల సమయంలో జరుగుతున్న విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయడానికి అమెరికా ప్రభుత్వంలో ఉన్న డెమోక్రాట్లు, ప్రతి పక్షంలో ఉన్న కన్సర్వేటివ్‌లో ఒకే పట్టుదలతో ప్రయత్నిస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారు. పలు యూనివర్శిటీల్లో విద్యార్థులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు. ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తూ పెద్ద ఎత్తున సెన్సార్‌షిప్ విధిస్తున్నారు. వీటన్నిటితోపాటు అమెరికా పాలక వర్గాలు, కార్పొరేట్ మీడియా ఉద్యమంపై పెద్ద ఎత్తున దుష్ప్రచారానికి దిగింది. గాజాలో పాలస్తీనియన్లను ఊచకోత కోసి చంపుతున్న ఇజ్రాయిల్ దురాగతాలను ఖండించడాన్ని ''యూదు వ్యతిరేక'' ఉద్యమంగా చిత్రీకరించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. యూనివర్శిటీ క్యాంపస్‌లలో యూదు వ్యతిరేక నిరసనలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఒక ప్రకటనలో పేర్కొంటూ ఈ నిరసన కార్యక్రమాలను ఖండించారు. నిరసనలు అణచివేయడానికి తాను "ఒక కార్యక్రమం రూపొందించాను" అని ఆయన అన్నారు. అమెరికా కార్పొరేట్ మీడియా, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, వాటి నేతలు కూడా ఇదే నినాదాన్ని అందుకున్నారు. కానీ ఈ ఉద్యమం ఇజ్రాయిల్ దురాగతాలకూ, పాలస్తీనియన్లపై ఊచకోతకు వ్యతిరేకంగానే జరుగుతున్నది గానీ యూదు వ్యతిరేకత ఇందులో ఏమాత్రం లేదు. "మా సంస్థలో తెల్ల జాతీయులు, నల్లవారు, గోదమవర్ణం, లాటినోలు, స్త్రీలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్‌లు..అన్ని రకాల వ్యక్తులూ ఉన్నారు. అన్ని రకాల విద్వేషాలకు మేము వ్యతిరేకం. మేము ఎటువంటి రూపంలోనూ యూదు వ్యతిరేకతను సహించం. మా నిర్వహణ కమిటీలో 40 మంది యూదులున్నారు.'' అని పిట్టిన్ బర్గ్ యూనివర్శిటీ విద్యార్థి ఆందోళన నిర్వహణ కమిటీ నాయకుడొకరు చెప్పారు. పాలక పక్షాలు విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసే ఎత్తుగడల్లో భాగంగానే దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పలువురు మేధావులు పేర్కొన్నారు.

### వియత్నాం వ్యతిరేకం ఉద్యమాన్ని గుర్తుకు తెస్తోంది

ప్రస్తుతం అమెరికా క్యాంపస్‌లలో జరుగుతున్న విద్యార్థి ఉద్యమం 1968లో అమెరికాలోనూ, ఐరోపాలోని అనేక దేశాల్లోనూ జరిగిన వియత్నాం యుద్ధ వ్యతిరేక విద్యార్థి, యువజన ఉద్యమాన్ని గుర్తుకు తెస్తున్నదని అనేక మంది పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అనాడు వియత్నాంలో అమెరికా దళాలు కురిపించిన కార్పెట్ బాంబింగ్ వల్ల వేలాది మంది అమాయక వియత్నాం పసిపిల్లలు, ప్రజలు చనిపోయారు. కొన్ని సంవత్సరాల పాటు అమెరికా చేసిన దురాగతాలకు వియత్నాం సర్వ నాశనమైపోయింది. పట్టణాలు, గ్రామాలు నేలమట్టమైనాయి, అడవులు ధ్వంసమైనాయి, వ్యవసాయ భూములు పనికిరాకుండా పోయాయి. ఈ దురాగతాలపై అమెరికాలోనే ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారు. యూనివర్శిటీ క్యాంపస్‌లు నిరంతర నిరసన శిబిరాలుగా మారిపోయాయి. విద్యార్థి, యువజన నిరసనోద్యమంతోబాటు ప్రజల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో వియత్నాం నుండి అమెరికా 1975లో తన దళాలను విరమించుకుంది.

అమెరికాలో విద్యార్థుల వెల్లువ ఇంత పెద్ద ఎత్తున రావడానికి కారణాలపై ఇంకా లోతైన విశ్లేషణ జరగాల్సి ఉంది.

❃

**జాతీయ పరిణామాలు**

# విశ్వగురు కాదు మరుగుజ్జు



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

ఎన్నికల ప్రచారం ప్రారంభం కాకముందు ఈసారి తమ కూటమి 400 స్థానాలు సాధిస్తుందనీ, తమ పార్టీ ఒక్కదానికే 370 స్థానాలు వస్తాయనీ బిజెపి నాయకులు ప్రగల్భాలు పలికారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించి, ప్రచారం ప్రారంభమైన తర్వాత 400 సీట్లు సాధిస్తామన్న ప్రచారం క్రమంగా వెనుకపట్టు పట్టింది. మొదటి, రెండవ దశల్లో తక్కువ పోలింగ్ జరిగిన పూర్వరంగంలో దాదాపు అన్ని విశ్లేషణలూ బిజెపి, ఎన్‌డిఎ కూటమికి సీట్లు తగ్గుతాయని వెల్లడించాయి. 400 స్థానాలు రాకపోగా 2019 ఎన్నికలలో గెలుచుకున్న స్థానాలనైనా నిలబెట్టుకోవటం సాధ్యం కాదని వారికి స్పష్టమైంది. దానితో కనీసం అధికారంలోకి రావటానికి అవసరమైన స్థానాలనైనా గెలుచుకోగలమా అన్న సందేహంలో పడ్డారు. ఇతరత్రా అంశాలపై ప్రచారాలు పనిచేయవని నిర్ణయించుకున్న బిజెపి, సంఘ్ పరివార్‌లు ముస్లిం మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొట్టటంపై ప్రధానంగా కేంద్రీకరించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడి ఈ విద్వేష ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారు. మిగతా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆయనను అనుసరిస్తూ, ఈ విద్వేషాన్ని దేశం నలుమూలలకు వ్యాపింపజేస్తున్నారు.

బిజెపి ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో అనుసరించిన విధానాలు దేశాభివృద్ధికి దోహదం చేయలేదు. దేశంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, చిన్న ఉత్పత్తి సంస్థలు తదితరుల అభివృద్ధికి మోడి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. వారంతా తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. విద్య, ఉద్యోగాలు, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి తదితర సూచీలన్నీ నేల చూపులు చూస్తున్నాయి. ప్రజల పరిస్థితులు దిగజారుతున్నాయని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు చేస్తున్న అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశాలను ముందుకుతెస్తే తమ అసమర్ధ నిర్వాకం వెల్లడౌతుందని బిజెపి నాయకత్వానికి స్పష్టమైంది. అందువలన ప్రజల జీవితాలతో సంబంధం లేని మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం, రామ మందిర నిర్మాణం, ముస్లింలను చొరబాటుదారులనటం, కాంగ్రెస్ కూటమి అధికారం లోకి వస్తే ఆస్తులను ముస్లింలకు పంచుతారని తదితర అంశాలను ముందుకు తీసుకువచ్చి, ప్రజలను గందరగోళ పరచటానికి మోడి ప్రయత్నిస్తున్నాడు.

తనకు తాను విశ్వగురువుగా ముద్ర వేసుకొంటున్న ప్రధాని నరేంద్రమోడి ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు ఆయన మరుగుజ్జు అని స్పష్టం చేస్తున్నాయి. "నానాటికి తీసికట్టు నాగంభట్టు" అన్న చందంగా ప్రచారం సాగేకొద్దీ, మోడి చౌకబారు వ్యాఖ్యలు చేయటం పెరుగుతున్నది. రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించిన మోడి "కాంగ్రెస్‌కు ఓటేస్తే చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలను కనేవారికి దేశ సంపదను పంచుతారని" చెప్పాడు. 2006లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేశాడని చెబుతున్న ప్రసంగం నుంచి కొన్ని మాటలను ఉదహరించిన తర్వాత, ఆయన ఈ మాటలు చెప్పాడు. తర్వాత "మీరు కష్టపడి సంపాదించుకున్న డబ్బును చొరబాటుదారులకు ఇస్తారా?" అని సభకు హాజరైన ప్రజలను ప్రశ్నించాడు. మన్‌మోహన్‌సింగ్ చెప్పినవిగా మోడి ఉదహరించిన మాటలను ఆయన చెప్పలేదని, చెప్పిన మాటలను కూడా సందర్భం నుండి విడదీసి, తనకు అనుకూలంగా ఉండే విధంగా మోడి ఉదహ రించాడని స్పష్టమైంది.

కాంగ్రెస్ ప్రణాళికపై కూడా మోడి ఇదే విధంగా వ్యాఖ్యానించారు. పేదల భూములను రాజులు, మహారాజులు కాజేశారని రాహుల్‌గాంధి ఆరోపించాడని కర్ణాటకలో జరిగిన సభలో మోడి చెప్పాడు. కాంగ్రెస్ పార్టీ రాజులు, మహారాజులను అవమానిస్తూ నిజాం, నవాబులు, సుల్తాన్‌లు, బాద్‌షాలు చేస్తున్న అరాచకాలపై మాట్లాడటం లేదని విమర్శించాడు. రాజులు, మహారాజులు ప్రజల భూములు, సంపదలను కాజేశారని రాహుల్ గాంధి చెప్పిన అంశాన్ని మతం కోణంలో వినియోగించుకోవటానికి మోడి ప్రయత్నం చేశాడు. గొప్పవాళ్ళు, ధనికులను గురించి చెప్పేటపుడు రాజులు, మహారాజులని వాడతారు మినహా మతపరంగా వ్యత్యాసాన్ని సూచించే సుల్తాన్‌లు, బాద్‌షాలు తదితర పదాలను ఎవరూ ఉపయోగించరు. ఈ విషయం మోడికి తెలియదనుకోవాలా? ప్రత్యర్థులు చెప్పని అంశాలను కూడా చెప్పినట్లు ఉదహరిస్తూ, వాటిని తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పుకుంటున్న మోడి ఈ విధమైన వక్రీకరణలతో ప్రజల అభిమానాన్ని పొందగలనని భావిస్తున్నారు. అది సాధ్యమయేలా కనిపించక పోవటంతో మరింతగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టటానికి, అసత్యాలను ప్రచారం చేయటానికి పూనుకుంటున్నారు. ఏ అంశాలపై ప్రచారం చేయాలో కూడా స్పష్టత కోల్పోయిన మోడి ఏది దొరికితే దానినల్లా ప్రచారానికి వాడుకుంటున్నారు. చివరికి ఓటింగ్ యంత్రాలలో ఓటు ఎవరికి పడుతుందో పరిశీలన చేయాలన్న పిటీషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ప్రచారంలో వాడుకుంటున్నారు. ఓటింగ్ యంత్రాలపై

> **" కర్ణాటక రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొన్న మోడి ఒక కాలేజిలో జరిగిన విద్యార్థిని హత్యతో పాటు మహిళలపై జరిగిన మరికొన్ని అత్యాచారాలను కూడా ప్రస్తావించాడు. కానీ అదే రాష్ట్రంలో తమతో జట్టుకట్టిన జెడిఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ వీడియోలపై దేశవ్యాపితంగా ఆగ్రహం వ్యక్తమౌతున్నా, ఈ అంశంపై విచారణ జరపటానికి రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసినా మోడి మాత్రం స్పందించలేదు. "**

అనుమానాలను వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నదని చెబుతున్నారు.

కర్ణాటక రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొన్న మోడి ఒక కాలేజిలో జరిగిన విద్యార్థిని హత్యతో పాటు మహిళలపై జరిగిన మరికొన్ని అత్యాచారాలను కూడా ప్రస్తావించాడు. కానీ అదే రాష్ట్రంలో తమతో జట్టుకట్టిన జెడిఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ వీడియోలపై దేశవ్యాపితంగా ఆగ్రహం వ్యక్తమౌతున్నా, ఈ అంశంపై విచారణ జరపటానికి రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసినా మోడి మాత్రం స్పందించలేదు. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తననెవరూ చూడటం లేదన్నట్లుగా మోడి ప్రచారతీరు ఉన్నది. మహిళలు, వారిపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యాకాండ పట్ల మోడి ప్రభుత్వం వ్యవహరించే తీరు అత్యంత దారుణంగా ఉన్నది. గతంలో ఏనాడు లేని విధంగా మోడి పాలనలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడుగా ఉన్న బిజెపి ఎం పి బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని దేశానికి పతకాలు, కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి పెడుతున్న మహిళా మల్లయోధులు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించటానికి మోడికి తీరిక లేకుండా పోయింది. అ విషయాన్ని అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చిన మల్లయోధులు ప్రభుత్వ నిష్క్రియా పరత్వానికి విసిగిపోయి, చివరికి ఢిల్లీలో నిరవధిక ఆందోళనకు పూనుకున్నారు. మల్లయోధుల ఆందోళన తర్వాత సింగ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు కమిటిని నియమిస్తున్నామని, కమిటి నివేదిక ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కానీ కమిటి నివేదికను బహిరంగ పరచలేదు. మల్లయోధులు ఫిర్యాదు ఇచ్చినప్పటికీ బ్రిజ్‌భూషణ్‌పై కేసును కూడా నమోదు చేయలేదు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాత, తప్పనిసరి పరిస్థితులలో బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేశారు. నిరసనల సందర్భంగా మహిళా మల్లయోధులపై ఢిల్లీ పోలీసుల వేధింపులను కూడా దేశ ప్రజలందరూ చూశారు. తన కళ్ళముందే ఢిల్లీలో ఈ పరిణామాలు జరుగుతున్నప్పటికీ "భేటీ బచావ్, భేటి పడావ్" అంటూ నినాదాలిస్తున్న ప్రధాని నరేంద్రమోడి ఈ మహిళా మల్లయోధుల సమస్యలపై నోరు మెదపలేదు! మహిళలపై అత్యాచారాలు, హత్యాకాండను అరికట్టటంపై ప్రధాని మోడికి ఎంత శ్రద్ధ ఉందో ఈ ఉదంతాలు వెల్లడిస్తున్నాయి.

మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ మానభంగాలు, వారిని నగ్నంగా ఊరేగించటం, వారిపై జరిగిన హత్యాకాండ, ఆ సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరును ప్రజలు మరిచిపోయారని మోడి భావిస్తున్నట్లున్నారు. మణిపూర్‌లో జాతుల మధ్య చెలరేగిన ఘర్షణలలో వందలాది మంది మహిళలను మానభంగాలు చేశారు. బట్టలు విప్పి, నగ్నంగా ఊరేగించారు. అనేకమందిని హత్య చేశారు. ఈ అంశాలు పత్రికల ద్వారా వెల్లడైన తర్వాత, దేశప్రజలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రధాని నోరు మెదపలేదు. మణిపూర్ వెళ్ళి, బాధిత మహిళలను పరామర్శించటానికి పూనుకోలేదు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్న వీడియో బహిర్గతం అయిన తర్వాత దేశప్రజలంతా ఈ ఘటనలను ఖండిస్తున్నా ప్రధాని మాత్రం స్పందించలేదు. సుప్రీంకోర్టు జోక్యం తర్వాత మాట్లాడక తప్పని పరిస్థితులలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలోనూ ఇటువంటి అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయంటూ మణిపూర్ ఘటనలను తక్కువ చేయటానికి ప్రయత్నం చేశారు.

ఉన్నావో, హత్రాస్ తదితర చోట్ల మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యలను ప్రజలు మరిచిపోలేదు. నిందితులను శిక్షించాలని బాధితులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదు. న్యాయం పొందటం కోసం జరిగిన పోరాటంలో ఉన్నావో బాధితురాలి బంధువులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో ప్రతిపక్షాలను ఇరుకున పెట్టటానికి ఉపయోగపడతాయనుకున్న సంఘటనలను మాత్రమే మోడి తవ్వితీస్తున్నాడు. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు బాధిత మహిళలకు న్యాయం చెయ్యటం, మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్న హంతకులకు తగిన శిక్షలు విధించటం గురించి మోడి ఏనాడూ మాట్లాడలేదు. మహిళలపై అత్యాచారాలు, హత్యలను ఓట్లు సంపాదించే సాధనాలుగా మోడి వినియోగించుకుంటున్నాడన్నది ఆయన ప్రచార తీరు వెల్లడిస్తున్నది.

**రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని మార్చటంపై ముందుకొచ్చిన చర్చ**

రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగాన్ని మార్చటం తదితర అంశాలతో కూడిన తమ రహస్య ఎజెండాను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, తమకు ఓట్లు వేయటానికి ప్రజలు ఆసక్తిగా లేరని స్పష్టం కావటంతో బిజెపి, సంఘ్ పరివార్ నాయకులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తమ ఎజెండాను కప్పిపెట్టటానికి, ప్రజలను మభ్య పెట్టటానికి నానాతంటాలు పడుతున్నారు. తాము అమలు చేయాలనుకున్న అంశాలను మొదట దిగువస్థాయి నాయకులతో ప్రచారం చేయించటం, దానికి ప్రజల నుండి ప్రతిఘటన ఎదురు కాకుండా ఉంటే పూర్తిస్థాయిలో అమలుకు పూనుకోవటం బిజెపి, సంఘ్ పరివార్‌ల పద్ధతి. ఈ విధంగానే పార్లమెంటు ఎన్నికల ముంగిట రాజ్యాంగాన్ని మార్చాలనే చర్చను ప్రారంభించారు. ఎన్నికలలో 400లకు పైగా స్థానాలు సాధిస్తామని గప్పాలు కొట్టారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించినప్పటి నుండి సంఘ్ పరివార్, ఆనాటి దాని రాజకీయ విభాగం హిందు మహాసభ, పేరు మారిన నేటి బిజెపి వరకు రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. రాజ్యాంగానికి మనుస్మృతిని ప్రాతిపదికగా తీసుకోవాలని సంఘ్ పరివార్, హిందు మహాసభలు ఆనాడు వాదించాయి. ఇప్పటికి కూడా వారి వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదు. వివిధ సందర్భాలలో అదే

భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటులో తమకు తగిన మెజారిటి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నాయకులు గతంలో అనేకసార్లు ప్రకటించారు. ఇపుడు 400 కన్నా ఎక్కువ స్థానాలు సాధిస్తామని ప్రకటించిన తర్వాత ఈ చర్చ ముందుకువచ్చింది.

ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చి, బిజెపి తీసుకొచ్చే రాజ్యాంగంలో ఉండేదేమిటి? మనుస్మృతిలో చెప్పిన విధంగా చాతుర్వర్ణ వ్యవస్థను అమలులోకి తీసుకురావటం వారి ప్రాధాన్యత అన్నదానిలో ఎవరికీ సందేహం లేదు. చాతుర్వర్ణ వ్యవస్థలో ఎవరైనా ఆ వర్ణానికి కేటాయించిన పనులు మాత్రమే చేయాలి. ఇతర వర్ణాలకు కేటాయించిన పనులు చేయరాదు. ఆ రీత్యా చూసినపుడు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగంలో ప్రభుత్వం శూద్రకులాలకు కేటాయించిన ఎస్‌సి, ఎస్‌టి, వోబిసిల రిజర్వేషన్‌లపై మొదటి దెబ్బ పడుతుంది. ఆయా వర్ణాలకు చెందిన ప్రజలను తగిన కట్టుబాట్లలో ఉంచటానికి చట్టపరంగా తీసుకొనే చర్యలను వారు రూపొందించే రాజ్యాంగంలో చేరుస్తారు. వీటిపైన ఎవరికైనా సందేహాలుంటే భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మోడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూడవచ్చు. రాజ్యాంగపరంగా దేశాధినేతగా ఉన్న ద్రౌపది ముర్ము గిరిజన మహిళ. వితంతువు. కాబట్టే పార్లమెంటు నూతన భవనం ప్రారంభోత్సవానికి మోడి ప్రభుత్వం ఆమెను ఆహ్వానించలేదు. రామ మందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రతిపక్ష నాయకులు రాలేదని ఎన్నికల సభల్లో నానాయాగీ చేస్తున్న మోడి, ఆ కార్యక్రమానికి రాష్ట్రపతిని ఆహ్వానించలేదు. ఈ చర్యలు సనాతన ధర్మాన్ని అమలు చేయాలని చెబుతున్నవారి వివక్షాపూరిత విధానాలను వెల్లడిస్తున్నాయని ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించగా, దానిని తక్షణమే ఎదుర్కోవాలని మరుచటి రోజే మోడి బిజెపి నాయకత్వానికి చెప్పాడు. స్టాలిన్‌పై కేసులు నమోదు చేయించారు. సనాతన ధర్మాన్ని కాపాడుతామంటూ దేశవ్యాపితంగా ప్రచారం చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడటం కోసం కంకణం కట్టుకున్నవారు రూపొందించే రాజ్యాంగంలో ఏ అంశాలుంటాయన్న దానిపై ప్రజలు స్పష్టంగానే ఉన్నారు. అందువలననే బిజెపి నాయకత్వం అంతా తాము తిరిగి అధికారంలోకి వచ్చినా రాజ్యాంగాన్ని మార్చబోమని చెబుతూ ప్రజలను మభ్యపెట్టటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలు వాస్తవాలేమిటో తెలుసుకుంటున్న సమయంలో మోడి, బిజెపి నాయకుల ఆపద మొక్కులు ఎంత మేరకు పనిచేస్తాయనేది ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తాయి.

**బలమైన ప్రధాని పేరుతో మోడి డబ్బా**

దేశంలో బలహీనమైన ప్రభుత్వం, ప్రధాని ఉండాలని శత్రువులు కోరుకుంటు న్నారని, దేశంలోని ప్రజల ప్రయోజనాలు పట్టనివారు కూడా అదే కోరుకుంటున్నారని మోడి ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీని అర్బన్ నగ్జల్స్ నడుపుతు న్నారని, అందువలన ఇండియా కూటమికి ఓట్లు వేయవద్దని ప్రచారం చేస్తున్నాడు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సంవత్సరానికి ఒక ప్రధానమంత్రి వస్తాడని, కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వం ఉంటుందని చెబుతున్నాడు. దేశానికి బలమైన ప్రధాని కావాలని, తానే బలమైన ప్రధానినని కూడా స్వంతడబ్బా కొట్టుకుంటున్నాడు.

పార్లమెంటులో సభ్యుల సంఖ్యాబలంపై మాత్రమే ప్రభుత్వం బలమైనదా, కాదా అన్న అంశం ఆధారపడి ఉండదు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బిజెపి ప్రభుత్వం కన్నా బలమైన ప్రభుత్వం, బలమైన ప్రధాని వస్తారు. సంఖ్యాబలం ఉన్నా బిజెపి ప్రభుత్వం అనేక విషయాలలో బలహీనంగా వ్యవహరించింది. ప్రజలకు సంబంధించిన అనేక విషయాలలో మోడి అంత పిరికితనంతో వ్యవహరించిన ప్రధాని గతంలో ఎవరూ లేరు. పార్లమెంటులో ఎక్కువ సంఖ్యాబలం ఉన్నా అనేక బిల్లులపై చర్చకు అవకాశం లేకుండా చేసి, చట్టాలుగా రూపొందించారు. ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లు అటువంటి వాటిలో కొన్ని. సంఖ్యాబలం ఉన్నా ఈ విధంగా వ్యవహరించేది బలమైన ప్రభుత్వం అవుతుందా? తమపై వేధింపులకు పాల్పడుతు న్నారని మల్లయోధులు, మణిపూర్ మహిళలు ఆందోళనలు చేస్తున్నా మోడి ఈనాటికీ నోరు మెదపలేదు. తమకు అన్యాయం జరిగిందని ప్రజలు ఆందోళన చేస్తుంటే అది తప్పో, ఒప్పో చెప్పలేని ఈయన బలమైన ప్రధాని ఎలా అవుతాడు?

“ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బిజెపి ప్రభుత్వం కన్నా బలమైన ప్రభుత్వం, బలమైన ప్రధాని వస్తారు. సంఖ్యాబలం ఉన్నా బిజెపి ప్రభుత్వం అనేక విషయాలలో బలహీనంగా వ్యవహరించింది. ప్రజలకు సంబంధించిన అనేక విషయాలలో మోడి అంత పిరికితనంతో వ్యవహరించిన ప్రధాని గతంలో ఎవరూ లేరు.”

అన్ని రంగాలలోనూ విఫలమైన మోడి అబద్ధాలు, మతోన్మాద ప్రచారంతో ఎన్నికలలో విజయం సాధించగలనని భావిస్తున్నాడు. కాని వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొంతమందిని కొంతకాలం మోసం చేయవచ్చు. కొందరిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరన్న సూక్తి అక్షరసత్యం అవుతున్నది. బిజెపి మోసాలను అర్ధం చేసుకుంటున్న ప్రజలు ఆ ఎర్టీకి ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధమౌతున్నారు. ❈


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

స్ఫూర్తి

# విప్లవ మహిళ రోజా లక్సెంబర్గ్



టి చంద్రపాల్

రోజా లక్సెంబర్గ్ పోలెండ్‌లో ఒక యూదు కుటుంబంలో 1871 మార్చి 5న పుట్టింది. కుటుంబంలో ఆమె ఐదో సంతానం. ఆఖరి సంతానం కూడా. ఆ వేళ పోలెండు మూడు ముక్కలుగా ఉంది. ఒక ముక్క రష్యా ఆధీనంలో, మరో ముక్క జర్మనీ స్వాధీనంలో, ఇంకో ముక్క ఆస్ట్రియా క్రింద ఉన్నాయి. రష్యా ఆధీనంలో ఉన్న భాగంలో రోజా పుట్టింది. ఆమె వార్సాలో ఒక రష్యన్ పాఠశాలలో చేరింది. అది బాలికల బడి. ఆ స్కూల్లో రష్యన్ తప్ప వేరే భాష మాట్లాడనిచ్చేవారు కాదు. అసలక్కడ పోలెండ్ పిల్లలను చేర్చుకోవడమే అవదు. అందునా యూదు పిల్లల్ని అస్సలు రానిచ్చేవారు కాదు. అయితే స్కూలు యాజమాన్యాన్ని ఎలాగైనా ఒప్పించి రోజాను అక్కడ చేర్చారు. ఆమె ఐదవ ఏట తుంటి నొప్పితో కొంత కాలం బాధపడింది. నొప్పి తగ్గాక కూడా కొద్దిగా కుంటేది. జీవితాంతం ఆ కుంటు సరవ్వలేదు. తండ్రి కలప వ్యాపారం చేసేవాడు. ఆయనకు రాచరికం గిట్టేదికాదు. పరాయి (జడ చక్రవర్తి) పాలనని ద్వేషించాడు. ప్రజాస్వామ్యం కావాలనే వాడు. తల్లి భక్తురాలు. అయితే చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం తల్లి నుంచే రోజాకు అలవాటయ్యింది. తండ్రి నుంచి స్వేచ్ఛాభావాలు, తల్లి నుంచి పుస్తక పఠనం రోజాకు సంక్రమించాయి.

రోజా లక్సెంబర్గ్ పార్టీ పత్రిక సంపాదకవర్గ సభ్యురాలయింది. జర్మన్ సైనికవాదాన్నీ, దాని సామ్రాజ్యవాదాన్నీ ఆమె తన రచనల్లో ఎత్తిచూపింది. పోలెండు సోషలిస్టు పార్టీ అనుసరిస్తున్న జాతీయవాద విధానాలను తీవ్రంగా విమర్శించింది. పోరాటం జరగాల్సింది సోషలిజం కోసం మాత్రమే అని ఆమె వాదించింది. రష్యా జర్మనీ దేశాల్లో సోషలిస్టు విప్లవం వస్తేగాని పోలెండుకు స్వాతంత్రం రాదన్నది ఆమే అయినా, కార్మికులు జాతీయ వాదంలో పడి కొట్టుకుపోకుండా వారు పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడానికి సన్నద్ధం కావాలి అన్నది ఆమె భావన. రోజా లక్సెంబర్గ్ తన జీవిత పర్యంతం అంతర్జాతీయ వాదిగానే బతికింది. ఆమె రష్యన్ సోషల్ డెమొక్రటిక్ నేతలు ప్లెఖనువ్, ఆక్సెల్‌రాడ్‌తో సంబంధాలు పెట్టుకుంది. ఆమె దృష్టిలో విప్లవం ఒక అంతర్జాతీయ వ్యవహారమే తప్ప జాతీయ సంకుచిత పరిధిలో ఇమడ గలిగేది కాదు. 1907 నుంచి మార్క్సిజాన్ని అర్థశాస్త్రాన్ని బోధించింది. ఆమె ఉద్యమంలో ఉన్నా, ఉపాధ్యాయురాలిగా ఉన్నా, ఇంట్లో ఉన్నా, జైల్లో ఉన్నా ఏ పరిస్థితుల్లోనూ అధ్యయనం మానలేదు. 1907లో రష్యన్ సాహిత్య డెమొక్రటిక్ పార్టీ ఐదవ పుట్టినరోజు సమావేశం లండన్‌లో జరిగింది. దానికి రోసా హాజరయింది. మొట్టమొదటి సారి ఆమె అక్కడ లెనిన్‌ని కలిసింది. అదే ఏడాది స్టుట్‌గార్డ్ (జర్మనీ)లో రెండో ఇంటర్నేషనల్ ఏడో మహాసభ జరిగింది. దానిలో అనేక దేశాల నుంచి వచ్చిన 900 మంది సోషలిస్టు ప్రతినిధులు పాల్గొన్నారు. యుద్ధం వస్తే దానికి వ్యతిరేకంగా ఏ దేశంలో ఆ దేశ సోషలిస్టులు సార్వత్రిక సమ్మె నిర్వహించి, స్వదేశ ప్రభుత్వాలని ఎదుర్కోవాలి అన్న రోజా తీర్మానాన్ని మహాసభ ఉత్సాహంగా ఆమోదించింది. అది మొదలు 1914 యుద్ధానికి ముందు జరిగిన అన్ని సోషలిస్టు మహాసభల్లోనూ ఆ తీర్మానం ఆమోదించింది.

1914లో సామ్రాజ్యవాద దేశాల మధ్య యుద్ధం రానే వచ్చింది. అంతవరకు అంతర్జాతీయ మహాసభలన్నింటిలోనూ యుద్ధం వస్తే దాన్ని సమ్మెలతో, ఉద్యమాలతో, నిరసనలతో, సహాయ నిరాకరణలతో ప్రతిఘటిస్తాం అని హామీఇచ్చిన పార్టీల్లో బోల్షివిక్ పార్టీ తప్ప మిగతా పార్టీలన్నీ మాట తప్పాయి. లీగ్ సభ్యులు స్పార్టకస్ పీడిత యుద్ధ వ్యతిరేక కరపత్రాలు రాసి రహస్యంగా పంచారు. జైల్లో ఉన్న రోసా జూనియర్ అన్న మారో పేరుతో రాసేది. ఆ కరపత్రాలను విప్లవ కార్యకర్తలు రహస్యంగా పంచారు. ఆమె ఆ కరపత్రాల్లో ప్రభుత్వ యుద్ధ నీతిని సోషల్ డెమొక్రటిక్ నేతల దిగజారుడునీ ఎండగట్టింది. ఆమె సోషలిస్టు విప్లవానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో, స్వేచ్ఛకీ అంతే ప్రాధాన్యం ఇచ్చింది. స్వేచ్ఛ అంటే అధికారానికి భజన చేసే స్వేచ్ఛకాదు. స్వేచ్ఛ అంటే విభేదించే వాని స్వేచ్ఛ. అటువంటి స్వేచ్ఛకు అవకాశం లేకుండాపోతే, జీవం అడుగంటిపోతుంది. అప్పుడు వర్ధిల్లేది ఒక్క బ్యూరోక్రసీ మాత్రమే అన్నది ఆమె నిశ్చిత అభిప్రాయం.

" 1871 మార్చి 5 రోజా లక్సెంబర్గ్ జయంతి సందర్భంగా నేటి యువతరం రోజా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జా తీయ వాదాన్ని అందిపుచ్చుకోవాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గొంతు కలపాలి. సోషలిజం కోసం జరిగే పోరాటంలో మనం భాగస్వా ములు కావాలి అప్పుడే మనం రోజా ఆశయ బాటలో పయనించిన వారమవుతాం. "

యుద్ధంలో జర్మన్ సేనలు ఓడిపోతున్న కొద్దీ ప్రజల్లో యుద్ధ వ్యతిరేకత పెరుగుతూ పోయింది. యుద్ధానికి వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె నిర్వహించడానికి రోసా, లీచ్నెక్ట్ ప్రయత్నించారు. వారిద్దరినీ ప్రభుత్వం మరోసారి అరెస్టు చేసింది. 1918 నవంబరు విప్లవం వాళ్ళిద్దరూ జైల్లో ఉండగానే మొదలయింది. తిరుగుబాటు ప్రచండంగా వ్యాపించింది. జర్మనీ అంతటా కార్మికులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. సైన్యంలో అనేకభాగాలు విప్లవం వైపు వచ్చేశాయి. జర్మనీ అంతటా ఎక్కడికక్కడ విప్లవ కౌన్సిళ్లు ఏర్పడ్డాయి. అచ్చం ఆనాటి రష్యాలో సోవియట్లులాగా ఎన్.పి.డి. సభ్యులు ఉత్సాహంగా ఆ కౌన్సిళ్ళకు మద్దతు పలికారు. నాయకులు భయపడ్డారు. విప్లవాన్ని దిగజార్చే వాళ్ళ కోసం ప్రజల్లో చూడక్కర్లేదు. కానీ నాయకుల్లో చూడచ్చుంటుంది రోజా.

విప్లవం కారణంగా నవంబరులో ఎనిమిదవ తేదీన రోజా విడుదల అయింది. లీచ్నెక్టు తొమ్మిదిన విడుదల అయ్యాడు. మళ్ళీ వాళ్ళిద్దరూ విప్లవ పనిలో దిగారు. విప్లవ శక్తులన్నింటినీ కూడగట్టడానికి ప్రయత్నిచారు. ఎర్రజెండా పేరుతో ఒక పత్రిక ప్రారంభించారు. రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని వారు డిమాండు చేశారు. మరణశిక్ష రద్దు చేయాలని ప్రచారం చేశారు. స్పార్టకస్ లీగ్‌కి కొత్త కార్యక్రమం తయారుచేశారు.

జనవరిలోనే మళ్ళీ ఒక విప్లవ వెల్లువ ప్రారంభమైంది. అయితే రెండు నెలల ముందు జరిగిన విప్లవానికీ, ఈ విప్లవానికీ రష్యా బలాబలాల్లో చాలా తేడా ఉంది. మొదట్లో విప్లవంలో పాల్గొన్న అనేక ప్రజా విభాగాలు రెండూ దానిలో పాల్గోలేదు. నిజానికి, రెండో విప్లవానికి రోజా గాని, లీచెక్టుగాని పిలుపు ఇవ్వలేదు. అయినా విప్లవం ఒక్కసారి మొదలయ్యాక వారిద్దరూ దానిలో దూకేసి విప్లవాన్ని నిర్దాక్షిణ్యంగా ఆపివెయ్యమని జర్మన్ అధ్యక్షుడు ఎబెర్ట్ కిరాయి వాళ్ళతో ఆదేశించాడు.

జనవరి 11 నాటికి ఆ మూకలు విప్లవాన్ని ఆపించేశారు. లీచ్నెక్టునీ, రోసానీ పట్టుకుని వేర్వేరుగా చిత్రహింసలు పెట్టారు. తర్వాత జనవరి 15న లీచ్నెక్టుని తుపాకితో కాల్చి చంపారు. శవాన్ని పేరు లేకుండా శవాల గదిలో పడేశారు. పార్టీ వ్యవస్థాపకుని కుమారుడిని ఆ పార్టీ అలా కడ తేర్చింది. అదే రోజున వేరే చోట ఒక కిరాయి గాడు రైఫిల్ మడమతో రోసా తలపై బలంగా మోదాడు. కింద పడిపోయిన రోసా తలలో మరొక కిరాయిగాడు కాల్చాడు. తర్వాత ఆ మూకలు ఆమె దేహాన్ని పక్కనున్న కాలువలో పడేశారు. రోసాపై కిరాయి గాళ్ళకున్న కసి అలాంటిది. ఎన్.పి.డి. నాయకత్వ భ్రష్టత్వం అది. ఈ హత్యలు జరిగే నాటికి జోగిచెస్ జైల్లోనే ఉన్నాడు. జోగిచెన్, రోజాలు 1907లోనే విడిపోయారు. అయితే వారిద్దరి మధ్య విప్లవ సంబంధాలు చివరి వరకూ కొనసాగాయి. ఆయన వారిద్దరి మరణాల గురించి వివరాలు సేకరించసాగాడు. అది తెలిసిన కిరాయి మూకలు అతడిని మార్చి 10వ తేదీన చంపేశారు. యుద్ధమంత్రి నోస్కి ఆ తర్వాత జరిపించిన విచ్చలవిడి హింసా కాండలో వేలాది మంది విప్లవకారులు బలైపోయారు. ఈ హత్యలతో ఎన్.పి.డి. పతనం పాతాళానికి చేరింది. ఆనాటి కిరాయి మూకలు, ఓ దశాబ్దం తర్వాత తొలి నాజీ దళాలయ్యాయి.

1871 మార్చి 5 రోజా లక్సెంబర్గ్ జయంతి సందర్భంగా నేటి యువతరం రోజా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జాతీయ వాదాన్ని అందిపుచ్చుకోవాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గొంతు కలపాలి. సోషలిజం కోసం జరిగే పోరాటంలో మనం భాగస్వాములు కావాలి అప్పుడే మనం రోజా ఆశయ బాటలో పయనించిన వారమవుతాం.

(**రచయిత** ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐ.సి.ఇ.యి) మచిలీపట్నం డివిజన్ సహాయ కార్యదర్శి)

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# ఎన్నికల బాండ్లు ఒక భారీ కుంభకోణం

ఉంటాయి. ఇది భారతీయ ఎన్నికల ప్రత్యేక లక్షణం అని చెప్పవచ్చు. ఓటర్లకు ఇచ్చే ఈ తాయిలాలను అందరూ వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ అవి కొనసాగుతూనూ ఉన్నాయి. ఒక ఎన్నికకు, మరో ఎన్నికకు వీటి కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సికూడా వస్తోంది. భారతీయ సమాజంలో పెద్ద ఎత్తున కొనసాగుతున్న అసమానతలు, పేదరికమే దీనికి కారణం. పేదరికాన్ని అడ్డుపెట్టుకుని పార్టీలు ఓటర్లకు తాయిలాలు ఇచ్చి సభలకు, పోలింగ్‌కు తరలిస్తున్నాయి. ఇలా ఖర్చు చేస్తున్న మొత్తానికి లెక్కలే ఉండవు. పొలిటికల్ ఫైనాన్స్‌లో నిధుల సేకరణకు, వ్యయానికి కూడా పారదర్శకత ఉండాలి. పారదర్శకత అనేది ప్రశంసించదగిన ఒక లక్ష్యం. అయితే, దానికదే రాజకీయ సూత్రం కాలేదు. సైద్ధాంతిక లక్ష్యం నుండి దానిని వేరుచేయలేం. ఇక్కడేఎలక్టోరల్ బాండ్లను అమలు చేసిన అతి పెద్ద రాజకీయ ప్రాజెక్టు ప్రాధాన్యత నంతరించుకుంటుంది.

ఎలక్టోరల్ బాండ్ల గురించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడానికి అనేకమంది ఆర్‌టిఐ ద్వారా ప్రయత్నించారు. కామన్వెల్త్ మానవహక్కుల కార్యకర్త వెంకటేష్ నాయక్‌కు వచ్చిన సమాధానం ప్రకారం రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు రహస్య పద్ధతులు ఉండాలని ఏ దాత కూడా కోరలేదు. కానీ, పాలకపార్టీ ఆలోచనల ప్రకారమే ఆ విధానం రూపొంది, అమలులోకి వచ్చింది. ఈ విధానంపై ఎన్నికల కమిషన్, ఆర్‌బిఐ కూడా అభ్యంతరాలు తెలిపాయి. ఆ అభిప్రాయాలు కూడా ప్రభుత్వ రికార్డుల్లో కనపడతాయి. అయినా, ఈ పథకం అవసరమని బిజెపి ఎందుకు భావించింది? ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని తీసుకువస్తున్న సమయానికి ఇతర పార్టీలతో పోలిస్తే బిజెపికి చాలా తక్కువ విరాళాలు వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి ఏమిటి? ఆలోచించండి!

సంఘ్‌పరివార్ సృష్టించాలని ప్రయత్నిస్తున్న విస్తృత రాజకీయ, సామాజిక సమాజపు ప్రాజెక్టులోనే ఈ ప్రశ్నకు సమాధానం ఉంది. శాశ్వతంగా సమీకరించబడిన నిరంకుశ అధికారాలు ఉన్న రాజకీయ చట్రాన్ని ఆ సమాజం కలిగిఉంటుంది. ప్రతి ఒక్కరి జీవితాన్ని పర్యవేక్షించే ఆ వ్యవస్థ నమ్మకం లేదా భయం చేత తనను నడిపించే వ్యక్తులపై పూర్తిస్థాయిలో ఆధారపడుతుంది. ఆ సమాజంలో వ్యక్తుల ఇష్టాఇష్టాలతో, వారి

(14వ పేజీ తరువాయి)

ఎంపికలకు ఎటువంటి ప్రాధాన్యత ఉండదు. ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమున్నా లేకున్నా సంఘ్‌పరివార్ సృష్టించిన జాతీయ ప్రాజెక్టుకు సేవ చేసి తీరాలి. ఆ ప్రాజెక్టు లక్ష్యాలే తమ లక్ష్యాలుగా భావించాలి. విరాళాలు ఇచ్చే కంపెనీలకు కూడా ఎటువంటి మినహాయింపు ఉండదు. మరో మాటలో చెప్పాలంటే ప్రతి వ్యక్తి, సంఘం, కంపెనీలు జాతీయ ప్రాజెక్టు లక్ష్యాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. అవసరమైనప్పుడు ఆర్థికంగా సహాయం చేయాలి. అలా చేయడం ప్రతి ఒక్కరి జాతీయ కర్తవ్యంగా భావింపబడుతుంది.

విరాళాలపై పరిమితులు లేకపోవడం, ఇచ్చిన విరాళాలను బహిర్గతం చేయవలసిన అవసరం లేకపోవడం ఎలక్టోరల్ బాండ్ల కీలక లక్షణాలు. ఇవి ప్రస్తుత గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ నుండి నిరంకుశత్వ రాజ్యం వైపు బిజెపి చేసే ప్రయాణంలో భాగంగా రూపొందించబడిన నిబంధనలు. ఆ వ్యవస్థలో ఎవరు, ఎవరికి ఎంత నిధులను విరాళంగా ఇచ్చారన్న విషయంతో ప్రజలకు ఎటువంటి సంబంధం ఉండదు. ప్రజలకు ఆ విషయాలను తెలుసుకోవాల్సిన అవసరమే ఉండదు. లాభాలతో నిమిత్తం లేకుండా ఏ సంస్థ అయినా, ఎంతమొత్తమైనా విరాళం ఇయ్యవచ్చు. ఈ రెండు అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకపార్టీ విధానాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే, నిరంకుశ అధికారాలతో సాగే రాజ్యంలో ఈ ప్రశ్నే తలెత్తదు. ఎందుకంటే ఆ ప్రభుత్వ రాజకీయ సైద్ధాంతిక లక్ష్యాలు స్పష్టంగా ముందు నిర్ణయమౌతాయి. ఇక కార్పొరేట్లు ఇచ్చే నిధులపై ప్రజల పర్యవేక్షణ అనే భావనకు కూడా అవకాశం ఉండదు. ఈ దృష్టి కోణంలోనే ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని బిజెపి రూపొందించింది. తన ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉండే భారతీయ రాజకీయ వ్యవస్థను, ప్రజారంగాన్ని, పౌర సమాజాన్ని తనకు అనుకూలంగా మార్చుకునే సవాల్‌ను బిజెపి ఎదుర్కొంటోంది. రాజకీయ నిధుల వ్యవస్థను మార్చడం ద్వారా ప్రజాస్వామ్యానికి ముగింపు పలికే దిశలో బిజెపి సులభంగా ఒక అడుగు వేసింది.

భారత దేశంలోని సంస్థల్లో, ప్రజారంగంలోనూ అటువంటి మార్పులు అసంభవమని అనిపిస్తే అది పొరపాటు. నిజానికి ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ విషయాన్ని నొక్కి చెప్పాలి. సంఘ్ పరివార్‌కన్నా చాలా చిన్న రాజకీయ శక్తులు ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఈ తరహా మార్పును తీసుకువచ్చి ప్రజలను తమ నియంత్రణలో ఉంచుకున్నాయి. ఇప్పటికీ, అటువంటి ఉదాహరణలు ఉన్నాయి. అందువల్ల అధికారంలో ఉంటూ బిజెపి చేసే విధానపరమైన మార్పులను అంచనా వేసేటప్పుడు దాని రాజకీయ లక్ష్యాన్ని పరిగణలోకి తీసుకోవాలి. కార్పొరేట్‌లను బెదిరించడం, వారినుండి నిధులను మళ్లించుకోవడం వంటి అంశాల కంటే బిజెపి లక్ష్యాలు చాలా విస్తృతమైనవి, దీర్ఘకాలం ప్రభావం చూపేవి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని చేసే విశ్లేషణ మాత్రమే బిజెపి ఏం సాధించడానికి ప్రయత్నిస్తుందో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడమన్నది నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యానికి అనుకూలమైన చర్య అనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రజాస్వామ్య ఆకాంక్షలు, సంఘ్‌పరివార్ లక్ష్యాన్ని వ్యతిరేకించే భారతరాజకీయాల్లోని కొంత భాగం ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా నిలిచాయి. ఉదారవాదంతో కూడిన ప్రజాస్వామిక ఆకాంక్షలు ఈ అంశాన్ని కేవలం అవినీతి, మోసానికి పరిమితం చేస్తాయి. ఇది నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరగవలసిన రాజకీయ పోరాటాన్ని తప్పుదారి పట్టించడమే అవుతుంది.

సైద్ధాంతిక నియంతృత్వం అన్ని హద్దులను అధిగమించి, ప్రజల జీవితాల్లోకి చొరబడుతుంది. పాలనా వ్యవస్థలను నిష్క్రియం చేస్తుంది. సంఘ్‌పరివార్ రాజకీయాలు ఇదే చేస్తున్నాయి. ప్రజల జీవితాలకు చెందిన అన్ని కోణాల్లోకి సంఘ్‌పరివార్ చొరబడుతోంది. వారిని నియంత్రించడానికి ప్రయత్నిస్తోంది. అదే సమయంలో నిధులను ఎలా సమీకరిస్తోంది? అవినీతి, క్విడ్‌ప్రోకో, దోపిడీలకు అతీతంగా పనిచేస్తోందా? దాని లక్ష్యాలు, ప్రాధాన్యతలపై మాట్లాడటానికి, అభిప్రాయాలు చెప్పడానికి ఎవరికీ ఎటువంటి అవకాశం ఉండదు. ఎలక్టోరల్ బాండ్ల పథకం యొక్క నిజమైన కథ ఇది!

**(అనువాదం: కె. ఉషారాణి,**
**రాజగోపాల్ శర్మ)**

# ఆశయాల శిఖరం కామ్రేడ్ పర్స

*(2వ పేజీ తరువాయి)*


క్యాంపుకు చేరుకున్నారు. కొద్ది రోజులు తరువాత శేషగిరిరావు కూడా చేరుకున్నారు. పర్సను కొత్తగూడెం వెళ్లమని కార్మికులతో సంబందాలు పునరుద్ధరించమని తాను కూడా వస్తానని శేషగిరిరావు చెప్పారు. అదే శేషగిరిరావును చివరిసారిగా చూడటం, భద్రాచలం మీదుగా కొత్త గూడెం వస్తున్న శేషగిరిరావును పోలీసులు పట్టుకుని కాల్చి చంపారు, గొప్ప సహచరుడిని పర్స కోల్పోయారు. ఆయన చెప్పిన కర్తవ్యాన్ని అమలులో పెట్టారు.

**జైలు జీవితం:**

పార్టీ పై నిషేదం కొనసాగుతున్న కాలం. 1947 సంవత్సరంలో డిసెంబర్‌లో పార్టీ పనులమీద కొత్తగూడెం వచ్చి రహస్యంగా తిరుగుతున్న పర్సను అరెస్ట్ చేసి వరంగల్ జైలుకు పంపారు. దాదాపు 6 సంIIలు జైలు జీవితం గడిపారు. 3 సంIIలు అజ్ఞాతవాసం గడిపారు. కుటుంబం కడు గడ్డు పరిస్థితి ఎదుర్కోంది. కామ్రేడ్ భారతి కుటుంబ బాధ్యతలు నెత్తికెత్తుకుని పిల్లల్ని బాధ్యతగా పెంచారు. 1949 మార్చిలో పర్సను వరంగల్ జైలు నుండి ఔరంగాబాద్ జైలుకి తరలించారు. చీకటి గదిలో బంధీ చేశారు. బందిపోటు దొంగలకు వేసే సంకెళ్ళ కన్నా ఘోరంగా కాళ్లకు, చేతులకు సంకేళ్లు వేసారు. అది వెలుతురు కనబడని డార్క్ సెల్. అక్కడే నిరాహార దీక్ష చేశారు. అనంతరం అక్కడి నుండి బ్యారక్‌లో తరలించారు. తరువాత గోడకు ఆనుకుని ఉన్న ఓపెన్ బ్యారెక్ లోకి మార్చారు. జైలు నుండి ఎలాగైనా తప్పించుకోవాలని పర్సా నిరంతరం ఆలోచించేవారు. ఆ బ్యారక్‌లో అప్పటికే పారిపోవడానికి సిద్ధంగా ఉన్న ముగ్గురు తోడయ్యారు, వారితో కలిసి బ్యారక్‌లో ఉన్న గదికి రంధ్రం చేసుకొని నలుగురు పరారయ్యారు. జైలు నుండి తప్పించుకోవడానికి సర్దార్ పృథ్విసింగ్ వారికి ఆదర్శం.

**బతుకులో పార్టీ భాగమయింది:**

సింగరేని కాలరీన్‌లో ట్రేడ్ యూనియన్ పని చేస్తూనే, పార్టీ నిర్మాణంకు పూర్తికాలం కార్యకర్తగా రావాలని కోరినప్పుడు పర్స తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. విప్లవమే వృత్తిగా భావించి తన ఉద్యమ ప్రస్థానాన్ని




**"నేను నా జీవితం"**
**ప్రజాశక్తి ప్రచురించిన పర్స సత్యనారాయణ జీవిత కథ**


కొనసాగించారు. 1962 సంవత్సరంలో చైనా యుద్ధం ముందుకు వచ్చింది. రివిజనిస్టుల పోకడలు తారాస్థాయికి చేరాయి. యాజమాన్యాలకు తొత్తులుగా మారిపోయే ధోరణులు యూనియన్స్‌లో తలెత్తాయి. 1964వ సంవత్సరం డిసెంబర్ 31, తెల్లవారితే జనవరి 1 న అర్థరాత్రి ఆక్రమ అరెస్ట్‌లు జరిగాయి. తెలంగాణా ప్రాంతానికి సంబందించిన వారిని చెంచల్‌గూడా జైలుకి, ఆంధ్రా ప్రాంతాలవారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. చైనా మద్దతుదారులు అని ముద్ర వేసి 1966 మే వరకు జైలులో నిర్భందించారు. విడుదలైన అనంతరం మితవాదాన్ని వదిలించుకుని కుదుట పడుతున్న పరిస్థితుల్లో నక్సల్‌బరి ప్రాంతంలో వ్యక్తి గత హింసావాదం తలెత్తింది. ఒక వైపు అతివాద, మితవాద రివిజనిస్టులతో పోరాటం మరో వైపు శత్రువుతో పోరాటం చాలా క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందని పర్స చెప్తూ ఉండేవారు. సుదీర్ఘకాలం ట్రేడ్ యూనియన్‌కి అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ ఎక్కడ పని చేయమంటే అక్కడ పనిచేసేవారు. కార్మికులతో, కార్యకర్తలతో కామ్రేడ్ పర్స జీవితం పెనవేసుకుపోయింది

కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించేవారు, చదవడం గురించి, పోరాట పద్ధతుల గురించి స్పష్టంగా చెప్పేవారు. ప్రేమ పూర్వకంగా కార్యకర్తలకు లేఖలు రాసేవారు. ప్రజాశక్తిలో, కార్మికలోకంలో అచ్చు తప్పులు ఏమైనా వచ్చినా, పొరపాటు వార్తలు వచ్చినా లేఖల ద్వారా తెలిపేవారు. ఎమ్మెల్యేగా పనిచేసినా, పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్నా ఎప్పుడూ దర్పం ప్రదర్శించేవారు కాదు. కామ్రేడ్ పర్స జీవితంలో 3 అంశాలు స్ఫూర్తినిస్తాయి. 1. నమ్రత. 2, అధ్యయనం, 3. పోరాట పటిమ, కామ్రేడ్ పర్స నిరంతరం అధ్యయనం చేసేవారు. పరిస్థితులకు తగ్గట్లు వ్యవహరించే వారు, ఉన్నత చదువులు చదివిన వారికి, అత్యంత వెనకబడినప్రాంతాల నుండి వచ్చిన వారికి సైతం సులభంగా, సరళంగాపాఠాలు చెప్పగల నేర్పరి. వయస్సుతో సంబంధం లేకుండా కలిసిపోవడం, కొత్త కామ్రేడ్స్‌ని ఆకట్టుకొనే విధంగా ఉత్తేజపరచడం ఆయన ప్రత్యేకత. కుటుంబంలో ఆర్థిక సమస్యలెదురైనా, తీవ్ర ఒడిదుడుకులు వచ్చినా, సమ్మినదారిలో చివరికంటూ ప్రయాణించారు. నిర్బంధ కాలంలో కనబడితే కాల్చేసే రోజుల్లో రాత్రులు స్మశానాల్లో ఉండేవారు. తెల్లవారు జామునే ఎవరి కంటా పడకుండా గ్రామంలోని కార్యకర్తల ఇంటికి వెళ్లిపోయేవారు. శత్రువు ఎంత బలం ఉపయోగించినా లోంగిపోలేదు."పర్స సత్యం చనిపోయాడు. మృతదేహాన్ని గుర్తించి తీసుకెళ్ళండని పోలీసులు చాటింపు వేసారు". కామ్రేడ్ భారతి తల్లడిల్లిపోయారు పర్స తల్లి వెంకట సుబ్బమ్మ ధైర్యం చేసి సాధారణ వ్యక్తిలా వెళ్లి మృతదేహన్ని చూసి అది పర్స కాదని ఇంటికొచ్చి భారతికి చెప్పెవరకు ఆవిడకు కుదురులేదు. పోలీసులు ఎన్ని కుయుక్తులు పన్నినా, వేధించినా వెనకడుగువేయలేదు. చివరి దశలో హైదరాబాదు నుండి తన కూతురు లీలా ఇంటికి ఏలూరుకు వచ్చారు, ఏలూరులో ఉన్న కార్యకర్తలకు బోధిస్తూ కార్యోన్ముఖులను చేసేవారు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టె కాలే వరకూ నిలిచిన వ్యక్తి కామ్రేడ్ పర్స సత్య నారాయణ. అందుకే ఆయన ధన్యజీవి. మే 22వ తేదీన వర్ధంతి సందర్భంగా ఆ ఆదర్శ కామ్రేడ్‌కు నివాళులర్పిద్దాం.

**(రచయిత డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2023-24, Marxistu Monthly Magazine, Volume 19, issue: 12 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# పెట్టుబడిదారీ దేశాల్లో పత్రికాస్వేచ్ఛ అంటే వార్తలను కొనుగోలు చేసే స్వేచ్ఛ మాత్రమే



\- లెనిన్

ప్రపంచంలో పెట్టుబడిదారులున్న ఏ దేశంలోనైనా గానీ, పత్రికా స్వేచ్ఛ అంటే అర్థం వార్తాపత్రికలను కొనుగోలు చేసే స్వేచ్ఛ, రచయితలను కొనుగోలు చేసే స్వేచ్ఛ, బూర్జువాలకనుకూలంగా 'ప్రజాభిప్రాయాన్ని' కొనుగోలు చేసే స్వేచ్ఛ మాత్రమే.

\----

రాజ్యం మనుగడలో ఉన్నప్పుడు స్వేచ్ఛ ఉండదు. సేచ్ఛ ఉన్నప్పుడు రాజ్యం మనుగడలో ఉండదు.

\----

విజయానికి మూడు సూత్రాలున్నాయి. ఒకటి అధ్యయనం, రెండు అధ్యయనం, మూడు అధ్యయనం.

\----

అధికారిక, లిబరల్ సైన్సు అంతా వేతన-బానిసత్వాన్ని సమర్ధిస్తుంది, కానీ మార్క్సిజం మాత్రం ఆ బానిసత్వం మీద తెరపులేని యుద్ధాన్ని ప్రకటిస్తుంది.

\----

కార్మికులు భారం మోసేంతకాలం పెట్టుబడిదారులు ఎంతటి సంక్షోభం నుండైనా బయటపడిపోతారు.

\----

ప్రధానంగా కార్మికులను విప్లవకారులుగా అభివృద్ధి చేయడంపై కేంద్రీకరించాలి, అంతేకాని మనం "కార్మికజన బాహుళ్యం" స్థాయికి దిగిపోవడం మన కర్తవ్యం కాదు.

\----

కార్మికవర్గ సైన్యంలో మహిళా విభాగానికి చాలా ప్రాముఖ్యత ఉంది....విప్లవ విజయం అనేది అందులో మహిళలు ఎంతవరకు పాల్గంటున్నారు అనేదానిపై ఆధారపడి ఉంటుంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

పోస్టు స్టాంపు

ఇంటి నెంబరు ..............................

వీధి..............................

గ్రామం..............................

మండలం లేదా పట్టణం..............................

జిల్లా..............................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.